
గురువారం 2-1-2020


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 282



మార్కెట్ లాభాల బోణి

52 పాయింట్లు పెరిగి 41,306కు చేరిన సెన్సెక్స్....
- బిజినెస్‌లో



అటు 'టోక్యో'... ఇటు టి20

ఈ ఏడాది రెండు ప్రతిష్టాత్మక ఈవెంట్స్‌లో భారత క్రీడాకారులపై దృష్టి
- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | WARANGAL | KHAMMAM | MAHABOOBNAGAR | KARIMNAGAR | MUMBAI | HYDERABAD | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM



వచ్చే ఏడాది చంద్రయాన్-3

కీలక ప్రకటన చేసిన ఇస్రో చైర్మన్ కె.శివన్

"ప్రతిష్టాత్మక 'గగన్‌యాన్'లో భాగంగా శిక్షణ పొందడానికి భారత వాయు సేనకు చెందిన నలుగురు సిబ్బందిని ఎంపిక చేశాం. జనవరిలో వీరికి రష్యాలో శిక్షణ ప్రారంభం కానుంది. చంద్రయాన్-3 ప్రాజెక్టుతోపాటు 'గగన్‌యాన్' కార్యకలాపాలు సాఫీగా సాగుతున్నాయి.

– శివన్

5లో



కొత్త వ్యూహాత్మక ఆయుధం

త్వరలో ప్రపంచానికి చూపుతానన్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్

- వివరాలు 5లో

ప్రభుత్వ ఆదేశాలే అనుసరిస్తాం

రాజకీయాలకు మేము దూరం: రావత్

"ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ కలసి పనిచేస్తాయని హామీ ఇస్తున్నా. సీడీఎస్‌గా వాటిని పర్యవేక్షిస్తూ నియంత్రిస్తూ ఉంటా. కానీ ఏ పనైనా త్రివిధ బలగాలు ఒకరికొకరు సహకారం అందించుకుంటూ పనిచేస్తాయి. మేము రాజకీయాలకు దూరం. అధికారంలో ఎవరుంటారో వారి ఆదేశాల మేరకే పనిచేస్తాం.

– సీడీఎస్ రావత్

5లో





నుమాయిష్ షురూ

- 80వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించిన మంత్రులు
- ఏడాదిలో పలుమార్లు నిర్వహించాలి: హోంమంత్రి మహమూద్ అలీ
- అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం: తలసాని
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రకాల ఉత్పత్తులు లభ్యం: ఈటల

- వివరాలు 4లో



ఈ దశాబ్దం టీఆర్‌ఎస్‌దే..

తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉంచుతాం: మంత్రి కేటీఆర్

- మున్సిపల్ ఎన్నికల్లో సింహభాగం గెలుస్తాం
- ఉత్తమ్ రాజీనామాపై మాట్లాడను.. కాంగ్రెస్‌ను తేలిగ్గా తీసుకోం
- ఎన్నేళ్లయినా బీజేపీకి ఎదుగూ బొదుగూ ఉండదు
- పొరుగు రాష్ట్రాలతో ప్రేమగా ఉంటాం
- నదుల అనుసంధానంపై నిర్ణయం జరగలేదు

సాక్షి, హైదరాబాద్: 'కొత్త దశాబ్దం 2020–30 టీఆర్ఎస్, తెలంగాణదే. ఇప్పటికే అభివృద్ధి, సంక్షేమ రంగాలకు చిరునామాగా మన రాష్ట్రం. ఇకపై అక్షరాస్యతతో సహా అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉండేలా తీర్చిదిద్దుతాం'అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సింహభాగం స్థానాలు టీఆర్ఎస్ గెలుస్తుందని, పార్టీపరంగా 2019లో కొన్ని ఎత్తుపల్లాలు చూసినా అద్భుతంగా రాణిస్తున్నట్లు చెప్పారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ సీఎం అవుతారని వస్తున్న వార్తలను ప్రస్తావించగా.. తానే సీఎంగా కొనసాగుతానంటూ కేసీఆర్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేసినా ఇంకా అనుమానాలు ఎందుకని తిరిగి ప్రశ్నించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీల నిర్మాణం పూర్తి చేసుకున్నామని, 30 జిల్లాల్లో పార్టీ భవనాలను సంక్రాంతి తర్వాత సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని వెల్లడించారు. పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతుల నిర్వహణపై కసరత్తు చేస్తున్నామని, మున్సిపల్ ఎన్నికలపై క్షేత్రస్థాయి నుంచి నివేదికలు అందిన తర్వాత ఈ నెల 5, 6 తేదీల్లో కేసీఆర్ అధ్యక్షతన టీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో ▶

సమర్థంగా మున్సిపల్ చట్టం

'కొత్త మున్సిపల్ చట్టాన్ని సమర్థంగా అమలుచేయడమే సంబంధిత శాఖ మంత్రిగా నా ముందున్న సవాలు. ఆస్తిపన్ను తదితర అంశాల్లో స్వయం ధ్రువీకరణ తప్పని తేలితే 25 రెట్లు జరిమానా విధిస్తాం. అక్రమ నిర్మాణాలు, భవనాలను నియంత్రించేందుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో 6 బృందాలు ఏర్పాటు చేస్తాం. మున్సిపల్ ఎన్నికల తర్వాత పార్టీలకతీతంగా కొత్త కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి నిధులు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించి, తప్పులు చేస్తే పదవి నుంచి తొలగిస్తాం. కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులకు ప్రతి 3 నెలలకోసారి శిక్షణ ఇస్తాం. పల్లె ప్రగతితో పాటు పట్టణ ప్రగతిని సమాంతరంగా చేపట్టి ఫలితాలు సాధిస్తాం'.



చొరబాట్లను ఆపుతూ అమరులయ్యారు

- పాక్ నుంచి చొరబాటుకు ఉగ్రవాదుల యత్నం
- అడ్డుకున్న జవాన్లు
- ఇరువర్గాల మధ్య కాల్పులు
- ఇద్దరు సైనికుల వీరమరణం
- జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఘటన
- పలుచోట్ల జవాన్ల సోదాలు

- వివరాలు 5లో



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. 30 వేలకు పైగా భక్తులు వచ్చినట్లు అంచనా. రద్దీ కారణంగా క్యూలైన్లలో భక్తులు నిండిపోయి ఆలయ వీధుల్లోకి వచ్చారు.

నేటి నుంచి రెండో విడత 'పల్లె ప్రగతి'

12,751 పంచాయతీల్లో సందడే సందడి

11 రోజులు.. కార్యక్రమం కొనసాగేది

- పచ్చదనం–పరిశుభ్రతకు ప్రాధాన్యత
- పనులు, నిధులు, విధులపై ఫ్లయింగ్ స్క్వాడ్ల తనిఖీలు
- పంచాయతీల పనితీరూ మదింపు..

- వివరాలు 3లో



2 రోజులు... రూ. 400 కోట్లు!

- కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికిన మందుబాబులు
- డిసెంబర్ 30, 31 తేదీల్లో రూ.400 కోట్ల విలువైన మద్యం తాగిన వైనం
- 4.5 లక్షల కేసుల బీర్లు, 5 లక్షల కేసుల లిక్కర్ అమ్మకాలు!
- రాష్ట్రవ్యాప్తంగా 3,150 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 950 కేసులు

సాక్షి, హైదరాబాద్: కొత్త సంవత్సరం మందుబాబులకు మంచి 'కిక్కు' ఇచ్చింది. నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ డిసెంబర్ 30, 31 తేదీల్లో రూ.400 కోట్లకు పైగా విలువైన మద్యాన్ని తాగిపారేశారు లిక్కర్ రాయుళ్లు. ఈ రెండు రోజుల్లో దాదాపు 10 లక్షల కేసుల మద్యం విక్రయాలు జరగడం విశేషం. గత ఏడాది డిసెంబర్ చివరి వారమంతా కలిసి రూ.600 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరగ్గా, చివరి రెండు రోజుల్లోనే రూ.400 కోట్ల విలువైన లిక్కర్ అమ్ముడుపోయిందని అంచనా. రాష్ట్రంలో రోజుకు సగటున రూ.62 కోట్ల వరకు మద్యం వ్యాపారం జరుగుతుండగా, న్యూ ఇయర్ సందర్భంగా చివరి రెండు రోజులు కలిపి అందుకు ఆరున్నర రెట్లు విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు చెపుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోనే రూ.100 కోట్లకు పైగా విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ వర్గాలంటున్నాయి. ఇక బీర్లు, లిక్కర్ వారీగా చూస్తే ఈ 2 రోజుల్లో దాదాపు 4.5 లక్షల కేసుల బీర్లు, 5.10 లక్షల కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి లిక్కర్ అమ్మకాలు భారీగా పెరగడం గమనార్హం.

ఊగుతూ... తూలుతూ....


తాగడంతో ఆగకుండా అలాగే డ్రైవింగ్ కూడా చేశారు మందుబాబులు. పోలీసుల హెచ్చరికలు లెక్కచేయకుండా తాగి రోడ్ల మీదకు వచ్చిన వాహనదారులు డ్రంకెన్ డ్రైవింగ్‌లో దొరికిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 3,150 మంది మందుబాబులు డ్రైవింగ్ చేస్తూ బ్రీత్ అనలైజర్ టెస్టుల్లో పోలీసులకు దొరికిపోయారు. వీరిలో

మిగతా 2వ పేజీలో ▶

ఎప్పుడంటే అప్పుడే పరీక్షలు

విద్యార్థులు చెప్పినప్పుడే నిర్వహణ ● భవిష్యత్తులో ఆన్ డిమాండ్ పరీక్షల విధానం

- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో అమలుకు సిఫారసు
- కేంద్రానికి యూజీసీ ప్యానెల్ కమిటీ నివేదిక
- మార్కుల స్థానంలో సీజీపీఏ అమలు చేయాలని సూచన



సాక్షి, హైదరాబాద్: బీఏ, బీకాం, బీఎస్సీ, బీఈ/బీటెక్, బీబీఏ వంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఆన్ డిమాండ్ పరీక్షల విధానం భవిష్యత్తులో రాబోతోంది. విద్యార్థులు తాము పరీక్షలకు సిద్ధంగా ఉన్నామని చెప్పినప్పుడే పరీక్షలు నిర్వహించే విధానం అమలు చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్యానెల్ కమిటీ సిఫారసు చేసింది. పరీక్షల నిర్వహణకు విద్యా సంస్థల సంసిద్ధత ముఖ్యం కాదని, విద్యార్థుల సంసిద్ధతే ప్రధానమని స్పష్టం చేసింది. దీని ద్వారా పరీక్షల్లో ఫెయిల్ అయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గించొచ్చని, మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించొచ్చని పేర్కొంది. దేశంలో పరీక్షల సంస్కరణలపై కేంద్రం 2018 మేలో భారతీ విద్యా పీఠ్ వైస్ చాన్స్‌లర్ ఎంఎం సాలుంఖే నేతృత్వంలో యూజీసీ ప్యానెల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఏడాదిన్నర కాలంగా పరీక్షలు, మూల్యాంకనానికి సంబంధించిన అంశాలపై సమగ్ర అధ్యయనం చేసింది. సంప్రదాయ డిగ్రీలు, సాంకేతిక డిగ్రీ, వృత్తి విద్యా డిగ్రీ కోర్సుల్లో పరీక్షలు, పేపరు వ్యాల్యుయేషన్, మార్కుల విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసింది. తాము గుర్తించిన అంశాలను క్రోడీకరించి, పలు సిఫారసులతో కూడిన నివేదికను ఇటీవల కేంద్రానికి అందజేసింది. ఆన్ డిమాండ్ పరీక్షల విధానం అమల్లోకి తేవడం వల్ల విద్యార్థులపైనా ఒత్తిడి తగ్గుతుందని, ప్రతిభకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొంది.

ప్రత్యేక క్వశ్చన్ బ్యాంకు..

ఆన్ డిమాండ్ పరీక్షల విధానం అమలుకు ఎక్కువ కృషి అవసరమని ప్యానెల్ కమిటీ పేర్కొంది. అలాగే సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్ వినియోగం అవసరమని, క్వశ్చన్ బ్యాంకు విధానం ఉండాలని స్పష్టం చేసింది. క్వశ్చన్ బ్యాంకును ఏర్పాటు చేసి, వాటి నుంచి ఎప్పుడంటే అప్పుడు ప్రశ్నపత్రాలను తీసుకునేలా ఉండాలని పేర్కొంది. అయితే ఇదీ ఆన్‌లైన్ విధానంతో కొంత సులభం అవుతుందని సూచించింది. మరోవైపు ఆన్ డిమాండ్ పరీక్షల అమలును పర్యవేక్షించేందుకు, పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ఈ విధానాన్ని అమలు చేస్తోంది. అయితే రెగ్యులర్ డిగ్రీ కోర్సుల్లో

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ జాతర్



మాకండగా నిలవడం నేరమా!... ... సారీ రైతులకు...!!

NEWS PAPERS
తెలుగు

GET IT ON
Google Play

Size : below 8 mb



నేడు, రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తర ఒడిశా, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారింది. మరోవైపు రాష్ట్రంలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో గురు, శుక్రవారాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని



హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుండగా గత 24 గంటల్లో నల్లగొండలో సాధారణం కంటే 2.9 డిగ్రీలు తక్కువగా 14.2 డిగ్రీల సెల్సియస్ రాత్రి ఉష్ణోగ్రత నమోదు కాగా.. మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్‌లో సాధారణం కంటే 6.4 డిగ్రీలు ఎక్కువగా 20.1 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత రికార్డవడం గమనార్హం. ఇక పగటి ఉష్ణోగ్రతలు అనేకచోట్ల సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. భద్రాచలంలో మాత్రం పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 1.4 డిగ్రీలు అధికంగా 30.8 డిగ్రీలుగా రికార్డయింది.

ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించాలి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆకాంక్షించారు. బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన డైరీని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందంగౌడ్, పర్వత్‌రెడ్డి, డైరీ కన్వీనర్ ఏవీ సుధాకర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, సమస్యలు తీర్చేలా ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌ను సదానందంగౌడ్, పర్వత్‌రెడ్డి కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. వివిధ పేర్లతో పాఠశాలలు మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్‌సీసీ డీడీజీగా కృష్ణన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నేషనల్ క్యాడెట్ కోర్(ఎన్‌సీసీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఎయిర్ కమాండర్ టీఎస్ఎస్ కృష్ణన్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. 1991 ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బ్యాచ్‌కు చెందిన కృష్ణన్ కమాండ్ నావిగేషన్, ఇంటెలిజెన్స్, ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆఫీసర్‌గా ఢిల్లీలోని ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. కాగా ఇప్పటి వరకు డీడీజీగా పనిచేసిన ఎన్ఎన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పదవీ విరమణ చేయటంతో ఏర్పడిన ఖాళీని కృష్ణన్‌తో భర్తీ చేశారు.



రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం రాత్రి ఎలాంటి ప్రమాదాలు జరగలేదని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. స్వీయ నియంత్రణతో ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసు శాఖకు సహకరించిన రాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రమాద రహితంగా నిర్వహించడంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.




అక్షరాస్యత లక్ష్యాన్ని చేరుకోవాలి: వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ పిలుపు మేరకు వంద శాతం అక్షరాస్యత లక్ష్యాన్ని చేరుకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్‌బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం టీఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, రహమతుల్లా సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంకా పాత పద్ధతిలోనే విద్యా విధానం: రామయ్య

సాక్షి, హైదరాబాద్: విద్యా విషయాల్లో దేశాలు కొత్త అంశాలతో ముందుకు పోతుంటే మనం ఇంకా పాత పద్ధతులనే పాటిస్తున్నామని, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్యావేత్త చుక్కా రామయ్య అభిప్రాయపడ్డారు. బుధవారం టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చుక్కా రామయ్య మాట్లాడుతూ పిల్లలందరికీ నాణ్యమైన, సమానమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే సాధ్యమవుతుందన్నారు.





బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా గవర్నర్ దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు



బుధవారం రాజ్‌భవన్‌లో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న గవర్నర్ తమిళిసై

సంపూర్ణ అక్షరాస్యతే మా లక్ష్యం!

- ప్రతి ఒక్క నిరక్షరాస్యుడికీ విద్య
- పల్లెప్రగతితో సత్ఫలితాలు సాధిస్తున్నాం
- సాగు నీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం
- మధ్యమానేరుతో 90శాతం రాష్ట్రానికి తాగు నీరు
- గవర్నర్‌తో సుదీర్ఘ భేటీలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్

తెలంగాణను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆవిర్భవించిన ఆరేళ్లలోనే ఎన్నో రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, అక్షరాస్యత విషయంలో వెనుకబడి ఉండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో 100 శాతం అక్షరాస్యతను సాధించాలని కొత్త సంవత్సరం సందర్భంగా ప్రతినబూనామన్నారు. ప్రతి ఒక్క నిరక్షరాస్యుడికి విద్య అందిస్తామన్నారు. బుధవారం ఆయన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు జరిగిన ఈ సుదీర్ఘ భేటీలో సంపూర్ణ అక్షరాస్యత దిశగా అమలు చేయబోతున్న కార్యక్రమాలు, పల్లె ప్రగతి కార్యక్రమం లక్ష్యాలు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో రాష్ట్రానికి కలగనున్న ప్రయోజనాలతో పాటు వర్తమాన రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం.

జనవరి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమం ప్రారంభమవుతోందని, ఇందులో భాగంగా గ్రామీణ నిరక్షరాస్యుల సమాచారాన్ని సేకరించి జాబితాల రూపకల్పన చేస్తున్నామన్నారు. 'ఈచ్ వన్–టీచ్ వన్'నినాదంతో ప్రతీ విద్యావంతుడు ఓ నిరక్షరాస్యుడికి చదువు చెప్పాలని పిలుపునిచ్చామన్నారు. వచ్చే మూడు నెలల్లోగా సాధ్యమైనంత అధిక మంది నిరక్షరాస్యులు కనీసం రాయడం, చదవగలిగేలా అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తామని గవర్నర్‌కు వివరించినట్టు తెలిసింది. పరిశుభ్రమైన, ఆరోగ్యమైన పల్లెల కోసం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని సీఎం తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నీళ్లతో మధ్యమానేరు జలాశయంలో జల కళ నెలకొందని, ఇక్కడి నుంచి 80–90 శాతం రాష్ట్రానికి తాగునీరు సరఫరా కానుందని తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతలను ఈ సందర్భంగా సీఎం గవర్నర్‌కు సుదీర్ఘంగా వివరించినట్టు తెలిసింది. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం తెలంగాణ ప్రజలు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, అందుకే జల ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలు, సాధించిన ఫలితాలను గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 100 రోజుల పాలనపై తాను కేంద్రానికి పంపించిన నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, సాగునీరు, విద్యారంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతలను వివరించినట్టు సీఎంకు గవర్నర్ తెలియజేసినట్టు తెలిసింది. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సేవా కార్యక్రమాలను సైతం గవర్నర్ ప్రస్తావించారు.

ప్రజాదర్బార్‌కు ప్రత్యేక వ్యవస్థ

- సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కరిస్తాం
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించి, పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తామని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. నూతన సంవత్సరం సందర్భంగా రాజ్‌భవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి సందర్శకుల నుంచి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు తెలుగులో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలు మంచి మనసున్న వాళ్లని, పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని కొనియాడారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా అభివృద్ధి, సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గవర్నర్‌గా వంద రోజులు పూర్తి చేసుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. వంద రోజుల పాలనపై రాష్ట్రపతికి నివేదిక ఇచ్చానని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇరిగేషన్, వ్యవసాయ, విద్యా రంగాల్లో అభివృద్ధి దిశగా పనిచేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు వెల్లడించారు. 2019లో బతుకమ్మ ఆటలు, గిరిజనులతో మమేకం కావడం సంతృప్తినిచ్చాయని పేర్కొన్నారు. ఇటీవల తాను సందర్శించిన బోడగూడెం అనే తండాకు చెందిన గిరిజనులను రాజ్‌భవన్‌కు ఆహ్వానించానని, వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా.. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు గవర్నర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ దశాబ్దం టీఆర్‌ఎస్‌దే..

▶ మొదటి పేజీ తరువాయి

విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు.

సవాళ్లను ఎదుర్కొంటాం...

పాలనాపరంగా ప్రతికూలత ఎదురైనా అవకాశాలుగా మలచుకోవడంలో కేసీఆర్‌ది అందెవేసిన చేయి. 'దిశ'ఘటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు, ఆర్టీసీ కార్మికుల సమ్మె తదితర సమయాల్లో సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో ప్రభుత్వం, పార్టీ రుజువు చేసి చూపింది. ఏపీ సీఎం జగన్‌తోనే కాదు, పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌తోనూ పొరుగు వారిని ప్రేమించాలనే నినాదంతో ముందుకెళ్తాం. పోతిరెడ్డిపాడు కాల్వ వెడల్పుకు సంబంధించి చిన్న చిన్న సమస్యలు వచ్చినా, పరిణతితో అర్థం చేసుకుని ముందుకు వెళ్తాం. కృష్ణా–గోదావరి నదుల అనుసంధానానికి సంబంధించి ఇప్పటివరకు నిర్ణయం జరగలేదు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిష్క్రమిస్తున్నారనే వార్తలపై మాట్లాడను. కాంగ్రెస్ పార్టీ కాడిని కింద పడేసిందనలేం. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న కాంగ్రెస్‌ను ఆషామాషీగా తీసుకోం. బీజేపీ నా బాల్యం నుంచి ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. అప్పుడప్పుడూ అదృష్టం కలిసొచ్చి ఒకటీ అరా సీట్లు గెలిచింది'అని పేర్కొన్నారు. కాగా, పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూలంగా, ప్రతికూలంగా రాష్ట్రంలో అనేక ర్యాలీలు జరిగాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే సున్నితమైన ప్రాంతంలో సభకు కాంగ్రెస్ ప్రయత్నించినందుకే అనుమతి నిరాకరించినట్లు తెలిపారు. ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కేసీఆర్‌ను మించిన పెద్ద హిందువు ఎవరున్నారని, ఆయనలా యాగాలు, మందిర నిర్మాణం ఎవరు చేశారని ప్రశ్నించారు.

సదరన్ ఇండస్ట్రియల్ కారిడార్ పెట్టాలి

'రక్షణ రంగ పరిశోధన, ఉత్పత్తులకు సంబంధించి హైదరాబాద్, బెంగళూరు కీలకం. రెండు పట్టణాల నడుమ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ పెట్టాల్సి ఉండగా, బుందేల్‌ఖండ్‌కు తరలించారు. ఢిల్లీ–ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ తరహాలో సదరన్ ఇండస్ట్రియల్ కారిడార్ పెడితే దక్షిణాదిన హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు రాయలసీమ ప్రాంతానికి మేలు కలుగుతుంది. దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో రాష్ట్రాలను కూడా భాగస్వాములను చేయాలి. మౌలిక సదుపాయాల కోసం కేంద్రం ప్రతిపాదించిన రూ.1.06 లక్షల కోట్లకు సంబంధించి బడ్జెట్‌లో పూర్తి వివరాలు వచ్చిన తర్వాత రాష్ట్రానికి ఎంత మేర మేలు జరుగుతుందో తెలుస్తుంది. చుట్టూ భూభాగం ఆవరించిన ఉన్న తెలంగాణలో భవిష్యత్తులో ఇన్‌లాండ్ వాటర్‌వేస్ ద్వారా భద్రాచలం వరకు నౌకలు వచ్చే అవకాశం ఉంది. మల్లన్నసాగర్, మిడ్‌మానేరు, శ్రీశైలంలో సీ ప్లేన్‌లు దిగే అవకాశం ఉంటుంది. విజయవాడ మార్గంలో నకిరేకల్ సమీపంలో డ్రైపోర్టు ప్రతిపాదిత దశలో ఉంది. ఎంఎంటీఎస్ రెండో దశ, ఫలక్‌నుమా నుంచి మెట్రో పొడిగిస్తాం. జేబీఎస్–సీబీఎస్ మెట్రోమార్గాన్ని త్వరలో సీఎం ప్రారంభిస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మా పార్టీలో కార్యకర్తల నడుమ తీవ్ర పోటీ ఉంది. నామినేటెడ్ పదవులు, ఇతర అవకాశాలు ఇస్తామని కాళ్లు పట్టుకుని, కడుపులో తలపెట్టి బతిమిలాడుతాం. ఇద్దరు ముగ్గురు బలమైన అభ్యర్థులు ఉన్న చోట అంతర్గత పోటీ నివారిస్తాం. ఎంఐఎం మిత్రపక్షమైనా మున్సిపల్ ఎన్నికల్లో కలసి పోటీ చేయబోం'అని కేటీఆర్ వివరించారు.



2 రోజులు... 400 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

అత్యధికంగా హైదరాబాద్ నుంచే ఉన్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 950 మంది, సైబరాబాద్ పరిధిలో 873 మంది మందుబాబులు చిక్కారు. రాచకొండలో మాత్రం స్వల్పంగా 281 కేసులే నమోదయ్యాయి. ఇక కరీంనగర్‌లో 148, నల్లగొండలో 152, సిద్దిపేటలో 99 చొప్పున మందుబాబులు దొరికారు. పట్టుబడిన వారిలో దాదాపు 1,500 మంది 18 నుంచి 35 ఏళ్లలోపు వారే. పట్టుబడిన వారిలో అందరూ విద్యావంతులే కావడం విశేషం. వీరిలో పలువురికి జరి మానాలు విధించగా, కొందరి వాహనాలను స్టేషన్లకు తరలించారు. మంగళవారం రాత్రి 10 గంట లకు మొదలైన పోలీస్ స్పెషల్ డ్రైవ్ బుధవారం ఉదయం 8 గంటల వరకు సాగింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఇంతమంది దొరకడంతో వీరందరి డ్రైవింగ్ లైసెన్సుల్లో పాయింట్లు నమోదు చేయాలని పోలీసులు నిర్ణయించారు. ఆల్కహాలు తీవ్రత ఆధారంగా వీరందరి డ్రైవింగ్ లైసెన్సుల్లో పాయిం ట్లు నమోదు చేస్తారు. ఆల్రెడీ 12 పాయింట్లకు చేరువలో ఉన్నవారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

ఎప్పుడంటే అప్పుడే పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

అమలుకు ప్రత్యేక ఏర్పాట్లు అవసరమని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో 2,75,54,749 మంది విద్యార్థులు రెగ్యులర్ డిగ్రీలు చేస్తుండగా, 26,99,567 మంది దూర విద్యా విధానంలో డిగ్రీలను చదువుతున్నారు. ఈ నేపథ్యంలో ఆన్ డిమాండ్ పరీక్షలను ముందుగా దూర విద్యా విధానంలో నిర్వహించేందుకు కోర్సుల్లో యూనివర్సిటీలు ప్రవేశ పెట్టాలని పేర్కొంది. ఆ తర్వాత రెగ్యులర్ కోర్సుల్లో అమలు చేయాలని సూచించింది. ఇందులో వయసు, అర్హతలకు సంబంధించిన ఆంక్షలు ఉండకూడదని పేర్కొంది.

సామర్థ్యాలు, నాలెడ్జి, నైపుణ్యాలే ముఖ్యం

ప్రస్తుత విద్యా విధానాల్లో సమూల మార్పులు అవసరమని పేర్కొంది. మూల్యాంకన విధానంలో మార్పులు తీసుకురావాలని తెలిపింది. ఉత్తీర్ణత ఒక్కటే ముఖ్యం కాదని పేర్కొంది. ప్రస్తుతం దేశంలోని విద్యా సంస్థల నుంచి అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని బయటికొస్తున్న వారిలో అత్యధిక మంది ఉద్యోగాలకు పనికి రావట్లేదని తెలిపింది. అందుకే ఉత్తీర్ణత ఒక్కటే ముఖ్యం కాదని, అభ్యసనలో ఎంత మేరకు నేర్చుకున్నారు.. ఏ మేరకు సామర్థ్యాలను పెంపొందించుకున్నారు.. విజ్ఞానాన్ని ఎంత మేర సముపార్జించారు.. నైపుణ్యాలను ఏ మేరకు పెంపొందించుకున్నారన్నదే ముఖ్యమని వివరించింది.

ఐఐటీ తరహాలో గ్రేడింగ్..

విద్యార్థులకు పరీక్షల్లో వచ్చే మార్కులకు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఇచ్చే అబ్సల్యూట్ గ్రేడింగ్ (పర్సంటేజీ ప్రకారం ఇచ్చే గ్రేడ్) కాకుండా రిలేటివ్ గ్రేడింగ్ లేదా క్యుమ్యులేటివ్ గ్రేడింగ్ విధానం ఇవ్వాలని పేర్కొంది. ప్రస్తుతం దేశంలోని ఐఐటీ, ప్రైవేటు యూనివర్సిటీలు క్యుమ్యులేటివ్ గ్రేడింగ్ విధానాన్ని (సీజీపీఏ) అమలు చేస్తున్నాయని, ఇందులో విద్యార్థికి సంవత్సరం చివరలో నిర్వహించే పరీక్షల్లో వచ్చే మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, ఏడాదిలో పలుసార్లు నిర్వహించే పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటారు. తద్వారా ఒక రోజు పరీక్షతో విద్యార్థిని అంచనా వేయకుండా, ఏడాది పొడవునా సాధించిన సామర్థ్యాలను అంచనా వేయడం శాస్త్రీయంగా ఉంటుందని పేర్కొంది.

దేశంలోని విద్యార్థుల వివరాలు..

కేటగిరీ	సంఖ్య	మొత్తం విద్యార్థులు	డిగ్రీ విద్యార్థులు
యూనివర్సిటీలు	993	69.46 లక్షలు	43,03,232
కాలేజీలు	41,901	2.6 కోట్లు	2,31,96,012
ప్రత్యేక విద్యాసంస్థలు	10,726	20.23 లక్షలు	55,505
మొత్తం	53,620	3.49 కోట్లు	2,75,54,749

(డిస్టెన్స్ విద్యార్థులు సహా)

ఆర్‌అండ్‌బీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2020 డైరీ, క్యాలెండర్‌ను ఆ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, న్యాక్ డీజీ భిక్షపతి, చీఫ్ ఇంజనీర్ సతీశ్, చందూలాల్, అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గృహనిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ చిత్రారామచంద్రన్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.





బుధవారం తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ. చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సూర్యకరణ్‌రెడ్డి. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కేంద్రం ఆమోదిస్తేనే జడ్జీల సంఖ్య పెంపు

కేంద్రం నుంచి అనుమతి రాకుండా ఏమీ చేయలేం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ
- ఘనంగా తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య పెంపు ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ తెలిపారు. 24 మంది న్యాయమూర్తుల సంఖ్యను 42కి పెంచాలనే ప్రతిపాదనతోపాటు ఖాళీల భర్తీ ఫైలు కేంద్రం వద్దనే ఉందని వెల్లడించారు. ప్రస్తుతం 24 మంది న్యాయమూర్తులకుగాను సీజే సహా 13 మందే ఉన్నారని, ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీకి కేంద్రం చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ప్రధాని సమక్షంలోనే కేంద్ర న్యాయశాఖ మంత్రిని ఒకటి రెండుసార్లు కోరినట్టు చెప్పారు. కేంద్రం నుంచి అనుమతి రాకుండా సుప్రీంకోర్టు కూడా ఏమీ చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ వేడుకలు బుధవారం రాత్రి హైకోర్టు ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్.వి.రమణ.. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడారు. న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కూడా ఆసక్తిగానే ఉందన్నారు. తెలంగాణ హైకోర్టులోనే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టుల ఖాళీలతోపాటు ఉన్న పోస్టుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడే సత్వర న్యాయం జరిగేందుకు మార్గం సులభం అవుతుందని, పెండింగ్ కేసుల భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీ కోసం బార్ అసోసియేషన్లు, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న అదనపు సొలిసిటర్ జనరల్ టి.సూర్యకరణ్‌రెడ్డి వంటివారు ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన సూచించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే కూడా పెండింగ్ క్లియరెన్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఫైలు ఏదైనా వస్తే వారం రోజుల్లోనే పరిష్కరిస్తున్నారని చెప్పారు.

సత్వర న్యాయం అందించేందుకు కృషి

అడ్వొకేట్స్ అకాడమీకి రాష్ట్ర ప్రభుత్వం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సమీపంలో పది ఎకరాలను కేటాయించడానికి ముందుకు రావడం పట్ల జస్టిస్ ఎన్.వి.రమణ హర్షం వ్యక్తంచేశారు. భూమి కేటాయించడానికి అంగీకరించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త భవన నిర్మాణాలు జరిగేలోగానే న్యాయవాదులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సత్వర న్యాయం కోసం అందరూ కృషి చేయాలని.. న్యాయమూర్తుల ద్వారానే సత్వర న్యాయం పూర్తిగా లభించదని, బార్ అసోసియేషన్, న్యాయవాదుల సహకారం కూడా ఇందుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మనదేశంలో లీగల్ ఎయిడ్ కోసం రూ.100 కోట్ల వరకూ ఖర్చు చేస్తున్నామని తెలిపారు. సత్వర న్యాయం అందించేందుకు సుప్రీంకోర్టు సీజే కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ విషయంలో తాను కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానని జస్టిస్ రమణ వెల్లడించారు.

పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయ్..

తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 24 నుంచి 42కి పెంచాలని, అలాగే ఖాళీగా ఉన్న 11 న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పేర్కొన్నారు. న్యాయమూర్తులు తక్కువగా ఉన్న కారణంగా పెండింగ్ కేసుల సంఖ్య బాగా పెరిగిపోతోందని తెలిపారు. శనివారం కూడా కోర్టులు పనిచేస్తూ పెండింగ్ కేసుల్ని తగ్గించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ.. కేసుల విచారణలో ప్రధాన న్యాయమూర్తి క్రియాశీలక నేతృత్వంలో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. అడ్వొకేట్స్ అకాడమీకి ప్రభుత్వం పది ఎకరాల భూమి ఇచ్చేందుకు ముందుకు రావడం హర్షణీయమని బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సత్వర న్యాయం కోసం న్యాయమూర్తుల పోస్టుల ఖాళీల భర్తీకి అందరూ కృషి చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, దక్షిణాది రాష్ట్రాల హైకోర్టులకు అదనపు సొలిసిటర్ జనరల్ టి.సూర్యకరణ్‌రెడ్డి కోరారు.

కనువిప్పు కలిగేనా?

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మరికొన్ని ప్రాజెక్టులకు కూడా లీకేజీ ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు కర్ణాటకలో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వరదలవల్ల నిండుకుండల్లా ఉన్న ప్రాజెక్టుల కట్టలు ఎప్పుడు తెగుతాయో అనే భయం ఆయా ప్రాంతాల ప్రజలను వెంటాడుతోంది. క్రమంగా కోతలకు గురవుతున్న ప్రాజెక్టు కట్టలు, మరమ్మతుకు నోచుకోని గేట్లు ఎప్పుడు కూలుతాయోననే ఆందోళన ఇరిగేషన్ అధికారులకూ పట్టుకుంది. సరళాసాగర్ ప్రాజెక్టు కట్టకు గండి పడడంతో ఉలిక్కిపడ్డ ఇరిగేషన్ శాఖ అధికారులు అలాంటి సమస్యలున్న ప్రాజెక్టులు, చెరువులపై దృష్టి సారించారు. కోతలకు గురై మరమ్మతుకు నోచుకోని కట్టలు.. ప్రాజెక్టుల గేట్ల పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. సరళాసాగర్ మాదిరిగానే ఉమ్మడి జిల్లాలోని ప్రియదర్శిని జూరాల, దేవరకద్ర ప్రాజెక్టులతో పాటు పలు సాగునీటి కాలువలు, చెరువులకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఉమ్మడి పాలమూరులో మరికొన్ని ప్రాజెక్టులకు లీకేజీ ముప్పు!

- దెబ్బతిన్న జూరాల ప్రాజెక్టు కరకట్ట
- కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల నుండి నీరు లీకేజీ, కోతకు గురైన కట్ట
- కోతలకు గురైన గుడిపల్లి రిజర్వాయర్ బ్రాంచ్ కెనాల్
- నిధుల కొరతే అసలు సమస్య

మరమ్మతుకు నిధుల్లేవ్!

ఏటా వేసవిలోనే చెరువులు, కాల్వలు, ప్రాజెక్టుల కట్టలు, గేట్లను పరిశీలించి కాలువ కట్టల మరమ్మతు, తూముల నిర్వహణ, పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే రెండేళ్ల నుండి నిధులు లేవని.. అందుకే మరమ్మతు చేపట్టలేకపోతున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన ఇరిగేషన్ అధికారి ఒకరు తెలిపారు. కాగా.. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీ (కాడా) ఆధ్వర్యంలో ఆయకట్టు కాలువలకు మరమ్మతు చేపట్టాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి నాబార్డు ద్వారా నిధులు విడుదలవుతాయి. అయితే.. సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనందున నిధుల విడుదలకు కేంద్రం మొండికేస్తోంది. దీంతో కాల్వల మరమ్మతు ప్రశ్నార్థకంగా మారింది.

15 ఏళ్లుగా అలాగే...

ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బందితో కూడిన ప్రాజెక్టు భద్రతా కమిటీ జూరాల ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు చూసుకుంటోంది. ప్రతి మూడేళ్లు లేదా ఐదేళ్లకోసారి ఈ ప్రాజెక్టు గేట్లను ఇసుకతో శుభ్రం చేసి తుప్పును వదిలించాలి. తర్వాత గేట్లకు కలర్ వేయాలి. అయితే 67 గేట్లు కలిగిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మాత్రం పదిహేనేళ్ల నుంచి ఇలాంటి పనులేమీ చేపట్టలేదు. దీంతో ప్రాజెక్టు గేట్లకు తప్పు ఏర్పడింది. లక్ష ఎకరాలకు సాగునీరందించే జూరాల ప్రాజెక్టు గేట్లకు ఒక వేళ సమస్య వస్తే.. ఈ ప్రాజెక్టు కింద ఉన్న నెట్టెంపాడు, భీమా–1, 2, కోయిల్ సాగర్ ప్రాజెక్టులపైనా ఆ ప్రభావం పడుతుంది. ఫలితంగా వాటి పరిధిలో ఉన్న మరో ఐదు లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటి సమస్య వస్తుంది.

శిథిలావస్థలో ఆర్డీఎస్ కాల్వ..



డి-25 సమీపంలో కోతకు గురైన ఆర్డీఎస్ ప్రధాన కాల్వ

వడ్డేపల్లి మండల పరిధి లో ప్రవహించే ఆర్డీఎస్ ప్రధాన కాల్వ డిస్ట్రిబ్యూటరీ 24 నుంచి 28 వరకు శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం కెనాల్‌కు ఇరువైపులా అతికించిన సిమెంట్ బిల్లలు శిథిలమై కాలువ కోతకు గురవుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కాలువకు గండి పడింది. మూడు రోజుల పాటు సాగునీరందక రైతులు ఆందోళన చెందారు.

కోయిల్‌సాగర్..



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేటు నుంచి లీకేజీ అవుతున్న నీరు

దేవరకద్ర మండల పరిధిలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకూ లీకేజీ ముప్పు ఉంది. ప్రాజెక్టుకు 13 గేట్లు ఉండగా.. రెండు గేట్ల కింది భాగం నుంచి నీరు మెల్లగా లీకేజీ అవుతోంది. గతేడాది ప్రాజెక్టు గేట్లకు కింది భాగంలో కొత్త వాచర్లు వేసిన తరువాత లీకేజీ సమస్య కాస్త తీరింది. అయినా కొన్ని చోట్ల లీకేజీ అవుతూ నీరు వృథాగా పోతోంది. మరోపక్క.. ఏడు దశాబ్దాల క్రితం గచ్చురాయితో నిర్మించిన ప్రాజెక్టు అలుగు నుంచి నీటితడి బయటకు వస్తోంది. ప్రమాదం జరగక ముందే అలుగును మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఇటు డ్యామ్ కట్ట సైతం పలు చోట్ల కోతకు గురైంది. ప్రాజెక్టులోకి వెళ్లే మెట్లు ధ్వంసమై ఏడాది దాటినా ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోలేదు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 31.3 అడుగుల వరకు నీరుంది. ఇదిలా ఉండగా నాలుగు దశాబ్దాల నుంచి ప్రాజెక్టు గేట్లు, కట్టకు ఎలాంటి మరమ్మతు చేపట్టలేదు. డ్యామ్ కట్టపై ఉండే ప్లాట్‌ఫాం సైతం మరమ్మతు లేక మట్టి కొట్టుకుపోయింది.

సిబ్బందిని అప్రమత్తం చేశాం


సరళాసాగర్ ప్రాజెక్టుకు గండిపడిన నేపథ్యంలో మా సిబ్బందిని అప్రమత్తం చేశాం. జూరాల ప్రాజెక్టు గేట్ల మరమ్మతు, నిర్వహణకు సంబంధించి ఇప్పటికే టెండర్లు నిర్వహించాం. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం. – రహీముద్దీన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

అవసరమైతే మరమ్మతు చేపడతాం

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లు, కట్టకు ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదు. కట్ట పక్క కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతు చేపడతాం. దానితో పెద్ద ప్రమాదం ఉండదు. మరోసారి పూర్తిగా ప్రాజెక్టు గేట్లు, కాలువను పరిశీలిస్తాం. అవసరమైతే మరమ్మతు చేపడతాం. – విజయానంద్, ఈఈ, కోయిల్‌సాగర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల వివరాలు

ప్రాజెక్టు	ఆయకట్టు ఎకరాల్లో
	ప్రియదర్శిని జూరాల లక్ష + ఆధారిత ప్రాజెక్టుల కింద 5 లక్షలు
కోయిల్‌సాగర్	20 వేలు
సరళాసాగర్	4,200



కేఎల్ఐ 10వ కి.మీ. వద్ద సిమెంటు దిమ్మె భాగంలో కొట్టుకుపోయిన మట్టి

కేఎల్ఐ

వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు వరప్రదాయిని అయిన మహాత్మాగాంధీ లిఫ్టు ఇరిగేషన్ (ఎంజీ కేఎల్ఐ) ప్రాజెక్టు కాలువలు నాణ్యతా లోపాలతో కోతలకు గురవుతున్నాయి. గుడిపల్లి రిజర్వాయర్ నుంచి అచ్చంపేట వరకు 90 కిలోమీటర్ల దూరం ప్రవహించే బ్రాంచ్ కెనాల్ నాణ్యతా లోపంతో అక్కడక్కడ కోతకు గురైంది. అదే కాల్వను అనుసరించి ఏర్పాటు చేసిన సబ్ కెనాల్ సైతం అక్కడక్కడ కోతకు గురైంది. గతేడాది పెద్దాపూర్ వద్ద సబ్ కెనాల్ తెగి పంట పొలాలు మునిగిపోగా అధికారులు తాత్కాలికంగా మరమ్మతు చేశారు.

జూరాల ఇలా..



వరదల కారణంగా దెబ్బతిన్న జూరాల కరకట్ట

కృష్ణానదిపై నిర్మించిన జూరాల ప్రాజెక్టుకూ ముప్పుపొంచి ఉంది. ఉమ్మడి జిల్లా అంతటికీ వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టును 1984లో బహుళార్ధ ప్రాజెక్టుగా తీర్చిదిద్దారు. 11 టీఎంసీల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యంతో జూరాల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు షట్టర్ల సమీపంలోని కరకట్ట మొన్నటి వరదల కారణంగా పూర్తిస్థాయిలో దెబ్బతింది. పుష్కరఘాట్లతో పాటు ఏర్పాటుచేసిన కరకట్ట కూడా నీటి ప్రవాహానికి కూలిపోయింది. వీటిని అధికారులు గుర్తించినా ఇప్పటివరకు మరమ్మతు చేసే ప్రయత్నాలు కూడా చేపట్టక పోవడంతో భవిష్యత్తులో మళ్లీ వరదలు వస్తే కరకట్ట పూర్తిగా కొట్టుకుపోయి ప్రాజెక్టు దెబ్బతినే ప్రమాదముందని నిపుణులు అంటున్నారు.

ఐఎంఎస్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

- ఓమ్ని ఎండీ శ్రీహరి, హోమో క్యూ ఉద్యోగి వెంకటేశ్ అరెస్టు
- డొల్ల కంపెనీతో కోట్లు కొట్టేసిన శ్రీహరిబాబు

సాక్షి, హైదరాబాద్: ఈఎస్ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) కేసులో మరో ఇద్దరు అరెస్టయ్యారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన ఓమ్ని ఫార్మా ఎండీ కంచర్ల శ్రీహరిబాబు అలియాస్ బాబ్జీతోపాటు, హోమో క్యూ కంపెనీ రీజనల్ మేనేజర్ వెంకటేశ్ అరెస్టయ్యారు. 2017–18లో ఐఎంఎస్‌కు ఎలాంటి టెండర్లు లేకుండా, కింది స్థాయి డిస్పెన్సరీల నుంచి ఎలాంటి అవసరం లేకున్నా శ్రీహరిబాబు తెల్ల రక్తకణాల క్యూవెట్, గ్లూకోజు క్యూవెట్ల కొనుగోలుకు పథకం వేశాడు. ఇందుకు లెజెండ్ అనే డొల్ల కంపెనీని సృష్టించాడు. స్వీడన్‌కు చెందిన హోమో క్యూ అనే కంపెనీ తన డిస్ట్రిబ్యూటర్లకు మార్కెట్ రేటుకు తెల్ల రక్తకణాల క్యూవెట్ ఒక్కోటి రూ.11,800, గ్లూకోజు క్యూవెట్లను రూ.1,950లకు విక్రయించేది. హోమో క్యూ డిస్ట్రిబ్యూటర్లు ఆస్పత్రులకు రూ.19,200, రూ.2,250లకు సప్లై చేసేవారు. అయితే, ఈ విషయంలో మార్కెట్ రేటుకే క్యూవెట్లను కొన్న లెజెండ్ కంపెనీ ఐఎంఎస్‌కు మాత్రం తెల్ల రక్త కణాల క్యూవెట్‌ను రూ.36,900కి, గ్లూకోజ్ క్యూవెట్‌ను రూ.6,200కి విక్రయించేవారు. అప్పటి ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి, జేడీ పద్మలకు.. శ్రీహరిబాబు ముందే ముడుపులు ఇవ్వడంతో వారు లెజెండ్ కంపెనీ కోట్ చేసిన ధరను ఆమోదిస్తూ బిల్లులు చెల్లించారు. మొత్తమ్మీద రూ.12,84,96,600 అధికంగా చెల్లించినట్లు ఏసీబీ గుర్తించింది. శ్రీహరి బాబు సరఫరా చేసిన మెడికల్ కిట్ల ధరను 400 శాతం అధికంగా కోట్ చేసి రూ.130 కోట్ల వరకు అక్రమాలకు పాల్పడ్డాడని ఏసీబీ తేల్చింది. నిందితులిద్దరిపై 420, 120బీ తదితర సెక్షన్లపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి రిమాండ్ విధించింది. లెజెండ్ కంపెనీ యజమాని కృపాసాగర్ రెడ్డి కోసం ఏసీబీ అధికారులు గాలిస్తున్నారు.

ఆ మొత్తం వెనక్కు ఇచ్చేయండి..

- రూ.402 కోట్ల 'రైతుబంధు' మొత్తంపై బ్యాంకులకు ఆదేశం
- ప్రస్తుత సీజన్‌కు వాడతారా లేదా అన్నదానిపై స్పష్టత ఇవ్వని సర్కార్
- రబీ పెట్టుబడి సొమ్ము కోసం అన్నదాతల ఎదురుచూపు


సాక్షి, హైదరాబాద్: బ్యాంకుల్లో మూలుగుతున్న 'రైతుబంధు'సొమ్మును సర్కారు తిరిగి వెనక్కు తీసుకోనుంది. ఇటీవల రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆర్థికశాఖ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ మొదలుకానుంది. 2018 ఖరీఫ్‌లో బ్యాంకుల్లో రైతులకు ఇవ్వకుండా కొంత సొమ్ము మిగిలిపోయిన సంగతి తెలిసిందే. దాన్ని వెనక్కు తీసుకోనున్నారు. 2018లో తొలి విడత ఖరీఫ్‌లో పంపిణీ చేయగా దాదాపు రూ. 402 కోట్లు మిగిలినట్లు ఎస్ఎల్‌బీసీ అంచనా వేసింది. ఆ మొత్తాన్ని వెంటనే బదిలీ చేయాలని బ్యాంకులకు, వ్యవసాయశాఖకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెళ్లాయి. 2018 ఖరీఫ్‌లో మొదటిసారి పెట్టుబడి సాయం ఇచ్చేందుకు 57.14 లక్షల చెక్కులను ఆ ఖరీఫ్‌లో ముద్రించారు. వీటి విలువ రూ. 5,634 కోట్లు. ఇందులో రూ. 5,232 కోట్ల విలువైన 50.78 లక్షల చెక్కులను రైతులు నగదుగా మార్చుకున్నారు. భూములున్నవారిలో కొందరు విదేశాల్లో ఉండటం, ఇంకొందరు చెక్కుల ముద్రణ జరిగాక చనిపోవటం, మరి కొందరి పట్టా పేర్లు మారక వాటి పంపిణీ నిలిచిపోయాయి.. ఇవి లక్షల సంఖ్యలో ఉన్నాయి. కొన్నింటిని వ్యవసాయశాఖ వెనక్కు తీసుకుంది. మరికొన్నింటికి కాలం చెల్లింది. చివరకు 6.36 లక్షల చెక్కులు మిగిలిపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ఆ ప్రకారం రైతులకు ఇవ్వకుండా మిగిలిపోయిన సొమ్ము రూ. 402 కోట్లు బ్యాంకుల్లో ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు.అత్యధికంగా ఎస్‌బీఐలో రూ. 225.54 కోట్లు, ఆంధ్రా బ్యాంకులో రూ. 109 కోట్లు ఉన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఆ సొమ్మును వెనక్కు తీసుకున్న తర్వాత ఏంచేయాలన్న దానిపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

రబీ పెట్టుబడి కోసం ఎదురుచూపు...

2018 ఖరీఫ్, రబీల్లో ప్రభుత్వం ఎకరానికి రూ. 8 వేల చొప్పున రైతులకు అందజేసింది. 2019–20 ఏడాది రెండు సీజన్లకు కలిపి రూ.10 వేలు ఇస్తానని హామీ ఇచ్చింది. అందుకోసం 2019–20 బడ్జెట్‌లో ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రైతుబంధుకు రూ. 12 వేల కోట్లు కేటాయించింది. అందులో రూ.6,900 కోట్లు ఖరీఫ్‌కు చెందింది. పెంచిన సొమ్ము ప్రకారం 2019 ఖరీఫ్‌లో ఎకరానికి రూ.5 వేల చొప్పున అందజేయడం ప్రారంభించింది. గతేడాది ఖరీఫ్‌లో 45 లక్షల మంది పట్టాదారులకు రూ. 5,460 కోట్లు అందజేసింది. ఇంకా 8 లక్షల మందికి రూ.1,500 కోట్లు ఇవ్వా లని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఆ సొమ్ము ఇప్పటికీ విడుదల కాలేదు. రబీలోనూ అదే స్థాయిలో అందజేయాల్సి ఉంది. దీని కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. దీనిపై అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంలేదన్న విమర్శలున్నాయి. 2018 ఖరీఫ్‌లో మిగిలిపోయి న సొమ్మును ప్రస్తుత అవసరాలకు ఉపయోగిస్తా రా లేదా అన్నదానిపై అస్పష్టత నెలకొంది. రబీ రైతుబంధు సొమ్మును త్వరలోనే ఇస్తామని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. అదే విషయాన్ని ఇటీవల ఆ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కూడా ప్రస్తావించారు. ఈ సొమ్మును గతంలో మాదిరిగానే అన్ని వర్గాల రైతులకు ఇవ్వాలని సీఎం సుముఖంగా ఉండగా, వ్యవసాయశాఖ వర్గాలు మాత్రం పదెకరాల లోపువారికే పరిమితం చేయాలన్న ప్రతిపాదనను తెరపైకి తీసుకొస్తున్నారు.

నేటి నుంచి రెండో విడత 'పల్లె ప్రగతి'

- 12,751 పంచాయతీల్లో సందడే సందడి
- 11 రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం
- పచ్చదనం–పరిశుభ్రతకు ప్రాధాన్యత
- పనులు, నిధులు, విధులపై ఫ్లయింగ్ స్క్వాడ్ల తనిఖీలు
- పంచాయతీల పనితీరూ మదింపు..



సాక్షి, హైదరాబాద్: నేటి నుంచి రెండో విడత 'పల్లె ప్రగతి'ప్రారంభం కానుంది. అధికార యంత్రాంగం పల్లెబాట పడుతోంది. అధికారులు, పాలకవర్గాల హడావుడితో 11 రోజుల పాటు గ్రామాల్లో సందడి కొనసాగనుంది. గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు పల్లె ప్రగతి కార్యక్రమం జరగనుంది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన 30 రోజుల ప్రణాళికలో అమలు చేసిన కార్యాచరణే ఈసారి కూడా ఆచరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతి నిర్వహణకు పంచాయతీరాజ్‌శాఖ సన్నద్ధమైంది.

బాగుంటే ప్రోత్సాహకాలు.. లేకుంటే చర్యలు

ప్రతి పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించిన ఆ శాఖ.. ఆ అధికారి పర్యవేక్షణలో పల్లె ప్రగతిని నిర్వహించాలని నిర్దేశించనుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాల పరిశీలనకు మండల, జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఈ సారి కొత్తగా రాష్ట్రస్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కూడా ఏర్పాటు చేసింది. 51 మంది సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు కేటాయించిన మండలాల్లోని రెండు పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించి.. పల్లె ప్రగతి నిర్వహణ తీరును మదింపు చేస్తారు. అంతేగాకుండా.. ఆ గ్రామంలో గుర్తించిన పనులు, నిధులు, విధుల నిర్వహణలో స్థానిక పంచాయతీ సిబ్బంది, పాలకవర్గం పనితీరుపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా బాగా పనిచేసిన పంచాయతీలకు ప్రోత్సాహకాలు.. అలసత్వం ప్రదర్శించినట్లు తేలితే చర్యలకు సిఫారసు చేస్తారు. తొలిరోజు నిర్వహించే గ్రామసభలో మొదటి విడత ప్రగతి నివేదికను గ్రామస్తుల ముందుంచనున్నారు. పల్లె ప్రగతి లక్ష్యం, పంచాయతీ ఆదాయ, వ్యయాలు, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించనున్నారు. గ్రామ వార్షిక ప్రణాళికకు ఆమోదముద్ర వేయనున్నారు.

లక్ష్యాలివే..

- గ్రామాలను పచ్చదనం–పరిశుభ్రంగా ఉంచడం
- పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల సంరక్షణలో ప్రజలకు విస్తృత భాగస్వామం కల్పించడం
- గ్రామాభివృద్ధికి వార్షిక ప్రణాళికలు తయారుచేసి నియంత్రిత పద్ధతిలో నిధుల వినియోగం
- ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం

మొదటి విడతలో పూర్తి చేసిన పనులివే..

గతేడాది సెప్టెంబర్ 6 నుంచి ఆక్టోబర్ 5 వరకు తొలి విడత పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. ఈ 30 రోజుల పాటు పల్లెల్లో పలు పనులు చేపట్టి పూర్తి చేశారు.

- 5 పంచాయతీల్లో మినహా 12,746 పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ. 12,687 పంచాయతీల్లో 38,061 మంది కోఆప్షన్ సభ్యుల ఎన్నిక.
- 12,744 పంచాయతీల్లో స్టాండింగ్ కమిటీ ఏర్పాటు
- అందులో 8,20,009 మంది సభ్యుల ఎన్నిక.. అందులో మహిళాసభ్యులే 4,02,965 మంది
- సమస్యలకు సంబంధించి చర్యలు చేపట్టేందుకు 12,746 గ్రామపంచాయతీల్లో పాదయాత్రల నిర్వహణ, ఈ పంచాయతీల్లో వార్షిక ప్రణాళికల తయారీ
- 10,544 పంచాయతీల్లో వైకుంఠధామాలు/శ్మశానాల ఏర్పాటుకు భూమి గుర్తింపు
- 10,875 గ్రామాల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటుకు భూమి గుర్తింపు
- లక్షకు పైగా ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో శిథిలాల తొలగింపు
- దాదాపు రెండున్నర లక్షల ప్రదేశాల్లో సర్కార్ తుమ్మ, పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు
- లక్ష దాకా ఖాళీ ప్రదేశాల శుభ్రం
- 15,548 పాడుపడిన బావులు, 9,337 ఉపయోగించని బోరు బావులు మూసివేత
- 1.22 లక్ష ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పెంచే చర్యలు, 79,108 ప్రభుత్వ సంస్థలు, ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రతి నెలా రూ.339 కోట్లు..

గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.339 కోట్లు విడుదల చేస్తోంది. ఈ నిధులను గ్రామావసరాలకు వినియోగించాలని స్పష్టం చేసింది. మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు, చెత్త సేకరణ, డంపింగ్ యార్డుకు తరలించేందుకుట్రాక్టర్‌ను కొనుగోలు చేయాలని, మొక్కలకు నీళ్లు పోసేందుకు ట్యాంకర్‌ను సమకూర్చుకోవాలని ఆదేశించింది. వీటి వినియోగంపై గ్రామస్థాయిలో పరిశీలించాలని అధికారుల బృందాలకు ప్రభుత్వం సూచించింది.

'నీట్' దరఖాస్తు గడువు పొడిగింపు

ఈ నెల 6 వరకు అవకాశం ● పరీక్ష తేదీల్లో ఎలాంటి మార్పులేదు



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సులకు దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) దరఖాస్తు గడువును ఈ నెల 6 వరకు పొడిగిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని ఆరోజు రాత్రి 11.50 గంటల వరకు తెరిచి ఉంచుతామని పేర్కొంది. వాస్తవంగా 2020–21కు సంబంధించి నీట్ పరీక్ష కోసం గత నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు. తాజా నిర్ణయంతో ఇప్పటివరకూ దరఖాస్తులు చేయనివారు ఇప్పుడు కూడా సమర్పించవచ్చని ఎన్‌టీఏ తెలిపింది. అయితే పరీక్షా షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులూ ఉండవని తెలిపింది. విద్యార్థులు తమ దరఖాస్తు ఫారాలను ఈ నెల 15 నుంచి 31 వరకు సవరించుకోవచ్చు. నీట్ పరీక్ష మే నెల 3న నిర్వహిస్తారు. అనంతరం జూన్ 4న ఫలితాలు విడుదల చేస్తారు. ఇంగ్లిష్, హిందీతో సహా 11 భాషల్లో ఈ పరీక్ష జరుగుతుంది. ఈసారి ఎయిమ్స్, జిప్‌మర్ ఎంబీబీఎస్ కోర్సులలో ప్రవేశానికి కూడా నీట్ పరీక్ష రాయాల్సి ఉంది.

దేశవ్యాప్తంగా 2,546 పరీక్షా కేంద్రాలు

దేశవ్యాప్తంగా 154 నగరాల్లోని 2,546 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఇంగ్లిషు, తెలుగు, ఉర్దూలోనూ పరీక్ష ఉంటుంది. గతేడాది తెలంగాణ నుంచి 48,996 విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా, అందులో 33,044 మంది అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదేస్థాయిలో విద్యార్థులు నీట్ పరీక్ష రాసే అవకాశముందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు చెబుతున్నారు.

ముగిసిన జాతీయ పుస్తక ప్రదర్శన

- 10 రోజుల్లో 8 లక్షల మంది సందర్శకులు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన బుధవారం ముగిసింది. డిసెంబర్ 23 నుంచి జనవరి 1 వరకు 10 రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఈ 33వ జాతీయ పుస్తక ప్రదర్శనలో సుమారు 8 లక్షల మంది సందర్శకులు పాల్గొన్నట్లు నిర్వాహకులు అంచనా వేశారు. 2 లక్షలకు పైగా ఉచిత పాస్‌లను అందజేశారు. లక్షలాది మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ,మహారాష్ట్ర,తమిళనాడు,కర్ణాటక, కేరళ, తదితర రాష్ట్రాలకు చెందిన పుస్తక ప్రచురణ సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. జాతీయ, అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థలు సమకాలీన అంశాలపై వెలువడిన వేలాది టైటిల్స్‌ను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. పుస్తక ప్రదర్శనలో భాగంగా 10 రోజుల పాటు నిర్వహించిన బాలమేళ కార్యక్రమంలో 2000 మంది చిన్నారులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ ఏడాది చరిత్ర, రాజ్యాంగం, కశ్మీర్, జాతుల సమస్యలకు సంబంధించిన పుస్తకాలతో పాటుగా బాల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు కూడా బాగా అమ్ముడయ్యాయి. గాంధీజీ 150వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ సంవత్సరం పుస్తక ప్రదర్శనకు మాజీ ప్రధాని పీవీ ప్రాంగణంగా నామకరణం చేశారు. సీనియర్ సంపాదకులు సీ.రాఘవాచారి పేరిట సభావేదికను నిర్వహించారు. జాతీయ స్థాయిలో 3వ స్థానాన్ని ఆక్రమించుకొన్న హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను డిసెంబర్ నెలంతా నిర్వహించే విధంగా ప్రభుత్వం ఎన్టీఆర్ స్టేడియంను కేటాయించాలని హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ కోరారు.

'ఈచ్ వన్ టీచ్ వన్'లో పాల్గొంటాం

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కు పెన్షనర్ల సంఘం హామీ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 'ఈచ్ వన్ టీచ్ వన్'అని పిలుపునిచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో నిర్వహించే అవగాహన సదస్సుల్లో విశ్రాంత ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేశారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నరసయ్య, ప్రధాన కార్యదర్శి ఇనగంటి నవనీత రావు, ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఉద్దీన్, కోశాధికారి ఇ.శ్రవణ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హెచ్.రాములు, కార్యదర్శి జి.లక్ష్మీ నారాయణ తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన తర్వాత వివిధ అంశాలపై చర్చించారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులు, పట్టణ ప్రాంతాలు, బస్తీల్లో నివసిస్తున్న తాము ప్రభుత్వానికి వలంటీర్లుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పారిశుద్ధ్యం వంటి రంగాలతో పాటు సామాజిక రుగ్మతలపై సైనికులుగా పనిచేస్తామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తీసుకుంటున్న జీతం కంటే తాము అధిక మొత్తంలో పెన్షన్ పొందుతున్న నేపథ్యంలో సామాజిక బాధ్యతగా ప్రభుత్వ కార్యక్రమాలు, సీఎం కేసీఆర్ దృఢ సంకల్పానికి పూర్తి అండదండలు అందిస్తామని తెలిపారు.

స్వైన్‌ఫ్లూ నివారణపై చర్యలేంటి?

- ప్రైవేటు ఆస్పత్రుల సహకారం తీసుకున్నారా?
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: స్వైన్‌ఫ్లూ వ్యాధిని గుర్తించేందుకు రాష్ట్రంలో పలు చోట్ల ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం ఆదేశించింది. స్వైన్‌ఫ్లూ నివారణకు ప్రైవేటు ఆస్పత్రులను ఏ మేరకు భాగస్వాములను చేశారో చెప్పాలని కోరింది. ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వామ్యం చేస్తేనే స్వైన్‌ఫ్లూ నివారణ సాధ్యమని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులతో బాధపడే వారికి సరైన వైద్యం అందడం లేదని పేర్కొంటూ వైద్యురాలు కరుణ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంతోపాటు న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖను పిల్‌గా పరిగణించిన హైకోర్టు ఇటీవల వాటిని మరోసారి విచారించింది. జిల్లా వైద్యాధికారులకు, ఇతరులకు స్వైన్‌ఫ్లూ రోగుల నుంచి రక్త నమూనాల సేకరణ, పరీక్షల నిర్వహణ వంటి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కోర్టుకు సహాయకారిగా నియమితులైన (అమికస్ క్యూరీ) సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి తెలిపారు. స్వైన్‌ఫ్లూ వ్యాప్తి, నివారణ, అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలతో రాష్ట్రంలో 15 లక్షల కరపత్రాలు, 2 లక్షల పోస్టర్లను పంపిణీ చేశామంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కౌంటర్ దాఖలు చేశారు. వైద్య పరీక్షల కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం అనుమతి కోరామని చెబుతూ కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ మరో కౌంటర్ దాఖలు చేశారు. సీఎస్ కౌంటర్‌ను పరిశీలించిన ధర్మాసనం.. ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వామ్యం చేశారో లేదో చెప్పాలని, పరీక్షా కేంద్రాల ఏర్పాటు అంశంపై కూడా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గంతో కేటీఆర్ భేటీ



సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై రాష్ట్ర కమిటీ, సీనియర్ నేతలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై డిసెంబర్ 27 నాటి సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించిన పురోగతిని తెలుసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల ను నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని వివరాలు సేకరించాలని గతంలో కేటీఆర్ ఆదేశించిన విషయం తె లిసిందే. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణకు సంబంధించి కేటీఆర్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. త్వరలోనే సీఎం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో ఉమ్మ డి సమావేశాన్ని నిర్వహిస్తారని వెల్లడించారు. సీఎంతో జరిగే సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మార్గదర్శనం చే స్తారని కేటీఆర్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై రూపొందించిన నివేదికలను కేటీఆర్‌కు పార్టీ ఇన్‌చార్జిలు అందజేశారు. సమావేశం సందర్భంగా నూతన సంవత్సరం తొలిరోజు తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డితోపాటు ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్ నేత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలున్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ నియామకం



సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీని ప్రకటించింది. కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ మాదం రంగారెడ్డిని నియమించింది. మరో 10 మందితో జాబితాను విడుదల చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా బుధవారం ప్రకటన విడుదల చేశారు. కమిటీ సభ్యులుగా మాదం రంగారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ బెల్లయ్య నాయక్, టీపీసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ ఎస్.ఎ.సోహైల్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ముదిరాజ్, మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్, మాజీ డీసీసీబీ చైర్మన్ ఎం.జైపాల్ రెడ్డి, పాల్వాయి స్రవంతి, సత్యం శ్రీరంగం, గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి పవన్ మల్లాడికి అవకాశం కల్పించారు. ఈనెల 4వ తేదీలోగా కమిటీ నివేదిక సమర్పించాలని సూచించింది.

ఉత్తమ్ వ్యాఖ్యలను తప్పుబట్టిన ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌పై చేసిన వ్యాఖ్యలను ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. బుధవారం ఈ మేరకు ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఏఐఎంఐఎంకు దారుస్సలాంలో చాలా స్థలం ఉందని, గతంలో ఇందిరాగాంధీ ప్రజాసభకు కూడా దారుస్సలాం వేదికై ందని గుర్తు చేశారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్‌లో తాము నిర్వహించిన సభకు ఆహ్వానిస్తే రాలేదని అసదుద్దీన్ అన్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 4 లేదా 5వ తేదీన మజ్లిస్ ర్యాలీకి అనుమతివ్వాలని డిసెంబర్ 20వ తేదీన హైదరాబాద్ సీపీకి దరఖాస్తు చేసినట్లు చెప్పారు. దారుస్సలాం నుంచి ఈద్గా బిలాలి, చార్మినార్ నుంచి ధర్నాచౌక్ సహా మూడు మార్గాలు ర్యాలీకి ప్రతిపాదించి అనుమతులు కోరినట్లు తెలిపారు. తమ వినతిని పరిశీలించి మజ్లిస్ ర్యాలీకి అనుమతివ్వాలని ఒవైసీ పోలీసులకు విజ్ఞప్తిచేశారు.

రిజర్వేషన్లపై పరిమితిని ఎత్తివేయాలి: జాజుల



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లపై పరిమితిని ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాలని కోరుతూ బుధవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఎలాంటి పరిమితి విధించలేదని, బీసీలకు న్యాయ బద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లు ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇస్తే న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు, చట్టాలు, వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ల అమలు తదితర ఆధారాలన్నీ గవర్నర్‌కు సమర్పించినట్లు చెప్పారు.

రిజర్వేషన్లను తగ్గిస్తే ఊరుకోం: కృష్ణయ్య



ముషీరాబాద్: పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తే ఊరుకునేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. బీసీలకు ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతం, కర్ణాటకలో 36 శాతం, తమిళనాడులో 50 శాతం, మహారాష్ట్రలో 48 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే తెలంగాణలో తగ్గించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై బుధవారం బీసీ భవన్‌లో 14 బీసీ సంఘాలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సమావేశానికి హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రిజర్వేషన్ల స్థానాలు ప్రకటించకుండా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిందని ఆరోపించారు. గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న రిజర్వేషన్లను తగ్గించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దీని వెనుక బీసీలకు అన్యాయం చేయాలనే ఆలోచన ఉందని వ్యాఖ్యానించారు. దీనివల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు రిజర్వేషన్ల స్థానాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రిజర్వేషన్ స్థానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు రాంకోటి, చంద్రవంక చిన్నరాములు, గుండేటి శంకర్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

- నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు
- సీఎంను కలిసిన స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా ప్రగతి భవన్‌లో బుధవారం పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సీహెచ్ మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవరావు, లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వర్ రావు, ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేష్ నేత, ఎమ్మెల్యేలు డి.సుధీర్‌రెడ్డి, గంధ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, కార్పొరేషన్ల చైర్మన్లు రాజేశం గౌడ్, శేరి సుభాష్‌రెడ్డి, తెలంగాణ ఎంపీఐ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పాపారావు తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జనార్దన్‌రెడ్డి సీఎంను కలిసి హైస్కూల్ విద్యార్థులకు అందించే మోడల్ డిక్షనరీని అందించారు. ఐనవోలు, యాదాద్రి దేవాలయ క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.



బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో సంతోష్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, సుభాష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఉత్తమ్ వారసుడెవరో?

- మళ్లీ తెరమీదికొచ్చిన టీపీసీసీ చీఫ్ వ్యవహారం
- మున్సిపల్ ఎన్నికల తర్వాత తప్పుకుంటానని చెప్పిన ఉత్తమ్
- కొత్త 'బాస్' ఎవరనే దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో విస్తృత చర్చ
- కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, రేవంత్‌లలో ఒకరికి చాన్స్ అంటున్న టీపీసీసీ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్ష పదవి వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలకు, నల్లగొండ పార్లమెంటు పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేందుకుగాను తాను టీపీసీసీ అధ్యక్ష పదవి నుంచి మున్సిపల్ ఎన్నికల తర్వాత తప్పుకుంటానని ప్రస్తుత చీఫ్ ఉత్తమ్ స్వయంగా వెల్లడించడంతో ఆయన వారసుడు ఎవరనే దానిపై కాంగ్రెస్ కేడర్‌లో విస్తృత చర్చ జరుగుతోంది. వాస్తవానికి, గత ఏడాది కాలంగా టీపీసీసీ అధ్యక్షుని మార్పుపై రాష్ట్రంలో చర్చ జరుగుతున్నా, స్వయంగా ఉత్తమ్ వ్యాఖ్యల నేపథ్యంలో ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త 'బాస్'ఎవరనేది ఆసక్తి కలిగిస్తోంది. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబుల పేర్లు రేసులో ముందు వరుసలో వినిపిస్తుండగా, టీపీసీసీ ముఖ్య నేతలు చాలా మంది తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

జాబితా పెద్దదే

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు టీపీసీసీలోని చాలా మంది నేతలు పోటీ పడుతున్నారు. ఈ పదవి కోసం వినిపిస్తున్న వారి పేర్లలో రాష్ట్ర కాంగ్రెస్ పెద్దల్లోని అందరూ ఉన్నారు. అయితే, మాస్‌లో మంచి ఫాలోయింగ్ ఉండటంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మంత్రి పదవిని త్యజించిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అవకాశం ఇస్తారనే చర్చ చాలా కాలంగా జరుగుతోంది. ఆయన కూడా బహిరంగంగా తాను పదవి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని పలుమార్లు చెప్పగా, గులాంనబీ ఆజాద్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయన మద్దతుదారులు గాంధీభవన్‌లో ఆందోళన కూడా నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి కూడా రేసులో అందరికంటే ముందున్నారు. యువకుడు కావడంతో పాటు రాష్ట్రంలో మంచి క్రేజ్ ఉన్న నేతగా ఆయనకు అవకాశం ఇస్తారనే చర్చ కూడా జరుగుతోంది. అయితే, రేవంత్ అభ్యర్థిత్వానికి అధిష్టానం నుంచి ఎలాంటి అభ్యంతరం లేకపోయినా కొందరు స్థానిక నేతలు అడ్డు తగులుతున్నారని సమాచారం. ఇక, సౌమ్యుడిగా ముద్ర పడిన మాజీ మంత్రి శ్రీధర్‌బాబు కూడా టీపీసీసీ రేసులో ముందు వరుసలోనే ఉన్నారు. శ్రీధర్‌బాబుకు అధ్యక్ష పదవి కోసం రాష్ట్ర పార్టీలోని కొందరు కీలక నేతలు ప్రయత్నిస్తున్నారని, ఆయనకు మద్దతుగా ఇద్దరు కీలక నేతలు లేఖలు కూడా ఇచ్చారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరితో పాటు పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నాయకు ల పేర్లు కూడా వినిపిస్తున్నా యి. బీసీ సామాజిక వర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలు ఒక్కతాటిపైకి వచ్చి ఈసారి తమకు అవకాశం ఇవ్వాల్సిందేనని అడుగుతున్నారు. ఇందుకోసం హైదరాబాద్ వేదికగా ఇటీవల సంయుక్తంగా సమావేశం కూడా పెట్టుకున్నారు. వీటన్నింటి నేపథ్యంలో కాబోయే టీపీసీసీ చీఫ్ ఎవరు.. అధిష్టానం ఏ వర్గానికి ప్రాధాన్యమిస్తుంది.. సామాజిక అంశాలను బేరీజు వేసుకుంటుందా..? చరిష్మా ఆధారంగా పదవి కట్టబెడుతుందా అన్న ది కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి కలిగిస్తోంది.

ఏఐసీసీ ప్రక్షాళన తర్వాతే!

టీపీసీసీ అధ్యక్ష పదవిపై ప్రస్తుతానికి ఏఐసీసీ దృష్టి పెట్టకపోయినా గతంలో ప్రాథమికంగా కొంత కసరత్తును పూర్తి చేసింది. ఏఐసీసీ కసరత్తుతో పాటు టీపీసీసీ నేతలు పలువురు అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు కూడా తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే, విశ్వసనీయ సమాచారం ప్రకారం ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ మళ్లీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాహుల్ అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏఐసీసీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తారని, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జులను కూడా దేశ వ్యాప్తంగా మార్పు చేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఇన్‌చార్జి కుంతియా స్థానంలో కొత్త నేత వచ్చే అవకాశముందని, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా కొత్త నాయకుడు వచ్చిన తర్వాత ఆయన నేతృత్వంలోనే టీపీసీసీ అధ్యక్ష ఎంపిక కసరత్తు పూర్తిస్థాయిలో జరుగుతుందని తెలుస్తోంది. ఇదే జరిగితే మార్చి లేదా ఏప్రిల్ వరకు టీపీసీసీ చీఫ్‌గా ఉత్తమ్ కొనసాగనున్నారు. మరి కొత్త ఇన్‌చార్జి రాష్ట్ర కాంగ్రెస్ కొత్త బాస్ ఎంపిక కసరత్తు పూర్తి చేస్తారా? ఉత్తమ్ వ్యాఖ్యల నేపథ్యంలో ఈలోపే అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందా? అన్నది వేచి చూడాల్సిందే!

మున్సిపల్ ఎన్నికలకు భయపడతానా?

- నామినేషన్లకు తగిన సమయం ఇవ్వాలని మాత్రమే అడుగుతున్నాం
- వనపర్తి మాజీ ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమంలో ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: 'నేను మున్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడితే వార్డు మెంబర్లుగా పోటీ చేయని టీఆర్‌ఎస్ నేతలు కూడా ఏదేదో మాట్లాడుతున్నారు. ఆరుసార్లు ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కొని చట్టసభలకు ఎన్నికయినవాడిని. ఈ మున్సిపల్ ఎన్నికలకు భయపడతానా?'అని టీపీసీసీ చీఫ్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాము మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేయాలని ససేమిరా కోరడం లేదని, కేవలం రిజర్వేషన్ల ఖరారు తర్వాత నామినేషన్ల దాఖలుకు వారం రోజుల గడువు ఇవ్వాలని మాత్రమే అడుగుతున్నానని చెప్పారు. వనపర్తి మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్ తన అనుచరగణంతో కలిసి మాజీ మంత్రి చిన్నారెడ్డి నేతృత్వంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ్ మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాలను టీఆర్‌ఎస్ భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్న టీఆర్‌ఎస్, పోలీసులను ప్రయోగించి కార్యకర్తలను అణచివేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. టీఆర్‌ఎస్ అణచివేత రాజకీయాలకు నిరసనగా త్వరలోనే జైల్‌భరో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు చెప్పారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, రైతు బంధు ఏమయ్యాయని తాను సూటిగా ప్రశ్నిస్తే టీఆర్‌ఎస్ ఏం సమాధానం చెప్తుందని ఆయన ప్రశ్నించారు. టీఆర్‌ఎస్‌లోకి వెళ్లేంతవరకు పక్క పార్టీ నేతలకు కబుర్లు చెప్తారని, ఆ తర్వాత కనీసం పట్టించుకునే వారు కూ డా ఉండరని, ఆ పార్టీలో ఒక కుటుంబం పెత్తనమే ఉంటుందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యమిచ్చి అన్ని వర్గాల నేతలను అక్కున చేర్చుకునేది కేవలం కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. కాంగ్రెస్ నుంచి వెళ్లిపోయిన నేత లు తిరిగి పార్టీలోకి రావాలని ఉత్తమ్ ఆహ్వానించారు. తిరిగి పార్టీలోకి వచ్చిన మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, తాను ఎంపీపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయిన తర్వాత అనివార్య కారణాల వల్ల టీఆర్‌ఎస్‌లో చేరానని, ఇప్పుడు మళ్లీ సొంతగూటికి రావడం సంతోషంగా ఉందన్నారు. మూడేళ్లుగా టీఆర్‌ఎస్‌లో ఉన్నా ఏ రోజూ సంతోషం లేదని, పదవులు ఇస్తామని చెప్పి పార్టీలోకి తీసుకున్న తర్వాత కనీస విలువ ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్

ఆ కిటుకుతో మన బస్సులూ కిటకిట!

- బీహెచ్‌ఈఎల్ నుంచే ఏపీఎస్ ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు
- 80 శాతం ఆక్యుపెన్సీతో సాగుతున్న సర్వీసులు
- అక్కడ నుంచి ఆరు బస్సులే నడుపుతున్న టీఎస్ ఆర్టీసీ
- ఎక్కువ బస్సులు ఎంజీబీఎస్ నుంచే ఉండటంతో తక్కువ ఆక్యుపెన్సీ
- దిద్దుబాటు చర్యలు చేపడితే అధిక ఆదాయం పొందే చాన్స్

బీహెచ్‌ఈఎల్ నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ నిత్యం దాదాపు 65 వరకు ఏసీ బస్సులు తిప్పుతోంది. వీటిలో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) దాదాపు 80 శాతంగా ఉంది. ఇది లాభసాటిగా ఉన్నందున ఇక్కడి నుంచి మరిన్ని బస్సులు తిప్పేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఈ క్రమంలో ఇక్కడ బస్సుల ఎలైటింగ్ పాయింట్ కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించబోతోంది. ఇప్పటికే స్థలాన్ని కూడా కొనుగోలు చేసింది.

ఆంధ్రా ప్రాంతం వైపు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా బీహెచ్‌ఈఎల్ మార్గంలో ఉండటంతో ఏపీ వైపు వెళ్లే బస్సులకు అక్కడి నుంచి డిమాండ్ ఎక్కువ. అందుకే ప్రైవేటు ట్రావెల్స్ వీలైనన్ని ఎక్కువ బస్సులను ఆ మార్గం నుంచే ప్రారంభిస్తున్నాయి. అవి కిక్కిరిసి పరుగులు పెడుతున్నాయి. కానీ అదే బీహెచ్‌ఈఎల్ నుంచి తెలంగాణ ఆర్టీసీ కేవలం ఆరు గరుడ ప్లస్ బస్సులను మాత్రమే తిప్పుతోంది.

ఏం చేస్తే ఆదాయం పెరుగుతుందో సకాలంలో గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపడితే ఫలితం కనిపిస్తుంది. ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ఈ విషయాన్ని బాగా పాటిస్తుండటంతో వాటిలో ఆక్యుపెన్సీ రేషియో ఎక్కువగా ఉంది. ఆ నాడి పసిగట్టడంలో మన ఆర్టీసీ బాగా వెనకబడటంతో అంతగా ఆదాయం ఆర్జించలేకపోతోంది.

సాక్షి, హైదరాబాద్: చాలాకాలం తర్వాత ఆర్టీసీ చార్జీలు పెంచడంతో ఒక్కసారిగా ఆదాయం పెరిగింది. అది రోజుకు రూ.2 కోట్లకుపైగా పెరిగే దిశగా సాగుతోంది. ఈ సమయంలో మరిన్ని దిద్దుబాటు చర్యలు చేపడితే ఆదాయం మరింతగా పెరిగే అవకాశముంది. కానీ అధికారులు కొన్ని కీలక విషయాలపై ఇంకా దృష్టి సారించడంలేదు. సంస్థకు దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల ద్వారానే మంచి ఆదాయం వస్తోంది. ముఖ్యంగా ఆంధ్రా ప్రాంతానికి వెళ్లే బస్సులకు మంచి డిమాండ్ ఉంది. టీఎస్ ఆర్టీసీ గరుడ ప్లస్ బస్సుల్లో ఎ క్కువ ఆ రూట్లలోనే తిరుగుతాయి. అయితే, డిమాండ్ ఉన్నప్పటికీ.. వాటిలో ఓఆర్ 60 శాతం దాటడంలేదు.

ఇదీ కారణం...

బీహెచ్‌ఈఎల్–కూకట్‌పల్లి మధ్య దాదాపు ఏడెనిమిది పాయింట్లు విపరీతంగా రద్దీ ఉంటున్నాయి. ఆంధ్రా ప్రాంతానికి చెందినవారు ఎక్కువగా ఈ ప్రాంతాల్లోనే ఉండటమే ఇందుకు కారణం. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఎక్కువగా ఇక్కడి నుంచే మొదలు కావడంతో వంద శాతం ఓఆర్‌తో దూసుకుపోతున్నాయి. కానీ మన ఆర్టీసీ మాత్రం 80 శాతం బస్సులను ఎంజీబీఎస్ నుంచే నడుపుతోంది. బీహెచ్‌ఈఎల్, కూకట్‌పల్లిలో ఉండేవారు మన ఆర్టీసీ బస్సులు ఎక్కాలంటే ఎంజీబీఎస్ వరకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వారంతా అటు ఏపీఎస్ ఆర్టీసీ, ఇటు ప్రైవేటు బస్సులు వైపు వెళ్లిపోతున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ దాదాపు 65% బస్సులను బీహెచ్‌ఈఎల్ నుంచి తిప్పుతుండగా.. టీఎస్ ఆర్టీసీ కేవలం 6 బస్సులు మాత్రమే అక్కడి ఉంచి నడుపుతోంది. ఫలితంగా వాటిలో ఓఆర్ 60 శాతమే ఉంటోంది. అవసరమైన సందర్భాల్లో మియాపూర్ నుంచి కొన్ని బస్సులు నడుపుతున్నా, అవి హైదరాబాద్ డిపోకి చెందినవి కావడంతో మియాపూర్ వరకు ఖాళీగా వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో బీహెచ్‌ఈఎల్ డిపోకే ఏసీ బస్సులు కేటాయించి వాటిని అక్కడి నుంచే ప్రారంభిస్తే ఓఆర్ పెరగటంతో పాటు, అక్కడి నుంచి టికెట్ ధర కూడా ఎక్కువగా ఉన్నందున ఆదాయం కూడా పెరుగుతుంది. సంక్రాంతి రద్దీ వేళ అధికారులు ఈ మార్పులు చేస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

రిజర్వేషన్లు తేలకుండా షెడ్యూలా?

మున్సిపల్ ఎన్నికలపై ఉత్తమ్ పిల్

సాక్షి, హైదరాబాద్: మున్సిపాలిటీల్లో వివిధ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం రాజ్యాంగ వ్యతిరేకమంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ పిల్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం దీనిపై విచారించనుంది. గత నెల 23న ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్‌ను రద్దు చేయాలని, దీనిని రీషెడ్యూల్ చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని, పిల్‌పై తుది ఉత్తర్వులు వెలువడే వరకూ షెడ్యూల్‌పై ఏవిధంగా ముందుకు వెళ్లకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ నెల 7న రాష్ట్ర ఎస్‌ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయబోతుందని, ఈప్రక్రియను నిలిపేయాలని కోరారు. ఈనెల 5న రాష్ట్ర ప్రభుత్వం ఆయా పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేసి ఎస్‌ఈసీకి ఇస్తుందని, ఆ తర్వాత ఎస్‌ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తుందని, రిజర్వేషన్ల ఖరారుకు ఎన్నికల నోటిఫికేషన్ జారీకి మధ్యలో ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని పత్రికల్లో వార్తలొచ్చాయని, ఒక్క రోజు వ్యవధిలో కుల ధ్రువీకరణ పత్రాలు పొందడం కష్టమని, కనీసం వారం వ్యవధి ఉండేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. షెడ్యూల్ విడుదల చేసే నాటికి ఓటర్ల జాబితా కూడా సిద్ధం కాలేదని, ఉద్దేశపూర్వకంగానే రిజర్వేషన్ల ఖరారులో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. వ్యవధి తక్కువగా ఉండటం వల్ల అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని, రిజర్వేషన్ల ఖరారులో ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పడానికి, సమస్యపై వివరించేందుకు వారం సమయముండేలా చేయాలన్నారు. ఎస్‌ఈసీ నిర్వహించిన వివిధ పార్టీ నేతల సమావేశంలోనూ రిజర్వేషన్ల ఖరారు అంశంపై స్పష్టత ఇవ్వలేదని, ఓటర్ల జాబితా కూడా సిద్ధం చేయకుండా షెడ్యూల్ విడుదల చేయడం చెల్లదని పిల్‌లో పేర్కొన్నారు.

నుమాయిష్ షురూ..

80వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించిన మంత్రులు మహమూద్ అలీ, తలసాని, ఈటల

అఫ్జల్‌గంజ్: భాగ్యనగరంలో ఏటా జరిగే నుమాయిష్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 80వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)ను మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. గత 79 ఏళ్ల నుంచి ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులను మంత్రి మహమూద్ అలీ అభినందించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో తెలంగాణ సంస్కృతైన గంగా జమునా తైజీబ్ కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోందని అన్నారు. ఎగ్జిబిషన్‌ను కేవలం 45 రోజులకే పరిమితం చేయకుండా ఏడాదిలో పలుమార్లు నిర్వహిస్తే ఎందరికో ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ ద్వారా దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలతోపాటు ఇతర దేశాలకు చెందిన వారు కూడా ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేసి తమ వస్తువులకు ప్రచారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. తద్వారా జనవరి వచ్చిందంటే చాలు ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తుందన్నారు. గతేడాది అగ్ని ప్రమాద అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల నుంచి వివిధ రకాల ఉత్పత్తులతోపాటు ప్రముఖ కంపెనీల వస్తువులు ఎగ్జిబిషన్‌లో దొరుకుతాయని ఈటల అన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్‌తో కలసి రాష్ట్రంలోని 18 విద్యాలయాల ద్వారా ఏటా సుమారు 30 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వసతి సౌకర్యాలు కల్పిస్తున్న ఏకైక సంస్థగా ఎగ్జిబిషన్ సొసైటీ నిలుస్తుందని కొనియాడారు.



నుమాయిష్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు తలసాని, మహమూద్ అలీ, ఈటల

వచ్చే ఏడాది చంద్రయాన్–3



ఇస్రో చైర్మన్ కె.శివన్ ప్రకటన • గగన్‌యాన్‌కు నలుగురు వాయుసేన సిబ్బంది

బెంగళూరు: ప్రతిష్టాత్మక చంద్రయాన్–3 ప్రయోగంపై భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) బుధవారం కీలక ప్రకటన చేసింది. వచ్చే ఏడాది(2021)లో చంద్రయాన్–3 ప్రయోగాన్ని చేపట్టే అవకాశం ఉందని ఇస్రో చైర్మన్ కె.శివన్ ప్రకటించారు. ఇక మరో ప్రతిష్టాత్మక గగన్‌యాన్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందడానికి భారత వాయు సేనకు చెందిన నలుగురు సిబ్బందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. జనవరి మూడో వారంలో వీరికి రష్యాలో శిక్షణ ప్రారంభంకానున్నట్లు చెప్పారు. చంద్రయాన్–3 ప్రాజెక్టుతోపాటు మొట్టమొదటి భారతదేశ మానవ సహిత గగన్‌యాన్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలు సాఫీగా సాగుతున్నాయని బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివన్ వెల్లడించారు. చంద్రయాన్–3 ప్రయోగాన్ని 2020లోనే చేపడతామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే ఇస్రో నుంచి ప్రకటన రావడం గమనార్హం. చంద్రయాన్–2లో మాదిరిగానే చంద్రయాన్–3లోనూ ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ మాడ్యూల్ ఉంటాయని అన్నారు. చంద్రయాన్–2లో ఆర్బిటర్ మిషన్ జీవితకాలం 7 సంవత్సరాలని, చంద్రయాన్–3లోనూ దీనిని ఉపయోగిస్తామని చెప్పారు. చంద్రయాన్–2 ప్రయోగంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చంద్రయాన్–3పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. చంద్రయాన్–2 కంటే చంద్రయాన్–3 ప్రయోగానికి తక్కువ ఖర్చు అవుతుందని చెప్పారు. ఈ ప్రయోగానికి రూ.250 కోట్లు ఖర్చు కావచ్చని అంచనా వేశారు. తమ ప్రయోగాలకు 2020–21 సంవత్సర బడ్జెట్‌లో రూ.14 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ఇస్రో విజ్ఞప్తి చేసింది.

2020లో 25 ప్రయోగాలు

ప్రస్తుత ఏడాదిలో ఇస్రో సుమారు 25 వరకు ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించిందని శివన్ వివరించారు. 2019లో పూర్తి చేయని ప్రయోగాలను ఈ ఏడాది మార్చి కల్లా చేపడతామని అన్నారు.

వేగంలోనే విఫలం

వేగాన్ని నియంత్రించే వ్యవస్థ విఫలమవడంతో చంద్రయాన్–2లోని విక్రమ్ ల్యాండర్ వైఫల్యానికి కారణమని శివన్ వివరించారు. అంతర్గత కారణాల వల్లే వేగాన్ని నియంత్రించే వ్యవస్థ వైఫల్యం చెందిందని వెల్లడించారు. ఇక విక్రమ్ ల్యాండర్ ఆచూకీని కనుగొనడంలో సాయపడిన చెన్నైకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను శివన్ అభినందించారు. క్రాష్ ల్యాండింగ్ అయిన విక్రమ్ ల్యాండర్ చిత్రాలను బయటకు విడుదల చేయకూడదన్నది సంస్థ పాలసీ అని తెలిపారు. త్వరలోనే ఇస్రో టెలివిజన్ చానెల్‌ను ఆవిష్కరించనున్నట్లు శివన్ తెలిపారు.

క్లుప్తంగా...

20న 'పరీక్ష పే చర్చ'

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ విద్యార్థులతో నిర్వహించనున్న 'పరీక్ష పే చర్చ'ఈనెల 20వ తేదీన జరగనుంది. ఈమేరకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ (హెచ్ఆర్‌డీ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత 'పరీక్ష పే చర్చ'కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, దేశవ్యాప్తంగా సంక్రాంతి, లోహ్రీ, ఓనం వంటి పండుగల నేపథ్యంలో వాయిదా వేశారు. అలాగే మైగవ్ భాగస్వామ్యంతో హెచ్ఆర్‌డీ 9 నుంచి 12 తరగతుల విద్యార్థులకు లఘు వ్యాస పోటీని ప్రారంభించింది.

రైల్వేబోర్డు సీఈవోగా యాదవ్!

న్యూఢిల్లీ: రైల్వే బోర్డు చైర్మన్‌గా ఏడాదిపాటు వీకే యాదవ్ పదవీ కాలాన్ని పొడిగించిన కేంద్రం త్వరలో ఆయన్ను రైల్వే బోర్డు సీఈవోగా నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. బుధవారం పొడిగింపు బాధ్యతలు స్వీకరించిన వీకే యాదవ్‌ను కేంద్రం రైల్వే సీఈవోగా నియమిస్తే తొలిసారి ఆ పదవి చేపట్టిన వ్యక్తిగా ఆయన రైల్వే చరిత్ర పుటల్లోకి ఎక్కనున్నారు. ఆయన రైల్వే బోర్డు చైర్మన్‌గా ఉన్న కాలంలోనే బోర్డును కుదించడంతోపాటుగా 50 మంది అధికారులను ప్రధాన కార్యాలయాలనుంచి జోనల్ కార్యాలయానికి కేంద్రం ప్రభుత్వం మార్చింది.

మహిళకు పోప్ సారీ

వాటికన్ సిటీ: 'మనం చాలా సార్లు సహనం కోల్పోతుంటాం. అదే నా విషయంలో జరిగింది. నిన్న నేను చేసిన పనికి క్షమాపణలు చెబుతున్నాను' అంటూ పోప్ ఫ్రాన్సిస్ (83) బుధవారం ట్వీట్ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా వాటికన్‌లో పలువురు భక్తులను పోప్ పలకరిస్తూ వెళ్లారు. అనంతరం తిరిగి వెనక్కు వెళుతున్న సమయంలో ఓ మహిళ ఆయన చేయి పట్టుకొని వెనక్కు లాగింది. పడిపోబోయిన ఆయన నిలదొక్కుకొని, సహనం కోల్పోయి మహిళ చేతిపై రెండు సార్లు కొట్టారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయింది.

వైద్యవిద్యకు 'పీపీపీ' మోడల్!

న్యూఢిల్లీ: నిపుణులైన వైద్యుల కొరతను అధిగమించేందుకు నీతి ఆయోగ్ కొత్త ప్రతిపాదన చేసింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలను ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు 'ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)' ద్వారా అనుసంధానం చేయాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ తరహా విధానం గుజరాత్, కర్నాటకల్లో అమల్లో ఉందని 'మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్ ఫర్ సెట్టింగ్ అప్ మెడికల్ కాలేజెస్ అండర్ ద పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్' అనే ముసాయిదా పత్రం పేర్కొంది. దేశంలో నిపుణులైన వైద్యుల కొరత భారీగా ఉందని , వైద్య విద్యకు సంబంధించి ఈ లోటును తీర్చడం వనరుల కొరతతో ఇబ్బంది పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పట్లో సాధ్యం కాదని నీతి ఆయోగ్ అందులో పేర్కొంది.

'కోరెగావ్-భీమ'కు 8 లక్షల మంది

పుణె: మహారాష్ట్రలోని కోరెగావ్ –భీమ యుద్ధ విజయ స్మారక స్థూపం వద్ద బుధవారం లక్షలాది మంది నివాళులర్పించారు. కోరెగావ్ – భీమ చారిత్రక యుద్ధం జరిగి 202 ఏళ్లు పూర్తయ్యాయి. పుణె జిల్లాలో ఉన్న పెర్నె గ్రామంలో నిర్మించిన విజయస్థూపాన్ని దాదాపు 8 లక్షల మంది దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. రెండేళ్ల క్రితం ఇక్కడ కుల ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ స్థూపాన్ని దర్శించుకున్నారు.

ప్రభుత్వ ఆదేశాలే పాటిస్తాం

- రాజకీయాలకు మేము దూరం
- కొత్త సీడీఎస్ రావత్

న్యూఢిల్లీ: సాయుధ బలగాలు రాజకీయాలకు చాలా దూరంగా ఉంటూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తాయని బుధవారం కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ అన్నారు. త్రివిధ దళాల్లోనూ రాజకీయాలు ప్రవేశిస్తున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూడు దళాలు సమన్వయంతో కలసికట్టుగా పని చేయాలని, అలా చేసేలా చూడడమే సీడీఎస్ పని అని స్పష్టం చేశారు ''ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఒక బృందంగా కలిసి పనిచేస్తాయని హామీ ఇస్తున్నాను. సీడీఎస్‌గా వాటిని పర్యవేక్షిస్తూ నియంత్రిస్తూ ఉంటాను. కానీ ఏ పనైనా త్రివిధ బలగాలు ఒకరికొకరు సహకారం అందించుకుంటూ పనిచేస్తాయి''అని జనరల్ రావత్ అన్నారు. కొత్త బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రావత్ సైనికుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సీడీఎస్‌గా జనరల్ రావత్ నియామకంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. రాజకీయపరమైన ప్రయోజనాలను ఆశించే వ్యక్తిని సీడీఎస్‌గా నియమించడమేంటని నిలదీసింది. ఈ ఆరోపణల్ని రావత్ కొట్టి పారేశారు. ''మేము రాజకీయాలకు చాలా దూరం. అధికారంలో ఎవరుంటారో వారి ఆదేశాల మేరకే పనిచేస్తాం''అని రావత్ స్పష్టం చేశారు. మూడు బలగాలకు కేటాయించిన వనరుల్ని సంపూర్ణంగా, అధిక ప్రయోజనాలు కలిగేలా సద్వినియోగం చేయడమే తన కర్తవ్యమని అన్నారు. మూడు దళాలు సమన్వయంతో పని చేస్తూ వాటి సామర్థ్యం పెంచడానికే కృషి చేస్తానని జనరల్ రావత్ అన్నారు.

1+1+1=3 కాదు 5 లేదా ఏడు

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఈ మూడింటిని కలిపితే త్రివిధ బలగాలు అనే అంటాం. కానీ జనరల్ రావత్ దీనికి సరికొత్త భాష్యం చెప్పారు. ఇవి మూడు కాదని, అయిదు, లేదా ఏడు అవ్వాలని జనరల్ రావత్ వ్యాఖ్యానించారు. అంటే ఈ మూడు బలగాలు సంఘటితమైతే అంత శక్తిమంతంగా మారతాయని జనరల్ రావత్ అభిప్రాయపడ్డారు. అలా చేయడం కోసమే సీడీఎస్ పదవిని ఏర్పాటు చేశారని జనరల్ రావత్ అన్నారు. మూడేళ్లలో మూడు బలగాల మధ్య సమన్వయాన్ని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తానని జనరల్ రావత్ చెప్పారు. మూడు సైనిక దళాల చీఫ్‌గా తాను తటస్థంగా వ్యవహరిస్తానని, అందరినీ ఒకేతాటిపైకి తెచ్చి పని చేసేలా చూస్తానని అన్నారు. ఆర్మీ చీఫ్‌గా మంగళవారం పదవీ విరమణ చేసిన రావత్ భారత్ మొట్టమొదటి సీడీఎస్‌గా సోమవారం నియమితులయ్యారు. రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ సీడీఎస్ పదవిని ఏర్పాటు చేస్తూ గత వారం కీలక నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. త్రివిధ బలగాలకు సంబంధించి రక్షణ మంత్రికి అన్ని అంశాల్లోనూ సలహాదారుగా ఉండడం, మూడు బలగాల మధ్య సమన్వయం సాధిస్తూ ఉన్న వనరులనే సంపూర్ణంగా సద్వినియోగం చేయడమే సీడీఎస్ ప్రధాన విధి.


ఢిల్లీలో గౌరవ వందనం స్వీకరిస్తున్న రావత్

సంస్కరణల కోసమే సీడీఎస్: మోదీ

మిలటరీ వ్యవహారాల కోసం ఒక శాఖ ఏర్పాటు, సీడీఎస్ పదవిని ఏర్పాటు చేయడం అనేది రక్షణ శాఖలో ఒక సంస్కరణగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. జనరల్ బిపిన్ రావత్ సీడీఎస్ పదవిని చేపట్టడంతో ఆయనను అభినందించారు. భారత్‌కు ఆయన ఇప్పటికే ఉత్తేజపూరితంగా అపారమైన సేవల్ని అందించారని, కర్తవ్యదీక్ష కలిగిన అధికారని రావత్‌ని కొనియాడారు. ఆధునిక యుద్ధ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో సీడీఎస్ పాత్ర ఆవశ్యకత ఎంతో ఉందని, దీనిని రక్షణశాఖలో ఒక సమగ్రమైన సంస్కరణగానే చూడాలని ప్రధాని ట్వీట్ చేశారు. భారత దేశ మిలటరీ బలగాల్ని ఆధునీకరించి, 130 కోట్ల మంది ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంలా ఉండే అత్యున్నత బాధ్యత సీడీఎస్‌పైనే ఉందని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. భారత్‌లో మిలటరీలో సంస్కరణలు మొదలయ్యాయని చెప్పారు. సంస్కరణల ఆరంభం చరిత్రను సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రి X కేంద్రమంత్రి

పౌరసత్వ సవరణ చట్టంపై కేరళ సీఎం విజయన్, కేంద్ర మంత్రి రవిశంకర్ మధ్య మాటల యుద్ధం

తిరువనంతపురం: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు సంబంధించి కేరళ ప్రభుత్వానికి, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు మధ్య వాగ్యుద్ధం జరుగుతోంది. కేరళలో సీఏఏ అమలుచేయబోమన్న రాష్ట్ర అసెంబ్లీ తీర్మానంపై కేంద్ర ప్రభుత్వం విరుచుకుపడింది. పౌరసత్వంపై చట్టాలను రూపొందించే అధికారం కేవలం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుందని.. కేరళసహా మరే ఇతర రాష్ట్రానికి ఉండబోదన్న కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ఆరోపించారు. రవిశంకర్ వ్యాఖ్యలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీలకు కూడా సొంత హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. ఆ హక్కులకు ప్రత్యేక రక్షణ ఉంటుందని.. వాటిని ఎవరూ ఉల్లంఘించరాదని తేల్చిచెప్పారు. రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే తీరుగా ఉన్న పౌరసత్వ చట్టాన్ని అమలు చేసేది లేదని తీర్మానించిన తొలి రాష్ట్రం కేరళ అని అన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాల్సిందేనని రవిశంకర్ అన్నారు. పార్లమెంట్ చట్టాలను అమలుచేయబోమని చెప్పే అధికారం రాష్ట్రాలకు లేదని తేల్చిచెప్పారు. కాగా.. సీఏఏ అమలు చేయబోమని కేరళ ప్రభుత్వం తీర్మానించడం పార్లమెంటరీ అధికారాల ఉల్లంఘన కిందకు వస్తుందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యకు లేఖ రాశారు.

కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ కొచ్చిలో ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సంస్థల సభ్యులు

3 కోట్ల లంచం కేసులో అధికారి అరెస్టు

న్యూఢిల్లీ: రూ.3 కోట్ల లంచం కేసుకు సంబంధించి పంజాబ్‌లోని లూధియానాకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సీనియర్ అధికారి చంద్రశేఖర్‌ను సీబీఐ అరెస్ట్‌చేసింది. పలు ఎగుమతిదారులకు సేవలందించే ఓ ప్రైవేట్ క్లియరింగ్ ఏజెన్సీలో 2019, జూన్‌లో డీఆర్ఐ తనిఖీలు చేపట్టిందని, అందులో భాగంగా కొన్ని పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. దీంతో ఆ పత్రాలకు సంబంధించి క్లియరింగ్ హౌజ్ ఏజెంట్ అనూప్ జోషి, చంద్రశేఖర్ సన్నిహితుడు రాజేశ్ ధాండా ప్రభుత్వ అధికారి తరపున రూ.3 కోట్ల లంచం డిమాండ్ చేశారని ఫిర్యాదు దారుడు ఆరోపించారు. అధికారి తరపున మొదటి విడతగా రూ.25 లక్షల లంచం తీసుకున్నందుకు సీబీఐ.. జోషి, ధాండాలను అరెస్టు చేసినట్లు తెలిపారు.

చొరబాట్లను ఆపుతూ అమరులయ్యారు

సరిహద్దులో ఇద్దరు సైనికుల వీరమరణం

జమ్మూ: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదులను అడ్డుకునే క్రమంలో ఇద్దరు సైనికులు అమరులయ్యారు. సాయుధులైన ఉగ్రవాదులకు, ఇద్దరు భారత సైనికుల మధ్య కాల్పులు జరిగాయని, ఈ కాల్పుల్లో గాయపడిన ఇద్దరు సైనికులు మరణించారని లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ బుధవారం చెప్పారు. ఈ ఘటన మంగళ, బుధవారాల మధ్య రాత్రిలో జరిగిందన్నారు. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో చోటుచేసుకుందని తెలిపారు. ఉగ్రవాదులతో పోరాడి మరణించిన సైనికులు నాయక్ సావంత్ సందీప్ రఘునాథ్ (29), రైఫిల్‌మ్యాన్ అర్జున్ తపా మగర్ (25)లకు దేశం రుణపడి ఉంటుందన్నారు. వీరిలో సావంత్ మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందినవ్యక్తి కాగా, అర్జున్ నేపాల్‌లోని గోర్ఖా జిల్లాకు చెందినవారు. కాల్పుల అనంతరం ఉగ్ర కదలికలు ఉన్నట్లు అనుమానించిన చోట్ల సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులను పట్టుకునేందుకు భారీ ఆపరేషన్ ప్రారంభించినట్లు చెప్పారు.

'చైనా సరిహద్దుల్లో సామర్థ్యం బలోపేతం'

చైనాతో సరిహద్దుల్లో శాంతి, సామరస్యం నెలకొంటే.. క్రమంగా సరిహద్దు సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆర్మీ కొత్త చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె పేర్కొన్నారు. దేశ ఉత్తర సరిహద్దుల్లో మిలటరీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

ప్రాంతీయంగా శాంతి నెలకొనాలి

- వివిధ దేశాధినేతలకు ప్రధాని ఫోన్

న్యూఢిల్లీ: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ బుధవారం ఇరుగు పొరుగు దేశాధినేతలతో ఫోన్లలో మాట్లాడారు. వారికి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు అందిస్తూనే ప్రాంతీయంగా శాంతి భద్రతల కోసం భారత్ కట్టుబడి ఉందని చెప్పారు. శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్స, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ ప్రధాని కె.పి. శర్మ ఒలి, భూటాన్ రాజు జిగ్మె ఖేసర్, మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సొలి తదితరులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాంతీయంగా శాంతి భద్రతల అంశానికే తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని మోదీ ఈ సందర్భంగా తెలియజేశారు.




భారత వాయుసేన వీడియో వైరల్

భారత వాయుసేన 2020 కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజలందరికీ శుభాకాంక్షలు అందిస్తూ రూపొందించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నరనరాల్లోనూ ఉప్పొంగే దేశభక్తి, ఉవ్వెత్తున ఎగిసిపడే భావోద్వేగాలతో ఈ వీడియోను రూపొందించారు. గగనతలాన్ని రేయింబవళ్లు కంటికి రెప్పలా కాపాడే వాయుసేన బలగాల కర్తవ్యదీక్షలో ఎలాంటి సాహసాలు చేస్తారో చూపించిన అత్యంత శక్తిమంతమైన దృశ్యాలు అందరినీ కట్టిపడేశాయి. హిందీలో కవితాత్మకంగా దేశభక్తిని, మాతృభూమి రక్షణ కోసం వాయుసేన చేసే సాహసాన్ని వర్ణించిన తీరుతో రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వీడియోను ఐఏఎఫ్ తన ట్విటర్ అకౌంట్‌లో పోస్టు చేసింది. అది క్షణాల్లోనే వైరల్ అయింది. కొద్ది గంటల్లో 13వేలకు పైగా వ్యూస్, 5వేలకు పైగా లైక్‌లు, వెయ్యికి పైగా రీట్వీట్‌లతో వైరల్‌గా మారింది.

మతిమరుపు వ్యాధికి మందు వచ్చేసింది

చైనాలో మార్కెట్‌లోకి జీవీ971



బీజింగ్: తీవ్ర మతిమరుపు వ్యాధి అయిన అల్జీమర్స్‌ను నయం చేసేందుకు చైనాలో కొత్త మందు మార్కెట్లోకి వచ్చింది. దీంతో ఈ వ్యాధితో బాధపడుతున్న కొన్ని లక్షల మందికి ఎంతో ఊరట చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బ్రౌన్ ఆల్గే (శైవలం) నుంచి సంగ్రహించిన ఈ మందు.. అల్జీమర్స్ వ్యాధికి ప్రపంచంలోనే కనుగొన్న మొట్ట మొదటిదని చైనాలోని నేషనల్ మెడికల్ ప్రొడక్ట్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పేర్కొన్నారు. జీవీ–971గా పిలుస్తున్న ఈ మందుకు నవంబర్ 2న అధికారికంగా చైనా ప్రభుత్వం అనుమతులిచ్చింది. కాగా, ఆదివారం నుంచి మార్కెట్‌లోకి వచ్చినట్లు అధికారులు చెప్పారు. ఏడాది పాటు వాడాలంటే ఒక రోగికి దాదాపు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ మందును చైనాలో మెడికల్ ఇన్సూరెన్స్ జాబితాలో చేర్చే ప్రయత్నం చేస్తామని, దీంతో రీయింబర్స్‌మెంట్ చేసుకునే వీలు కలుగుతుందని షాంఘై గ్రీన్ వ్యాలీ ఫార్మాసూటికల్స్ చైర్మన్ సొంగ్‌టావో తెలిపారు.

కోటాలో వందకు చేరిన శిశు మరణాలు

కోటా: రాజస్తాన్‌లోని కోటాలో శిశువుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. రెండ్రోజుల్లోనే అక్కడి జేకే లోన్ ప్రభుత్వ ఆస్పత్రిలో 9 మంది శిశువులు మృతి చెందడంతో డిసెంబర్ నెలలో మరణించిన శిశువుల సంఖ్య వందకు చేరింది. శిశువులు తక్కువ బరువుతో జన్మించడం వల్లే మృతి చెందుతున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ చెప్పడం గమనార్హం. కాగా, బీజేపీ ఎంపీల బృందం మంగళవారం ఆస్పత్రిని సందర్శించింది.ఆస్పత్రిలో ఒకే బెడ్డుపై ఇద్దరు నుంచి ముగ్గురు శిశువులు చికిత్స పొందుతున్నారని, తగినంత మంది నర్సులు కూడా లేరని ఎంపీల బృందం తెలిపింది.



హాంకాంగ్‌లో భారీ ర్యాలీ

హాంకాంగ్: హాంకాంగ్‌లోని ప్రజాస్వామ్య అనుకూల నిరసనకారులు నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞచేశారు. గత ఏడు నెలలుగా లక్షలాది హాంకాంగ్‌వాసులు ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరసనలు చేస్తున్నారు. కొత్తే ఏడాది సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో లక్షలాది మంది ఆందోళనకారులు పాల్గొన్నారు. వారి ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పెప్పర్ స్ప్రే, టియర్ గ్యాస్, వాటర్ కెనాన్‌లను ఆందోళనకారులపై ప్రయోగించారు. ప్రతిగా పోలీసులపై పెట్రోల్ బాంబులను ఆందోళనకారులు విసిరారు. వీధుల్లోని చైనా అనుకూల వ్యాపార సముదాయాలను ధ్వంసం చేశారు. కాగా, 100 మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు.


వెల్‌కమ్ త్రిపురలోని అగర్తలాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్త సంవత్సరం రోజున పుట్టిన శిశువులు

త్వరలో కొత్త వ్యూహాత్మక ఆయుధం

ప్రపంచానికి చూపుతానన్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్

సియోల్: త్వరలో ఒక నూతన వ్యూహాత్మక ఆయుధాన్ని ప్రపంచానికి చూపనున్నామని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వెల్లడించారు. అణ్వాయుధ, ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు నిర్వహించకూడదంటూ విధించుకున్న స్వీయ నియంత్రణను మరెంతో కాలం కొనసాగించబోమని తేల్చిచెప్పారు. ఉత్తర కొరియా తీసుకున్న ఈ స్వీయ నియంత్రణ నిర్ణయాన్ని తన దౌత్య విజయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకుంటున్న విషయం తెలిసిందే. అయితే, ఈ అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలపై నియంత్రణ విధించుకున్న సమయంలో.. కిమ్ తన మధ్యశ్రేణి ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకున్నారు. సాధారణంగా ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్(ఐసీబీఎం) వంటి అణ్వాయుధ సామర్థ్య ఆయుధ శ్రేణిని వ్యూహాత్మక ఆయుధంగా పరిగణిస్తారు. కిమ్ వ్యాఖ్యలను బుధవారం అధికార మీడియా ప్రచురించింది. అధికార వర్కర్స్ పార్టీ సెంట్రల్ కమిటీ కీలక సమావేశాలు జరుగుతున్న సందర్భంలో కిమ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే, అదే సమావేశంలో.. ఆర్థిక ప్రయోజనాల కోసం దేశ భద్రతను పణంగా పెట్టబోనని కిమ్ స్పష్టం చేశారు. అణ్వాయుధ నిర్మూలన, ఉత్తర కొరియాపై ఆంక్షల తొలగింపు తదితర అంశాల్లో ఏకాభిప్రాయం కుదరని కారణంగా అమెరికా, ఉత్తర కొరియాల మధ్య జరుగుతున్న చర్చల్లో ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. ఈ మధ్య కాలంలో, రష్యా, చైనాలతో మైత్రికి కిమ్ పలు చర్యలు చేపట్టారు.



నూతన సంవత్సర ప్రసంగానికి దుమ్మా

2013 నుంచీ ప్రతీ సంవత్సరం తొలి రోజున ఆనవాయితీగా ఇచ్చే ప్రసంగానికి ఈ సంవత్సరం కిమ్ దుమ్మా కొట్టారు. గతాన్ని సమీక్షిస్తూ, భవిష్యత్తు లక్ష్యాలను వివరిస్తూ దేశాధ్యక్షుడిగా ప్రజలకు ప్రతీ సంవత్సరం జనవరి 1న కిమ్ సందేశమిస్తారు. ఆ ప్రసంగం పూర్తి పాఠం అధికార మీడియాలో ప్రచురితమవుతుంది. కానీ ఈ సంవత్సరం ఆయన ఎలాంటి సందేశమివ్వలేదు. కానీ, పార్టీ సమావేశంలో ఆయన చేసిన ప్రసంగాన్ని అధికార టీవీ ప్రసారం చేసింది. అమెరికాతో చర్చలు సహా గత సంవత్సర వైఫల్యాలను అంగీకరించలేకనే 2020 తొలి రోజు సందేశాన్ని కిమ్ ఇవ్వలేదని దక్షిణ కొరియాకు చెందిన అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు పార్క్ వాన్‌గాన్ వ్యాఖ్యానించారు.

సాక్షి

గురువారం, జనవరి, 2

మౌలిక రంగంపై దృష్టి

ఆర్థిక మాంద్యం ముసురుకొని సాధారణ పౌరులకు ఊపిరాడని వేళ కేంద్ర ప్రభుత్వం మంగళవారం చేసిన ప్రకటన కాస్తంత ఊరటనిస్తుంది. వచ్చే అయిదేళ్లలో మౌలిక సదుపాయాల రంగంలో 102 లక్షల కోట్లమేర పెట్టుబడులు పెట్టేందుకు నిర్ణయించడం ఆ ప్రకటన సారాంశం. ఇంధనం, రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, టెలికాం, ఇరిగేషన్, పట్టణ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలతోపాటు విద్య, వైద్యం, హౌసింగ్, రవాణా, పౌర సదుపాయాలు వంటి సామాజిక రంగ ప్రాజెక్టుల్లో కూడా ఈ పెట్టుబడులుంటాయి. ఇందులో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 39 శాతం చొప్పున, మిగిలిన 22 శాతం మేర ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టవలసివుంది. గత సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి మన జీడీపీ 4.5 శాతం మాత్రమే ఉన్నదని, ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయికి చేరుకుందని వెల్లడైంది. ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయి మాత్రమే కాదు... వరసగా ఆరో ఏడాది నమోదైన క్షీణత. నిరుడు ఫిబ్రవరి మొదలుకొని రిజర్వ్ బ్యాంక్ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి తన వంతు ప్రయత్నం తాను చేస్తోంది. అది రెపో రేటు తగ్గించినా అందుకు తగ్గట్టుగా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించలేదు. కనుకనే ఆశించిన స్థాయిలో పెట్టుబడులు పెరగలేదు. కేవలం ఇదొక్కటే కారణమని కూడా చెప్పలేం. ఇప్పుడున్న వాతావరణంలో పెట్టుబడులు పెట్టడం ఎంతవరకూ సురక్షితమో తెల్చుకోలేని స్థితిలో తయారీ రంగ దిగ్గజాలున్నాయన్నది కూడా వాస్తవం. అనుకున్నంతగా ఉపాధి అవకాశాలు లేకపోవడం, ఉన్న అవకాశాలు కూడా నానాటికీ కుంచించుకుపోవడం పర్యవసానంగా వినిమయం క్షీణ దశలోవుంది. కనుకనే ఆర్థిక రంగం పతనావస్థలోనే తప్ప పైకి లేవడానికి ప్రయత్నిస్తున్న దాఖలా కనబడటం లేదు. 2017–18లో నిరుద్యోగిత 6.1 శాతంగా వున్నదని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించగా, సగటు వినిమయం 2011–12, 2017–18 మధ్య కాలంలో గణనీయంగా తగ్గిందని జాతీయ గణాంక విభాగం చెబుతోంది. తయారీ రంగం తొలి త్రైమాసికంలో 0.6 శాతంవుంటే అదిప్పుడు –1.0 శాతానికి పడిపోయింది. 2017–18 తొలి త్రైమాసికంలో కూడా ఇంచుమించు ఇదే స్థితి వుంది. అప్పట్లో అది –1.7 శాతంగా నమోదై అందరినీ కలవరపెట్టింది.

తాము అధికారంలోకొస్తే వృద్ధి రేటు మరింత పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, సమ్మిళితవృద్ధి సాధిస్తామని బీజేపీ 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అయితే జరిగిందంతా అందుకు విరుద్ధం. ఆర్థికరంగం ఎదుర్కొంటున్న కష్టాలు ఒక్క మన దేశానికే పరిమితం కాదన్నది నిజమే. ప్రపంచమంతటా కొంత హెచ్చుతగ్గులతో అదే స్థితివుంది. కానీ 2016లో చలామణిలోవున్న కరెన్సీలో 86 శాతం వాటావున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం పర్యవసానంగా ఆ కష్టాలు మన దేశానికి మరింత ఎక్కువయ్యాయన్నది వాస్తవం. ఆ నిర్ణయం తర్వాత చిన్నతరహా పరిశ్రమలు పెద్దయెత్తున మూతబడ్డాయి. లక్షలమంది కార్మికుల ఉపాధి దెబ్బతింది. ఆ త్రైమా సికంలో సైతం మన జీడీపీ 7 శాతంగా నమోదైంది. కానీ ఉన్నకొద్దీ అది మరింత కుంగటం మొద లైంది. ఇప్పుడు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గత ఆరేళ్లలో మౌలిక సదుపాయాల రంగంపై మొత్తం రూ. 51 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారు. అంటే సగటున ఏటా 8.5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టినట్టు లెక్క. తాజాగా వచ్చే అయిదేళ్లలో రూ. 102 లక్షల కోట్లు వ్యయం చేస్తామని ఆమె ప్రకటించారు. అంటే ఏడాదికి సగటున 20 లక్షల కోట్లకు మించి వ్యయం చేయాల్సివుంటుంది. రూ. 8.5 లక్షల కోట్ల నుంచి ఒక్కసారిగా ఈ స్థాయికి ఎగబాకటం సిద్ధపడటం సాధ్యమేనా? ఇందులో కేంద్రం, రాష్ట్రాలు, ప్రైవేటు రంగం కూడా వుంటాయని చెప్పడం బాగానే వున్నా ఒకేసారి రూ. 20 లక్షల కోట్ల మేరకు పెంచడం కుదురుతుందా? ఆ మేరకు ఆదాయ వనరులు పెరగాలంటే అందుకు తగ్గ అవకాశాలున్నాయా? ఒక పక్క ఆర్థిక మాంద్యం పట్టిపీడిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆదాయ వనరుల్ని ఎక్కడనుంచి పెంచుకోవాలి? వాటి సంగతలావుంచి వేర్వేరు ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వార్షిక వ్యయం...కేంద్ర ప్రభుత్వం వాటాతో పోలిస్తే చాలా ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఆ లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు సగటున రూ. 3.3 లక్షల కోట్లు వ్యయం చేస్తుంటే కేంద్రం చేసేది రూ. 2.38 లక్షల కోట్లు. తాజా నిర్ణయం ప్రకారం కేంద్రం, రాష్ట్రాలు చెరో 39 శాతం మేర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వ్యయం చేయాలంటే ఇప్పుడు పెడుతున్న వ్యయాన్ని అవి ఎన్ని రెట్లు పెంచుకోవాలో సులభంగానే బోధపడుతుంది. ఆ స్థాయిలో నిధుల సమీకరణ సాధ్యమా అన్నది పెద్ద ప్రశ్న. ఇక ఈ ప్రాజెక్టులకు ప్రైవేటు రంగం సంపూర్ణ సహకారం ఇవ్వదల్చుకుంటే అది 22 శాతం వ్యయం చేయాల్సివుంటుంది.

వ్యాపారవేత్తలెవరైనా తమకు లాభాలొచ్చే అవకాశం వుందా లేదా అనేది గీటురాయిగా తీసుకుంటారు తప్ప, ప్రభుత్వం కోరిందన్న కారణంతో పెట్టుబడులు పెట్టలేరు. ప్రజల వినిమయం పెరుగుతుందన్న విశ్వాసం వున్నప్పుడే, తమ ఉత్పత్తులు అమ్ముడవుతాయన్న నమ్మకం కుదిరినప్పుడే వారు ఉత్సాహంగా మదుపు చేస్తారు. అంతేకాదు... ఏ దేశంలోనైనా రాజకీయ సుస్థిరత వున్నప్పుడు, సామాజికంగా శాంతియుత వాతావరణం నెలకొన్నప్పుడు, ప్రభుత్వాలు ఆర్థిక రంగానికి సంబంధించి సాహసోపేతమైన, స్థిరమైన నిర్ణయాలు తీసుకోవడానికి సంసిద్ధంగా వున్నప్పుడు మాత్రమే పెట్టుబడులు పుష్కలంగా వస్తాయి. ఇప్పుడు మౌలిక సదుపాయాల రంగంలో భారీయెత్తున పెట్టుబడులు పెట్టడానికి చేసిన పథక రచన విజయవంతంగా అమలు కావాలంటే ఇతరత్రా అంశాలన్నీ పటిష్టంగా వుండాలి. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటున్నదన్న విశ్వాసం అందరిలోనూ కలగాలి. అది ఏమేరకు ఏర్పడుతుందో చూడాల్సివుంది.


గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి శు.సప్తమి రా.6.51 వరకు, తదుపరి అష్టమి నక్షత్రం ఉత్తరాభాద్ర తె.5.46 వరకు (తెల్లవారితే శుక్రవారం) వర్జ్యం ఉ.9.22 నుంచి 11.10 వరకు, దుర్ముహూర్తం ఉ.10.13 నుంచి 10.57 వరకు, తదుపరి ప.2.36 నుంచి 3.20 వరకు అమృతఘడియలు... రా.12.26 నుంచి 2.13 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.32
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

భారతీయులందరూ హిందువులేనా?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఈ దేశంలోని ముస్లింలు, బౌద్ధులు, క్రిస్టియన్లు, సిక్కులు, పార్శీలు తమ తమ దేవుళ్లతోపాటు, భారతమాతను పూజిస్తే చాలు.. వీరంతా హిందువులే అవుతారని ఆరెస్సెస్ సర్‌సంచాలక్ మోహన్ భగవత్ హైదరాబాద్ సదస్సులో ప్రకటించారు. ఈ గడ్డపై నివసిస్తూ, భారతమాతను పూజిస్తూ, ఈ నేలను, నీళ్లను ప్రేమించే ప్రతి ఒక్కరూ హిందువులే అంటూ సూత్రీకరించారు. ఆరెస్సెస్/బీజేపీ కార్యకర్తలు స్వర్గాన్నీ, రాజ్యాధికారాన్ని కోరుకోరని చెప్పడం ద్వారా ఆయన కౌటిల్యుడిని, మనువును, సావర్కార్‌ని, హెగ్డేవార్‌ని, గోల్వాల్కర్‌ని కూడా దాటి ముందుకు వచ్చేశారు. అయితే రాజ్యాధికారం కోసం కాకపోతే బీజేపీని ఆరెస్సెస్ ఎందుకు స్థాపించినట్లు? లౌకికవాదం, రాజ్యాధికారంపై విశ్వాసం ఉంచుతున్న ఇతర రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా బీజేపీని నిలిపి దాని విజయానికి ఆరెస్సెస్ ఎందుకు కృషి చేస్తూ వస్తోంది? భారతీయ ముస్లింలు, బౌద్ధులు, క్రిస్టియన్లు, తమ తమ మత ముద్రలకు హిందూ ముద్రను చేర్చుకోవటాన్ని తప్పనిసరి చేస్తున్న మోహన్ భగవత్ కొత్త సిద్ధాంతంపై చర్చ జరగాల్సి ఉంది.

శాంతి, అహింసల ప్రబోధకుడిగా ప్రపంచమంతటా గుర్తించిన జీసస్ క్రీస్తు జన్మదినమైన డిసెంబర్ 25న ఆర్ఎస్ఎస్ సర్‌సంచాలక్ మోహన్ భగవత్ హైదరాబాద్‌లో ప్రసంగిస్తూ, హిందువులు, హిందూయిజం పూర్తిగా భిన్నమైనవని నిర్వచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం దేశంలోని 130 కోట్లమంది ప్రజలు హిందువులేనట. ఈ గడ్డపై నివసిస్తూ, భారతమాతను పూజిస్తూ, ఈ నేలను, నీళ్లను ప్రేమించే ప్రతి ఒక్కరూ హిందువులే అన్నారు. అంటే తమ తమ విశ్వాసాల మేరకు తమ దేవుడిని పూజించే, ప్రార్థించే భారతీయులందరూ ఇకనుంచి ఆర్ఎస్ఎస్ సృష్టించి, ప్రచారం చేస్తున్న భారతమాతను కూడా తమ దేవతగా తప్పకుండా పూజించాలన్నమాట. ఆయన చెప్పిందాన్ని బట్టి, ఈ దేశంలోని ముస్లింలు, బౌద్ధులు, క్రిస్టియన్లు, సిక్కులు, పార్శీలు తదితరులందరూ రెండు శక్తులను (ఒకరు తమ దేవుడు, మరొకరు దేవత అయిన భారత మాత) పూజించాల్సి ఉంటుంది.

జాతీయ పౌర పట్టికలో కానీ, పాఠశాలలో కానీ, మరే ఇతర రికార్డులో కానీ మతం అనే కాలమ్‌లో భారతీయులు తప్పనిసరిగా ఇకనుంచి ముస్లిం–హిందూ, బుద్ధిస్టు–హిందూ, క్రిస్టియన్–హిందూ, సిక్కు–హిందూ, పార్శీ–హిందూ అని నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఆ తర్వాతే వారు తమ పవిత్ర గ్రంథం, తమదైన ఆహార సంస్కృతిని, తమ వివాహ వ్యవస్థను అనుసరించవచ్చు. అయితే ఈసారి మాత్రం మోహన్ భగవత్ దేశపౌరులందరూ ఆవును పూజించాలని, గొడ్డు మాంసం తినడం ఆపివేయాలని తన ప్రసంగంలో చెప్పలేదు. అలాగే ఉమ్మడి పౌరస్మృతి గురించి కూడా మాట్లాడలేదు. అయితే ఇస్లాం లేక క్రిస్టియానిటీ లేదా బుద్ధిజం లేక సిక్కిజం మరే ఇతర మతంలో అయినా చేరినా లేదా చేరాలని తలుస్తున్నవారు తప్పకుండా తమ మతంలో విడదీయరాని విధంగా హిందూ అనే పదాన్ని చేర్చాలన్నది ఆయన ప్రసంగ సారాంశం.

సావర్కార్, హెగ్డేవార్, గోల్వాల్కర్ తదితరులు హిందుత్వకు ఇచ్చిన గత నిర్వచనాల నుంచి మోహన్ భగవత్ వేరుపడ్డారు. గతంలో హిందుత్వ లేక హిందూయిజం కాస్త విభిన్నార్థంలో కనిపించేది. కాని ఇప్పుడు ఆయన ఒక ప్రధాన సమస్యను పరిష్కరించేశారు. ఈ క్రమంలో రాజకీయ సైద్ధాంతిక విషయాన్ని సైతం ఆయన తీసివేశారు. ఇది ముస్లింలు, బుద్ధిస్టులు, క్రిస్టియన్లు, సిక్కులను కలుపుకోవడానికి అవకాశమిస్తుందని ఆయన అభిప్రాయం. ఇది పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టిక సమస్యను కూడా పరిష్కరిస్తుంది. వలస వచ్చిన ముస్లింలు లేక శరణార్థులు తమ పేర్లకు ముస్లిం–హిందూ అని చేర్చుకోవలసి ఉంటుంది. ఆ తర్వాతే వారు అరబిక్ భాషలో అల్లా అని ప్రార్థించవచ్చు. కానీ ప్రార్థన ముగింపులో మాత్రం తప్పకుండా భారత్ మాతా కీ జై అని చెప్పాల్సి ఉంటుంది.

కౌటిల్యుడు, మనువు తర్వాత హిందూ తత్వశాస్త్రానికి సంబంధించిన అతి గొప్ప సిద్ధాంతవేత్తగా మోహన్ భగవత్ ఆవిర్భవించారు. కౌటిల్యుడు, మనువు తమ సొంత సైద్ధాంతిక రచనలైన అర్థశాస్త్రం, మనుధర్మశాస్త్రం రచించడం ద్వారా మౌర్య చంద్రగుప్త, పుష్యమిత్ర శుంగ సామ్రాజ్యాలను స్థాపించారు. తమ సిద్ధాంతాలతో చంద్రగుప్తుడిని, పుష్యమిత్రుడిని అధికారంలోకి తెచ్చిన కౌటిల్యుడు, మనువు లాగే మోహన్ భగవత్ కూడా నరేంద్రమోదీని అధికారంలోకి తెచ్చారు. నరేంద్రమోదీ తర్వాత తాను జీవించి ఉన్న కాలంలోనే అమిత్ షా కూడా దేశ ప్రధాని కావచ్చు. పార్లమెంటులో ప్రస్తుతం బీజేపీ సాధించిన మెజారిటీ కానీ, కేంద్రంలో రెండు దఫాల పాలన కానీ మోహన్ భగవత్ తాత్విక వ్యూహాత్మక చేర్పుగానే చెప్పాలి.



హైదరాబాద్ సదస్సులో తన నూతన సిద్ధాంతాన్ని విస్తరించి చెప్పినట్లుగా మోహన్ భగవత్ అభిప్రాయం మేరకు, ప్రపంచంలోని మానవులను మూడు రకాలుగా విభజించవచ్చు. వీరందరికీ మూడు రకాలైన లక్షణాలు ఉంటాయి. అవి 'తమో, రజో, సత్వ' గుణాలు. తమోగుణం కలిగినవారు తాము విషాదంలో ఉంటూ ఇతరులనూ విషాదంలో ముంచెత్తుతుంటారు. వీరు హింసను ప్రేరేపించినప్పటికీ విజయం సాధించలేరు. అంతిమంగా వీరు ప్రతి ఒక్క అంశాన్నీ విధ్వంసం చేస్తారు. ఇక రజోగుణానికి చెందినవారు తమ ప్రయోజనాలకు చెందిన పనులను మాత్రమే చేపడుతుంటారు. తాము సంపన్నులు కావడానికి, తమ సొంత ప్రతిష్టలకు వీరు ఇతరులను ఉపయోగించుకుంటుంటారు. కాగా సంఘ్ పరివార్, భారతదేశం ధర్మ విజయాన్ని (సత్వ గుణాన్ని) నమ్ముతుంటాయి. ఈ ధర్మపాలనలో ప్రజలు ఇతరుల సంతోషం కోసం, శ్రేయస్సు కోసమే వీరు జీవిస్తుంటారు తప్ప స్వర్గాన్నీ, రాజ్యాధికారాన్ని లేక మరి దేన్ని కూడా తమకోసం కోరుకోరు'' (ది హిందూ 2019 డిసెంబర్ 28)

ఇది ఎంత అత్యున్నతమైన సృజనాత్మక సిద్ధాంతం అంటే.. స్వర్గాన్ని, రాజ్యాధికారాన్ని రెండింటినీ సాధించడానికి నేరాలకు, హింసలకు పాల్పడుతూనే స్వర్గంపై, రాజ్యాధికారంపై విశ్వాసం నుంచి విశ్వాసులను కాపాడుతూ వస్తోంది. ఈ రెండు వ్యవస్థలూ మారణకాండకు దారితీసిన హింసను ప్రేరేపిస్తూ వచ్చాయి. ఇంతవరకు పవిత్ర ముస్లింలుగా, పవిత్ర క్రిస్టియన్లుగా, పవిత్ర బౌద్ధులుగా, పవిత్ర సిక్కులుగా చెప్పుకుంటూ జీవిస్తున్న ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కులు అందరూ ఈ జీవితంలో మరణం తర్వాత, రాజకీయాధికారం పొందిన తర్వాత స్వర్గాన్ని కోరుకుంటూ వచ్చారు. ఇలాంటి వాళ్లందరూ హింసకు పాల్పడుతూనే వచ్చారు.

అయితే తొలిసారిగా ఆరెస్సెస్/బీజేపీ కార్యకర్తలు స్వర్గాన్నీ, రాజ్యాన్నీ కోరుకోవడం లేదని మోహన్ భగవత్ పేర్కొన్నారు. పైగా ఆరెస్సెస్/బీజేపీ కార్యకర్తలకుమల్లే స్వర్గాన్ని, రాజ్యాధికారాన్ని పొందాలనే కోరిక నుంచి బయటపడాలనే వారు తమ తమ మత చిహ్నాలతో పాటు హిందూ ట్యాగ్‌ను కూడా చేతపట్టాల్సి ఉంటుంది. హిందూయిజంలోకి మారాలని కానీ లేక తన హిందూ మతం నుంచి వేరొక మతంలోకి మారిన వారు ఘర్‌వాపసీలో భాగంగా మళ్లీ హిందూమతంలోకి మారాలని కానీ మోహన్ భగవత్ ఇప్పుడు ఎవరినీ కోరలేదు. దీనికి బదులుగా వీరందరూ తమ మతానికి అదనంగా హిందూ ట్యాగ్‌ను చేర్చుకుంటే చాలు.

అయితే ఇక్కడ మనకు తట్టే ప్రశ్నల్లా ఏమిటంటే.. రాజ్యాధికారం చేజిక్కించుకోవడానికి కాకపోతే భారతీయ జనతాపార్టీని ఆరెస్సెస్ ఎందుకు స్థాపించినట్లు? పాపకార్యాలుగా తాను భావిస్తున్న లౌకికవాదం, రాజ్యాధికారంపై విశ్వాసం ఉంచుతున్న ఇతర రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా బీజేపీని నిలిపి దాని విజయానికి ఆరెస్సెస్ ఎందుకు కృషి చేస్తూ వస్తోంది? ఆరెస్సెస్ తన 95 ఏళ్ల జీవితకాలంలో తమో, రజోగుణ కార్యాచరణలో ఎన్నడూ పాల్గొనలేదని ప్రపంచానికి మోహన్ భగవత్ నొక్కి చెబుతున్నారు. లేక ధర్మ కాలంలోలాగా 2014కి ముందు ఆరెస్సెస్ ఘర్షణల చరిత్రను ఆయన గుర్తిం చడం లేదు. హిందువులకు స్వర్గాన్ని, రాజ్యాధికారాన్ని తిరస్కరించడంలోనే మోహన్ భగవత్ ధర్మంలోని మౌలిక సారాంశం దాగి ఉంది. అందుచేత ఆయన ప్రస్తుత మాటలు గౌతమబుద్ధుడి కంటే మించిన రాడికల్ స్వభావంతో ఉంటున్నాయి.

ప్రాచీన హిందూ పురాణాలు మనకు చెబుతూ వచ్చినట్లుగా తమో, రజో గుణం కలిగినవారు భారతదేశంలో లేరని భగవత్ నూతన హిందూ సిద్ధాంతం చెబుతోంది. వారు భారతదేశంలోని దిగువ కులాలకు, ముస్లింలకు, క్రిస్టియన్లకు చెందినవారు కారనీ వారంతా భారత్ బయటే ఉంటున్నారని ఈ సిద్ధాంత భావన. అయితే భారతీయ ముస్లింలు, బౌద్ధులు, క్రిస్టియన్లు, తమ తమ మత ముద్రలకు హిందూ ముద్రను చేర్చుకోనట్లయితే అప్పుడు వారిని తమో, రజో, గుణ సంపన్నులుగా గుర్తించవచ్చు. ఈ రకమైన పరివర్తనకు మోహన్ భగవత్ తగినంత పరిధిని ఇచ్చారు. ఇదీ మోహన్ భగవత్ నూతన భారతదేశం. ఈ జాతి పిల్లల భవిష్యత్తు కోసం ఆయన ఒక భారీ డిజైన్‌ని సూచిస్తున్నారు. ఆయన హైదరాబాద్‌లో ప్రవచించిన సిద్ధాంతాన్ని పలురకాలుగా వ్యాఖ్యానించవచ్చు, పునర్ వ్యాఖ్యానించవచ్చు కూడా. ఇప్పటికే మీడియా ఆయన సిద్ధాంతాన్ని చాలా ప్రముఖంగా నివేదించింది. టీవీ చానల్స్ ఆయన ప్రసంగాన్ని విస్తృతంగా ప్రత్యక్ష ప్రసారం చేశాయి. ఈ నేపథ్యంలో ఇతర మతాలకు చెందిన మేధావులు, లౌకిక మేధావులు, పాశ్చాత్య విద్యా పండితులు ఆయన సిద్ధాంతం పట్ల ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం.


వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

దయ



"ఎవరు ఎలా వుండాలో, ఏం చేయాలో చెప్పేవాణ్ణి కాదు. అలాగే ఈ ఏడాది ఎలావుంటుందో, భవిష్యత్తు ఎలావుండబోతున్నదో నేను జోస్యం కూడా చెప్పలేను. పైగా, నా వరకూ నాకు బోలెడు బలహీనతలున్నాయి. కనుకనే మనందరినీ భవిష్యత్తు దయతల్చాలని కోరుకుంటున్నా. మనం ఇన్నాళ్లుగా ఎలావుంటున్నామో అలాగే ఉందాం. మనం మనలావున్నా ఆ అల్లా మనందరినీ దయ తలచాలని ప్రార్థిస్తున్నాను. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు"

– షారూక్ ఖాన్, సినీ నటుడు

అందరిదీ



"మనం కొత్త సంవత్సరం సంబరాలు చేసుకుంటున్నప్పుడు ఈ దేశంలో వేలాది మంది పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తున్న నిరసనకారులు జైలులో ఉన్నారనీ, కశ్మీర్‌లోని సాటి పౌరులు ఐదు నెలలుగా నిర్బంధంలో ఉన్నారని మర్చిపోకూడదు. భారతదేశం అందరిదీ, మనల్ని ఎవరూ విడదీయనీయొద్దు"

– షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

ఆల్కహాల్



"కొత్త సంవత్సర వేడుకల్లో తాగక తప్పదా? అపరిమితమైన మద్యం అందిస్తామంటూ పబ్‌లు, రెస్టారెంట్ల నుంచి నాకు ఎన్నో ఆఫర్లు వస్తున్నాయి. బాధ్యతగల పెద్దలు కావాలనుకుంటే తాగడంలో తప్పేమీ లేదు. కానీ, అదేదో తప్పనిసరిగా చేయాల్సిన పనిగా ప్రచారం చేయడం ఎందుకు?"

– షెఫాలీ వైద్య, రచయిత్రి

రెండు



"బెనారస్ హిందూ యూనివర్సిటీలో హిందువులకు ఎటువంటి రిజర్వేషన్లు లేవు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ పేరులో ముస్లిం పేరుండటమే కాదు, వారికి 50 శాతం రిజర్వేషన్ కూడా ఉంది. ఇప్పుడు చెప్పండి.. హిందువులమైన మనం మత తత్వవాదులం, వాళ్లేమో లౌకికవాదులు ఎట్లా అవుతారు?"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్


బాగుండాలి



"నూతన ఆంగ్ల సంవత్సరమంటే చిన్న వయసులో తుళ్లింతలు, కేరింతలు, ఆటపాటలు మధ్యవయసులో బాధ్యతలు, కన్యాదానాలు, వరదానాల జ్ఞాపకాలు వృద్ధాప్యంలో దశాబ్దాల తీపి గుర్తులు, చేదు మాత్రలు, ఈ కొత్త సంవత్సరం మనవాళ్లంతా బాగుండాలి అన్న అభిలాషలు. ఆత్మీయులారా, సహచరులారా మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు"

– పరుచూరి గోపాలకృష్ణ, సినీ రచయిత

శాంతి




"పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకీ, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకీ, భర్తను కోల్పోయిన భార్యకీ, భార్యను కోల్పోయిన భర్తకీ, ఒంటరి ఆత్మలకీ, అణచివేతకు గురవుతున్న, అణగారిన వారికీ అల్లా ఈ కొత్త సంవత్సరంలో శాంతినివ్వాలని కోరుకుంటున్నా"

– ఇరేనా అక్బర్, కళాకారిణి

కట్టుకథలపై కొరడా.. శ్రీలంక 'సుప్రీం' తీర్పు

శ్రీలంకలో 2010లో పోలీసు కస్టడీలో ఉన్న ఒక వ్యక్తిని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ ముద్ర వేసిన ఘటనపై ఆ దేశ సుప్రీంకోర్టు స్ఫూర్తిదాయకమైన తీర్పును తాజాగా ప్రకటించింది. కరడుగట్టిన నేరస్తుడికి బేడీలు వేయకుండా తక్కువ భద్రతతో బయటకు పోలీసులు తీసుకెళ్లడంలోనే ఎన్‌కౌంటర్ కట్టుకథకు మూలం ఉందని తేల్చి చెప్పిన శ్రీలంక సుప్రీంకోర్టు నేరస్తులకు ఉన్న జీవించే హక్కును శాసనం ద్వారా తప్ప హరించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసింది. 'మనుషులందరిలోనూ రక్తమే ఉన్నట్టు, పోలీసులందరూ చెప్పే కథల్లోనూ ఒకే రకమైన సృజనాత్మకత ఉంటుంది. మనుషులందరూ ఒక్కటే. పోలీసులందరూ ఒక్కటే' అంటూ ఓ తెలుగు కథలోని ఒక పాత్ర అంటుంది. కానీ, పోలీసులందరిలో ప్రవహించేది ఒకే రక్తమే కానీ, కథనాలు వేరన్న రోజు ఎప్పుడు వస్తుందో ఎదురుచూడాలి.

విశ్లేషణ



మంగారి రాజేందర్

ఎదురుకాల్పులన్నీ, బూటకపు ఎన్‌కౌంటర్లనేవి మన దేశానికే పరిమితం కాదు. ఇది చాలా దేశాల్లో ఉంది. నేరస్తులను, తీవ్రవాదులను, అదే విధంగా కరడుగట్టిన నేరస్తులను ఎన్‌కౌంటర్ల పేరుమీద ఏరి వేయడం ప్రపంచవ్యాప్తంగా ఉంది. ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఓ వ్యక్తి కుటుంబానికి శ్రీలంక సుప్రీంకోర్టు పది లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని చెల్లించాలని శ్రీలంక ప్రభుత్వాన్ని ఆదేశించింది.

తెలుగులో ఓ కథ ఉంది. ఆ కథలోని ఓ పాత్ర ఇలా అంటుంది. 'అందరి మనుషుల్లోనూ రక్తమేనన్నట్టు, పోలీసులందరూ చెప్పే కథల్లోనూ ఒకే రకమైన సృజనాత్మకత ఉంటుంది. మనుషులందరూ ఒక్కటే. పోలీసులందరూ ఒక్కటే'. శ్రీలంక సుప్రీంకోర్టు గత నెలలో చెప్పిన తీర్పుని గమనించినప్పుడు ఈ వాక్యాలు గుర్తుకొచ్చాయి. ఎందుకంటే ఆ కేసులో కూడా పోలీసుల కథనం మన పోలీసుల మాదిరిగానే ఉంది.

రాణా మునేజ్ అజిత్ ప్రసన్న అనే వ్యక్తి పోలీసు కస్టడీలో సెప్టెంబర్, 2010వ సంవత్సరంలో చనిపోయాడు. పోలీసులు కాల్చి చంపారని ఆరోపిస్తూ అతని భార్య సుప్రీంకోర్టులో దరఖాస్తుని అదే సంవత్సరంలో దాఖలు చేసింది.

పోలీసుల కథనం ప్రకారం అతను అండర్ వరల్డ్ నేరస్తుడని, ఓ హత్య కేసులో అతన్ని అరెస్టు చేశామని పోలీసులు కోర్టుకి చెప్పారు. దగ్గర్లో ఉన్న పొదలో తన ఆయుధాన్ని దాచానని అతను చెబితే, అక్కడికి అతన్ని తీసుకొని వెళ్తున్న క్రమంలో పోలీసుల దగ్గరినుంచి రైఫిల్ లాక్కోవడానికి ప్రయత్నం చేశాడనీ, ఆ ఘర్షణలో రైఫిల్ పేలి అతను మరణించాడనీ పోలీసులు కోర్టుకి విన్నవించారు.

అయితే కోర్టు ఈ పోలీసుల కథనాన్ని విశ్వసించలేదు. కరడుగట్టిన ముద్దాయికి బేడీలు వేయకుండా, సరైన పోలీసు బలగాలు లేకుండా అతన్ని ఆ రాత్రి ఎందుకు తీసుకొని వెళ్లారని కోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచింది.

కోర్టు తన తీర్పులో ఇలా పేర్కొంది. 'కోర్టుకి సమర్పించిన ఆధారాల ప్రకారం అతను కరడుగట్టిన నేరస్తుడు. కిరాయి హంతకుడు. అండర్‌వరల్డ్‌కి చెందిన వ్యక్తి. అతను చాలా అపాయకరమైన వ్యక్తి అని పోలీసులు భావించి అతన్ని ప్రత్యేక రక్షణలో ఉంచారు. 17, 18 తేదీలలో అతన్ని అత్యంత భద్రత మధ్య స్టేషన్‌కి తరలించారు. ఈ పరిస్థితులు ఉన్నప్పుడు 18 రాత్రి అతనికి సంకెళ్లు వేయకుండా ముగ్గురు పోలీసులు, డ్రైవర్‌తో సరైన నిర్వహణలేని వాహనంలో తీసుకొని వెళ్లడానికి ఎలాంటి సంతృప్తికరమైన సమాధానాన్ని పోలీసులు కోర్టుకి వివరించలేకపోయారు.

పోలీసుల ప్రకారం– అతను చాలా తీవ్రమైన నేరాల్లో



ప్రధాన పాత్ర ఉన్న వ్యక్తి. అది నిజమైతే పోలీసులు మరింత జాగ్రత్తగా ఉండాల్సింది. తుపాకులని ఉపయోగించడం బాగా తెలిసిన వ్యక్తి. అలాంటి వ్యక్తికి సంకెళ్లు వేయకుండా లోడెడ్ తుపాకులతో ఎందుకు తీసుకుని వెళ్లారనే విషయానికి పోలీసుల దగ్గర సరైన సమాధానం లేదు. అందుకని ప్రతివాదుల (పోలీసుల) వాదనని ఆమోదించలేమని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

పోస్టుమార్టం నివేదికలో అతను చనిపోవడానికన్నా ముందే అయిన గాయాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. అవి అన్నీ మొరటుగా, బలంగా తగిలినట్టు ఉన్నాయని కోర్టు భావించింది. శ్రీలంక రాజ్యాంగంలోని అధికరణ 13(4) ప్రకారం– కోర్టు ఉత్తర్వులు లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించడానికి, చంపడానికి వీల్లేదు. శిక్ష పడిన ముద్దాయి జీవితాన్ని కూడా ఏకపక్షంగా అంతం చేయడానికి వీల్లేదు. శాసనం ప్రకారం మాత్రమే అతని జీవితాన్ని అంతం చేయాల్సి ఉంటుంది.

శ్రీలంక రాజ్యాంగం వ్యక్తులకి జీవించే హక్కుని ప్రత్యేకంగా పేర్కొనలేదు. కానీ అంతర్జాతీయ ఒప్పందాలపై శ్రీలంక సంతకం చేసింది. అందుకని వ్యక్తులకి జీవించే హక్కు ఉన్నట్టుగా భావించాల్సి ఉంటుందని శ్రీలంక సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

ఈ కారణాలని పేర్కొంటూ శ్రీలంక సుప్రీంకోర్టు మృతుని భార్య దాఖలు చేసిన దరఖాస్తుని ఆమోదించి శ్రీలంక ప్రభుత్వం పది లక్షల రూపాయలని అతని భార్యకు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. దేశంలోని ప్రతి పౌరుడిని రక్షించాల్సిన బాధ్యత 'రాజ్యం'పై ఉందనీ, ఆ బాధ్యతలో రాజ్యం విఫలం అయిందని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

ఇక్కడితో సుప్రీంకోర్టు ఊరుకోలేదు. మృతుని ప్రాథమిక హక్కులకి భంగం కలిగించిన నలుగురు పోలీసు అధికారులు ఒక్కొక్కరు సొంతంగా రూ.2,50,000లు చెల్లించాలని, తమ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించని మరో ముగ్గురు పైఅధికారులు ఒక్కొక్కరు సొంతంగా రూ. 25,000లు చెల్లించాలని కూడా శ్రీలంక సుప్రీంకోర్టు ఆదేశించింది. ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ ఈ తీర్పుని 17, డిసెంబర్ 2019న వెలువరించింది.

రోజురోజుకీ ఎన్‌కౌంటర్లు పెరిగిపోతున్న మన దేశంలో కూడా ఒకటీ అరా ఇలాంటి తీర్పులు వస్తున్నప్పటికీ ఎలాంటి గుణాత్మకమైన మార్పు కనిపించడం లేదు. ఏమైనా తీర్పుని మన నేర న్యాయ వ్యవస్థతో సంబంధం ఉన్న వ్యక్తులు చదవాల్సిందే. పోలీసులందరిలో ప్రవహించేది ఒకే రక్తమే కానీ, కథనాలు వేరన్న రోజు ఎప్పుడు వస్తుందో ఎదురుచూడాలి.

వ్యాసకర్త గతంలో జిల్లా, సెషన్స్ జడ్జిగా పనిచేశారు
మొబైల్ : 94404 83001

స్ఫూర్తి

సృష్టిలోని జీవులన్నీ స్వయం ప్రేరితాలు, ప్రేరకాలూ. వేగం అందుకోలేక ఆహారం కోల్పోయిన సింహం, పరుగుల్లో జింకను ఆదర్శంగా తీసుకోవడం, ప్రాణం నిలుపుకునేందుకు సింహం కన్నా వేగమైన పరుగును జింక అభ్యసించడమూ అలాంటివే. ప్రయత్నంలో అలసినప్పుడో, ఓటమి అంచుల్లో నిలబడి విచారపు మేఘాలు అలముకున్నప్పుడో స్ఫూర్తి ప్రదాతల స్ఫురణతో ఆగిన కార్యాలను విజయతీరాలకు చేర్చిన వారున్నారు. పరాయి పాలనలో నిరాశా నిస్పృహలు కమ్ముకున్న జాతిని 'మా కొద్దీ తెల్ల దొరతనమన్న' ధిక్కారస్వరంతో ఆంగ్లేయుల గుండెల్లో భీతిని రేకెత్తించి, స్వాతంత్ర్యవీరులలో స్ఫూర్తి రగిలించి జాతి గుండెల్లో నిలిచాడు గరిమెళ్ళ. ఓటమిపాలైన హరిహర బుక్కరాయలు 'అడవుల్లో వేటకుక్కను తరుముతున్న కుందేలు స్ఫూర్తితో' ఉత్సాహం తెచ్చుకున్నట్టు చరిత్ర చెప్పింది.



జ్యోతిర్మయం

రామకృష్ణ పరమ హంస దర్శన మాత్రాన నాస్తికుడైన నరేంద్రుడు వివేకానందుడైనట్టు, హరిశ్చంద్రుడు, శ్రావణ కుమారుల కథల స్ఫూర్తితో గాంధీ మహాత్ముడుగా ఎదిగినట్టు చరిత్ర లిఖించింది. చక్రవర్తిగా పుట్టిన గౌతముడు బుద్ధుడిగా మారడం, నిరుపేద కుటుంబంలో జన్మించిన క్రీస్తు ప్రవక్తగా ఎదగడం, బాల్యంలో ఉప్పు అమ్మిన నానక్ సిక్కుమత స్థాపకుడు కావడం, పోతన జీవిత గాథ ప్రభావంతో కొత్తలంక పశువుల కాపరి సుబ్బారావు ముమ్మిడి వరం బాలయోగిగా అవతారమెత్తడాన్ని గ్రంథాలు వివరించాయి. కురుక్షేత్రంలో ఆప్తులను చూసి అస్త్రసన్యాసం చేసిన అర్జునుడు భగవద్గీత ప్రభావితుడైనట్టు భారతం వివరించగా, రావణుడితో యుద్ధంలో చింతా క్రాంతుడయిన శ్రీరాముడు ఆదిత్య హృదయం స్ఫూర్తితో కార్యోన్ముఖుడైనట్టు రామాయణం వివరించింది.

ఛత్రపతి శివాజీ, రాణాప్రతాప్, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి మహనీయుల చరిత్రలను, మదర్ థెరీసా వంటి మానవతా మూర్తుల గాథలను బాల్యం నుండి పిల్లలకు చేరువ చేస్తే, ప్రభావితులై ఆదర్శ పౌరులుగా, దేశభక్తులుగా ఎదిగి మాతృభూమి కేతనాన్ని రెపరెపలాడిస్తారు. బాలలను బంగారు మార్గంలో నడపాల్సిన బాధ్యత మనందరిది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు





తనయులు ఆమెర్ (ఎడమ), ఆయాన్‌లతో వందన.



వందన వాళ్లబ్బాయి

డిసెంబర్ దాటిందంటే.. పదో తరగతి పిల్లలకు, వాళ్ల పెద్దవాళ్లకూ ఫైనల్ ఎగ్జామ్స్ మూడ్ (ఫోబియా అనాలేమో!) వచ్చేస్తుంటుంది. 'కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలంలో పడవద్దు. పిల్లలను ఒత్తిడికి గురి చేయవద్దు. తెలివితేటలు ర్యాంకుల్లో ఉండవు. పిల్లల్లో మేధాశక్తిని వికసించనివ్వండి. వాళ్లకు ఇష్టమైన కోర్సుల్లో చేరనివ్వండి. పదో తరగతి ఆ తరగతికే కానీ పరీక్ష జీవితానికి కాదు' అని నెటిజన్‌లు ఒక పాత పోస్ట్‌ను తెరమీదకు తెచ్చారు. అదిప్పుడు మళ్లీ వైరల్ అవుతోంది! దాని గురించి తెలుసుకోవలసిందే.

చదువు వ్యాపారమైపోయి దాదాపుగా మూడు దశాబ్దాలవుతోంది. మన పిల్లలు ఏం చదవాల న్నది కార్పొరేట్ స్కూళ్లు నిర్ణయించేస్తున్నాయి. పిల్లల మార్కులు తొంభైకి తగ్గితే పేరెంట్స్‌ని పిలిచి క్లాస్‌లు పీకుతున్నాయి. టెన్త్ క్లాస్, ట్వల్త్ క్లాస్ రిజల్ట్స్ వస్తున్నాయంటే పిల్లల వెన్నులో వణుకు మొదలవుతుంటుంది. తల్లిదండ్రుల్లో ఆందోళన. ఇక రిజల్ట్స్‌కి ముందు ఇంట్లో ఆందో ళనతో కూడిన మౌనం రాజ్యమేలుతుంటుంది. మార్కులు తగ్గితే అమ్మానాన్నలు తన మీద పెట్టుకున్న ఆశలకు విఘాతం కలుగుతుందే మోనని పిల్లలు నలిగిపోతుంటారు. మార్కులు తగ్గితే మంచి కాలేజ్‌లో సీట్ రాదేమో, పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో అని అమ్మా నాన్నల గుండెలు పల్పిటేషన్‌కు గురవుతుంటా యి. ఇలాంటి రోజుల్లో... ఢిల్లీకి చెందిన వందన 'స్ట్రెస్ బస్టర్' విప్లవాన్ని తెచ్చారు. తల్లిదండ్రు లందరూ వందనలాగానే ఆలోచిస్తే పిల్లల్లో చదువు ఒత్తిడి కానే కాదు. రాబోతున్న పరీక్షల సీజన్‌లో కూడా ఆడుతూ పాడుతూ హాయిగా చదువుకుంటారు.



గ్రేడ్‌లు.. తెలివితేటలను కొలవలేవు. మార్కులు, ర్యాంకులు.. అంటూ పిల్లలను ఊదరగొడుతున్న నేటి పోటీ ప్రపంచంలో ఒక అమ్మగా ఇది నేను నమ్మిన సత్యం.
– వందన సూఫియా కటోచ్

వందన ఏం చేసిందంటే

గత ఏడాది (2018–19 విద్యా సంవత్స రం) వందన కొడుకు ఆమెర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పదోతరగతి పరీక్షలు రాశాడు. మే నెలలో రిజల్ట్స్ వచ్చాయి. వందనకు తన కొడుకు తొంభైలతో పాస్ కాడని తెలుసు. మొత్తానికైతే పాస్ అయి తీరుతాడనీ తెలుసు. తన కొడుకు తెలివితక్కువ వాడేమీ కాదు. ఎన్ని తెలివితేటలుంటే మాత్రం 'చేప చెట్టెక్కుతుం దా' అనేది ఆమె ఫిలాసఫీ. 'తనకు ఇష్టం లేని సబ్జెక్టులన్నీ చదవమంటే ఎన్నింటినని బలవం తంగా బుర్రలో దాచుకుంటాడు' అని కూడా కొడుకు తరఫున వాదిస్తుంది.

టెన్త్ పరీక్షలకు మూడు నెలల ముందు నుంచే ఆమె కొడుకు మీద ప్రత్యేక దృష్టి పెట్టిం ది. ఫెయిల్ కాకుండా ఉండడానికి మాత్రమే కొడుకు ప్రిపరేషన్ మీద దృష్టి పెట్టిందామె. ఆ పిల్లాడు తన శక్తి కొద్దీ కష్టపడ్డాడు కూడా. అరవై శాతం మార్కులతో పాసయ్యాడు. కొడుకు ముఖం చిన్నబుచ్చుకోకూడదని రిజల్ట్స్ రోజు, రిజల్ట్స్ ప్రకటించే సమయానికి వందన కూడా స్కూల్‌కెళ్లారు. అప్పటికే తొంభైశాతం స్టూడెంట్స్ అంతా ఒకరినొకరు అభినందించు కుంటూ కనిపించారు. తల్లిని చూడగానే వందన వాళ్లబ్బాయి దీనంగా ముఖం పెట్టి ''సిక్స్‌టీ పర్సెంట్ అమ్మా'' అన్నాడు. వందన అమాంతం కొడుకుని దగ్గరకు తీసుకుని ''యూ మేడ్ మమ్మా ప్రౌడ్'' అని ముద్దు పెట్టుకున్నారు! అదే విషయాన్ని ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ''మా అబ్బాయి సిక్స్‌టీ పర్సెంట్‌తో టెన్త్‌క్లాస్ పాసయ్యాడు. నాకు చాలా గర్వంగా ఉంది. మీరేమీ పొరబడడం లేదు. 90 పర్సెంట్ అని రాయబోయి ఆ అంకె పొరపాటున 60గా కంపోజ్ కాలేదు. నిజంగా 60 శాతమే. ఇష్టం లేని సబ్జెక్టు కోసం కష్టపడమని పిల్లలను వేధించడం కూడా తప్పే. మన విద్యావిధానంలో పదోతరగతి వరకు ఇష్టం ఉన్నా లేకపోయినా అన్ని సబ్జెక్టులనూ చదవాల్సిందే. టెన్త్ గట్టెక్కడం కోసం మాత్రమే మా అబ్బాయికి ఇష్టంలేని సబ్జెక్టులను కూడా దగ్గరుండి చదివించాను. ఇప్పుడా గండం గట్టెక్కేశాడు. ఇక మా వాడు ఫ్రీ. తనకు ఇష్టమైన సబ్జెక్టుల్లోనే ప్లస్ వన్ చదువుకుంటాడు'' అని ఆమె పెట్టిన పోస్ట్‌ని దాదాపుగా తొమ్మిది వేల మంది లైక్ చేశారు. పన్నెండు వేల మంది సానుకూలమైన కామెంట్ చేశారు. మరో ఐదు వేల మందికి పైగా ఆ పోస్ట్‌ను షేర్ చేశారు. అరవై శాతం మార్కులను తక్కువగా చూసే వాళ్లకు ఇదో పాఠం అనే కామెంట్‌లు కూడా వచ్చాయి.

– మంజీర



కొత్త సంవత్సరం వచ్చేది
పాతవి వదిలిపెట్టడానికి.
12 నెలల-
52 వారాల-
365 రోజుల గత జీవితాన్ని
అందులోని అప్రియమైన సంగతులను
వదిలి ముందుకు సాగడానికి.
కొత్త సంవత్సరంలో అంతా
మంచి జరగాలని కోరుకోవడం అంటే
ఉన్న బంధాన్ని కొత్తగా
నిర్వచించుకోవడమే.
గొడవలున్న తేదీలను మార్క్ చేసిన
పాత కేలండర్‌ని పారేద్దాం.
సంతోషాలను ప్లాన్ చేసుకున్న
కొత్త కేలండర్‌ను స్వాగతిద్దాం.
హ్యాపీ న్యూ ఇయర్.

ప్రతీకాత్మక చిత్రం

కొత్త జీవితానికి శుభాకాంక్షలు

జనవరి 1 మరో రెండు వారాలు ఉందనగా ఆమె ఫోన్ చేయడం మొదలుపెట్టింది.

'చూడండి. ఏదైనా ఉంటే మీరు క్లినిక్‌కు వచ్చి మాట్లాడండి. ఫోన్‌లో మీ కేసును అసెస్ చేయడం కుదరదు' అన్నాడు సైకియాట్రిస్ట్.

'కాదు డాక్టర్. నాకు మీ దగ్గరకు రావాలంటే భయం. సైకియాట్రి క్లినిక్‌లకు వచ్చేంతగా నేనింకా ప్రిపేర్ కాలేదు. మిమ్మల్ని కలవాలి అనుకున్న వెంటనే నా మనసు నీకేమైనా పిచ్చా.. సైకియాట్రిస్ట్‌లను పిచ్చివాళ్లే కలుస్తారు అనడం మొదలెట్టింది'

సైకియాట్రిస్ట్‌కు నవ్వు వచ్చింది.

'మీరు సినిమాలు ఎక్కువ చూస్తారు లాగుంది' అన్నాడు.

'అవును. మీకెలా తెలుసు'

'సినిమాల్లో పిచ్చివాళ్లను రకరకాలుగా చూపిస్తుంటారు. పిచ్చి అంటే చెట్టెక్కి కూచుని వింత చేష్టలు చేయడం మాత్రమే అని వారి అవగాహన. చూడండి... జలుబు అనారోగ్యమే. కేన్సర్ అనారోగ్యమే. రెండూ శరీరానికి వస్తాయి. మనసు విషయంలో కూడా జలుబు స్థాయి ఉంటుంది... కేన్సర్ అంత తీవ్రస్థాయి ఉంటుంది. జలుబుకు టేబ్లెట్ వేసుకునే మనం మనసులో చిన్న గుబులు వచ్చినప్పుడో, వ్యాకులత పెరిగినప్పుడో, నిర్ణయాల్లో నిలకడ లేనప్పుడో, మనసుకు తగిలిన గాయాలు ఎంతకీ మానలేక పోయినప్పుడో ఎందుకు మందులు వాడము? ఎందుకు సైకియాట్రిస్ట్ సలహా తీసుకోము? చెప్పండి'

అటువైపు నిశ్శబ్దం ఆవహించింది.

ఆ మరుసటి రోజే ఆమె క్లినిక్‌కు వచ్చింది.

•••

'నా భర్తకు జనవరి 1న గుడ్‌బై చెప్దామనుకుంటున్నాను డాక్టర్' అందామె.

ముప్పై ఐదేళ్లుంటాయి. చామనఛాయలో కొద్దిపాటి బొద్దుగా ఉంది. ఇద్దరు పిల్లలట. అమ్మాయిలు.

'ఏమిటి.. ఆ డేట్ ప్రత్యేకత?'

'ఏం లేదు.. కొత్త సంవత్సరం కదా. లైఫ్‌ను కొత్తగా స్టార్ట్ చేద్దామని'

'అంటే ఇంకో రెండువారాల్లో'

'రెండు వారాల్లోనే'

'ఆలోచిద్దాం. ముందు మీ సమస్య ఏమిటో చెప్పండి' అన్నాడు సైకియాట్రిస్ట్ సర్దుకుని కూచుంటూ.

•••

ఆమె పేరు రాధ. ఊరు కొత్తగూడెం. డెంటిస్ట్రీ చేసింది. పెళ్లయ్యాక హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యింది. అతని పేరు మహేంద్ర. సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. నల్గొండ సొంత ఊరు. పెద్దలు కుదిర్చిన ఈ పెళ్లిలో మహేంద్ర చదువు, ఉద్యోగం మొదటి నుంచి పై చేయి అయ్యాయి. అతను, అత్తామామలు రాధ చదువు గురించి గొప్ప భావనలో లేరు. డెంటిస్ట్రీ చేసినవాళ్లు చాలామంది ఉంటారని, డాక్టరు కాలేనివారు పంటి డాక్టర్లు అవుతారని, ఆ ప్రొఫెషన్‌లో పెద్ద ఎదుగుదల ఉండదని వారు అందరూ కల్పించిన అభిప్రాయంలో ఉన్నారు. రాధకు డెంటిస్ట్‌గా రాణించాలన్న కోరిక మొదట్లోనే దెబ్బతిన్నట్టయ్యింది. అప్పటికే తను కొత్తగూడెంలో రెండేళ్లు జూనియర్ డెంటిస్ట్‌గా ఒక క్లినిక్‌లో పని చేసింది. కాని ఆమె పని తీరు సీనియర్ కంటే బాగుండేదని పేషెంట్లు అనేవారు. ఆమె ప్రాక్టీసు విషయం తేలకముందే–

'నేను చేసుకోవడమే ఆలస్యంగా చేసుకున్నాను. పిల్లలను పోస్ట్‌పోన్ చేయొద్దు' అన్నాడు మహేంద్ర.

ఇద్దరు పిల్లలు వెంటవెంటనే పుట్టారు. వారి బాగోగుల్లో ఏడెనిమిదేళ్లు గడిచిపోయాయి. రాధకు అంతా బాగున్నట్టే అనిపిస్తోంది కానీ ఏమిటో అసౌకర్యం. మహేంద్ర చెడ్డవాడు కాదు. అతనికి పని పిచ్చి. సాఫ్ట్‌వేర్ రంగంలో సీనియర్ లెవల్‌లో ఉండటం వల్ల టీమ్‌ను మేనేజ్ చేయడం ఒక సమస్యగా, తన పైవారిని హ్యాండిల్ చేయడం మరో సమస్యగా సతమతం అయ్యేవాడు. ఉదయం ఎనిమిదిన్నరకు క్యాబ్ ఎక్కితే రాత్రి పదికి వచ్చేవాడు. వచ్చినా మళ్లీ ల్యాప్‌టాప్‌ను ముందు పెట్టుకునేవాడు. అత్తామామలు నల్గొండలోనే ఉండిపోవడం వల్ల ఈ మొత్తం వ్యవహారంలో రాధకు తోడు మిగిలింది పనిమనిషే. ఆ పనిమనిషి కూడా సరిగ్గా వచ్చేది కాదు. ఒక ఇల్లు కాకపోతే మరో ఇల్లు సులభంగా దొరుకుతుందని లెక్కలేనితనం. పిల్లలకు నలతగా ఉన్నా, చటుక్కున హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలన్నా, వాళ్లను సముదాయించాలన్నా రాధకు చాలా కష్టమయ్యేది. వారికి వండటం, తనకు వండుకోవడం, భర్తకు వండిపెట్టడం... ఇవన్నీ చిన్నగా కనిపించే పెద్ద పనులు.

'నాకు కష్టంగా ఉంది' అని మహేంద్రతో అంటే 'ఓపిక పట్టు' అని అంటాడు.

'నా కెరీర్ కూడా వదులుకున్నాను. ఇంట్లో ఉండి మాత్రం ఏమి బావుకున్నాను' అని ఆమెకు అనిపించసాగింది. ఫలితంగా తీవ్రమైన డిప్రెషన్. చిరాకు. మూడీనెస్. కళ్లకింద వలయాలు. పిల్లలను గదమాయించడం. అసలేమిటో అర్థం కానంత హైరానా. చీటికిమాటికి ఏడుపు ముంచుకురావడం.

పోయిన జనవరి 1న 'నెక్స్ట్ జనవరి1 నాటికి నువ్వు మన లైఫ్‌ను సెట్ చేయాలి' అని భర్తతో అంది.

అతను 'అలాగే' అనగలిగాడు కానీ అలా చేయలేకపోయాడు.

మళ్లీ జనవరి 1 వచ్చింది. అతనితో అలాగే ఉండిపోతే ఇంకో జనవరి వచ్చాక కూడా పరిస్థితి అలాగే ఉంటుందని ఆమెకు అనిపించింది.

'అందుకని వదిలేద్దామనుకుంటున్నాను డాక్టర్. పేషెంట్ల పళ్లు రిపేర్ చేస్తూ నా బతుకు నేను బాగు చేసుకుంటాను' అందామె.

సైకియాట్రిస్ట్ పొడుగ్గా ఊపిరి వదిలాడు.

•••

జనవరి 1 రావడానికి ఉన్న రెండు వారాల్లో మహేంద్రను మూడుసార్లు పిలిపించాడు సైకియాట్రిస్ట్.

భార్యతో టైమ్ స్పెండ్ చేయలేని సక్సెస్ అది ఎంత పెద్దదైనా కాని సక్సెస్ కాదు. ఎప్పుడో వస్తాయనుకునే కంఫర్ట్స్ కోసం ఇప్పటి లైఫ్‌లోని కంఫర్ట్‌ను పాడుచేసుకుంటున్నారు. లైఫ్ పార్టనర్‌ను టేకెన్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసుకుంటే కలిగే నష్టం చాలా ఎక్కువ.

'భార్యతో టైమ్ స్పెండ్ చేయలేని సక్సెస్ అది ఎంత పెద్దదైనా కాని సక్సెస్ కాదు. కుటుంబం కోసం కష్టపడుతున్నాననుకుంటున్నారు మీరు. కాని కుటుంబాన్ని కోల్పోయేంతగా పడే కష్టంలో అర్థం లేదు. మీ పని తగ్గించుకోవాలి. మీ వైఫ్‌కు ఆమె పని ఆమెను చేయనివ్వాలి. ఎప్పుడో వస్తాయనుకునే కంఫర్ట్స్ కోసం ఇప్పటి లైఫ్‌లోని కంఫర్ట్‌ను పాడు చేసుకుంటున్నారు. లైఫ్ పార్టనర్‌ను టేకెన్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసుకుంటే కలిగే నష్టం చాలా ఎక్కువ' అని రాధ తీసుకోవాలనుకుంటున్న నిర్ణయం చెప్పాడు అతనితో.

మహేంద్ర మొదట షాక్ తిన్నా మెల్లగా సర్దుకున్నాడు.

అతను తీసుకున్న కొత్త సంవత్సర నిర్ణయాల్లో ప్రధానమైనది భార్యను గౌరవించే ఇల్లుగా తన ఇంటిని మార్చుకోవడం.

అది అతను రాధకు చెప్పాడు. అందుకు సైకియాట్రిస్ట్ కూడా బలం చేకూర్చాడు.

రాధ డిసెంబర్ 31 రాత్రిని తన అపార్ట్‌మెంట్‌లో అందరితో కలిసి భర్తా పిల్లల తోడుగా జరుపుకుంది.

కొత్త సంవత్సరం ఆమెకు నిజంగానే కొత్తది.

హ్యాపీ న్యూ ఇయర్.

కథనం: సాక్షి ఫ్యామిలి

రెండు విషయాలు

రాణి గారి వర్క్ రిపోర్ట్

రాజైనా పేదైనా పని చెయ్యాలి. పని చేస్తేనే గౌరవం. రాజు పెద్ద కావచ్చు. పేద చిన్న కావచ్చు. పనిలో మాత్రం చిన్నా పెద్ద తేడాలు ఉండవు. బ్రిటన్‌లో ప్రతి ఏడాది చివరా.. రాజ కుటుంబం ఆ ఏడాది ఎన్ని రోజులు పని చేసిందనే దానిపై లెక్కలు విడుదలౌతాయి! ఆ లెక్కల ప్రకారం.. 2019లో ఆ కుటుంబం మొత్తం పని చేసిన రోజులు సగటున 84.5. ఎలిజబెత్ రాణి గారు పని చేసిన రోజులు 67 కాగా, రాణి గారి కుమార్తె ప్రిన్సెస్ యాన్ పని చేసిన రోజులు 167. ఆ కుటుంబంలో ఎక్కువ రోజులు పని చేసింది ఈవిడే. రాణి గారి కుమారుడు ప్రిన్స్ చార్లెస్ పని చేసిన రోజులు 125. ఇంతకీ తక్కువ పని చేశారా, ఎక్కువ పని చేశారా? తక్కువ ఎక్కువల్ని పక్కన పెడితే.. బ్రిటన్‌లో గత ఏడాది పని దినాల సంఖ్య 253. ఇంతకీ రాచకుటుంబానికి ఏం పని ఉంటుంది అనేనా మీ సందేహం. అధికారిక పత్రాలపై సంతకం పెట్టడం కూడా పనే కదా!



ఎలిజబెత్ రాణి

బార్బీలకు న్యూ లుక్

కొత్త సంవత్సరంలో కొత్త కొత్త ప్రొఫెషన్‌లలో బార్బీ డాల్స్ కనిపించబోతున్నాయి! మెరైన్ బయాలజిస్ట్, ఆస్ట్రోఫిజిసిస్ట్, ఫొటోజర్నలిస్ట్, కన్సర్వేషనిస్ట్, ఎంటోమాలజిస్ట్ బార్బీలను డిజైన్ చేయడం కోసం ఆ బొమ్మల తయారీ సంస్థ.. నిజ జీవితంలోని సంబంధిత వృత్తి నిపుణుల సలహాలను తీసుకుంటున్నాయి. చూడగానే ఫలానా ప్రొఫెషన్ అని పిల్లలు గుర్తుపట్టే విధంగా ఈ బార్బీలు ఉంటాయి. భారతీయ సంతతికి చెందిన ఫారెస్ట్ ఎకాలజిస్ట్ నళినీ నాదకర్ణి.. 'సైంటిస్ట్ ఎక్స్‌ప్లోరర్' (అన్వేషించే శాస్త్రవేత్త) బార్బీని డిజైన్ చేసేందుకు ఆ సంస్థకు తోడ్పడుతున్నారు. ఆరేళ్ల తన కుమార్తె తనకు సైంటిస్ట్ బార్బీ కావాలని కోరినప్పుడు సైటిస్ట్ అని గుర్తుపట్టేందుకు అవసరమైన డిజైనింగ్ గురించి అప్పటినుంచే ఆమె ఆలోచిస్తూ ఉండగా ఇప్పుడీ అవకాశం వచ్చింది. అమ్మే స్వయంగా డిజైన్ చేసిన బార్బీ కొద్ది రోజుల్లోనే కూతురి చేతుల్లోకి రాబోతోందన్న మాట.





నళినీ నాదకర్ణి

● ముగ్గు-ముచ్చట





కె.విజయలక్ష్మి
జి.కొత్తపల్లి
అనంతపురం జిల్లా

25 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు





కె.లావణ్యగౌడ్
తుక్కుగూడ,
రంగారెడ్డి జిల్లా


27 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు



ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. muggulu.sakshi@gmail.com

తిరుప్పావై 18వ పాశురం

ఉన్దు మదకళిత్త! నోడాద తోళ్వలియన్
నన్ద గోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిరవాయ్
వన్దెఙ్గుమ్ కోళి అళైత్తనకాణ్ మాదవి
ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలి నఙ్గల్ కూవినగాణ్
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్పాడ
చెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొలిప్ప
వన్దు తిరువాయ్ మగిళిందేలో రెమ్బావాయ్.



చిత్రం: కేశవ్ వెంకటరాఘవన్

ఆండాళ్ నప్పిన్నాయ్ అంటే కృష్ణుని దేవేరిని భక్తిపురస్సరంగా మేల్కొల్పుతుంది. నప్పిన్నాయ్ కృష్ణుని మేనమామ కుమార్తె. పోటెక్కిన కోడెలను అదుపు చేసి పందెంలో గెలిచి ఆమెను పరిణయమాడినాడు కృష్ణుడు. 'మత్తగజాలను సైతం తన బాహుబలంతో అదుపు చెయ్యగల మహాబలశాలి నంద గోపుని కోడలా! యుద్ధభూమిలో అపజయమన్నది ఎరుగని నందగోపుని వీరత్వమే కుమారుడు కృష్ణుడు పుణికి పుచ్చుకున్నాడు కాబోలు. ప్రజాకంటకంగా సంచరిస్తున్న కోడెలను నిగ్రహించి నిన్ను గెలుచుకున్నాడు. అంతటి మహాబలశాలిని, పరాక్రమవంతుడిని నీ సున్నితమైన బాహుబంధంలో బంధించి ఉంచావు. ఈ గొల్లపిల్లల పట్ల దయతో నీ భర్తను వీడి నిద్దుర లేపవమ్మా .'

'నీ శిరోజాల పరిమళాలు బయటిదాకా ప్రసరించి నీ ఉనికిని తెలుపుతున్నాయి. చూడు తెల్లవారింది. ఎల్లెడలా కోళ్లు కూతలు పెడుతున్నాయి. నీవు పెంచిన మత్తకోకిలలు నీ రాక కోసం గురివింద పందిళ్లపై కూర్చుని కుహూమని మధురంగా కూస్తున్నాయి. నీ స్వామిని స్తోత్రం చేస్తున్న ఈ అమాయక గొల్ల పడుచులపై దయతో లేచి, నీ ఎర్రకలువల వంటి చేతుల గాజులు సుమధురంగా గలగలమని ధ్వనిస్తుండగా తలుపు తియ్యి తల్లీ! భోగోపకరణమైన బంతిని చేత ధరించినదానా, అలసినావేమో, మా పట్ల దయ చూపి నీ భర్తను లేపి తలుపు తియ్యవమ్మా'.

ఈ అద్భుత పాశురాన్నే 'తిరుప్పావై జీయర్' గా పేరుగాంచిన శ్రీరామానుజాచార్యులు ఉంఛవృత్తి చేసుకుంటున్నప్పుడు అనుసంధిస్తూ, ఆ ఆనందానుభవంలో తమ ఆచార్యుల కుమార్తె అత్తుళ్ళై తన గాజులు గలగలమంటుండగా భిక్ష సమర్పించటానికి తలుపు తియ్యగానే ఆమెను నప్పిన్నపిరాట్టిగా భావించి బాహ్యస్మృతి కోల్పోయారని ఐతిహ్యం.

– శ్రీదేవి మురళీధర్


బ్యూటిప్స్

● టేబుల్ స్పూన్ బియ్యప్పిండిలో ఎండబెట్టిన నారింజ తొక్కల పొడి టీ స్పూన్, తేనె 2 టీ స్పూన్లు, పచ్చిపాలు తగినన్ని కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికంతా పట్టించి, మృదువుగా రాయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. వారానికి మూడు రోజులు ఇలా చేస్తూ ఉంటే చలికాలం చర్మం పొడిబారకుండా ఉంటుంది.





• 'సరిలేరు నీకెవ్వరు'లో మహేశ్‌బాబు, తమన్నా



• 'క్రాక్'లో రవితేజ



• 'అల వైకుంఠపురములో' అల్లు అర్జున్, పూజా హెగ్డే

కొత్త లుక్కు... అదిరిపోయే కిక్కు

కొత్త ఏడాది వచ్చింది. వస్తూ వస్తూ సినిమాల కొత్త పోస్టర్లను, కొత్త చిత్రాల ప్రకటనలను మోసుకొచ్చింది. తెలుగు సినిమాకు కొత్త శోభను అలంకరించి ప్రేక్షకులకు అదిరిపోయే కిక్కు ఇచ్చింది. రజనీకాంత్ 'దర్బార్' ఈ నెల 9న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఏఆర్ మురుగదాస్ దర్శకుడు. ఆర్మీమేజర్ అజయ్ కృష్ణగా మహేశ్‌బాబు నటించిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. హీరో అల్లుఅర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అల..వైకుంఠపురములో..' ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. రవితేజ నటిస్తున్న 'డిస్కోరాజా, క్రాక్' చిత్రాల కొత్త లుక్స్ విడుదలయ్యాయి. వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న 'డిస్కోరాజా' చిత్రం ఈనెల 24న విడుదల కానుంది. గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తోన్న 'క్రాక్' వేసవిలో విడుదల అవుతుంది. ఈ నెల 15న 'ఎంత మంచివాడవురా' విడుదల కానుంది. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ హీరోగా నటించిన చిత్రం ఇది. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించిన 'నిశ్శబ్దం' చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. అదేరోజు 'అశ్వద్ధామ'గా వస్తున్నారు నాగశౌర్య. రమణతేజ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. నితిన్‌ను 'భీష్మ'గా మార్చారు దర్శకుడు వెంకీ కుడుముల. ఫిబ్రవరిలో 'భీష్మ' విడుదల కానుంది. పులివాసు దర్శకత్వంలో కల్యాణ్ దేవ్ నటిస్తున్న 'సూపర్ మచ్చి' పోస్టర్‌ని విడుదల చేశారు. అజయ్ కథుర్వర్, డింపుల్ జంటగా వేణు ముల్కల దర్శకత్వంలో తెరకెక్కించిన 'విశ్వక్' చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. శైలేష్ కొలను దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న 'హిట్' మూవీ ఫస్ట్ గ్లిమ్స్‌ని విడుదల చేశారు. ఫిబ్రవరి 28న సినిమా విడుదల కానుంది. నిర్మాత రాజ్‌కందుకూరి తనయుడు శివ కందుకూరి హీరోగా నటించిన 'చూసీ చూడంగానే..' సినిమాను ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రవిబాబు దర్శకత్వంలో రూపొందనున్న చిత్రానికి 'క్రష్' అనే టైటిల్ ఖరారు చేశారు.రూపేష్ కుమార్ చౌదరి, సలోని మిశ్రా జంటగా బి. శశికుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న '22' మూవీ టైటిల్ యానిమేషన్ లోగోని న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేశారు. ఇంకా 'నా పేరు రాజా: ఈడోరకం', 'ఏమైపోయావే', 'ఒక చిన్న విరామం', 'అనుభవించు రాజా' వంటి సినిమాల ప్రకటనలు, వీటికి సంబంధించిన ఫస్ట్‌లుక్, కొత్త లుక్‌లు కూడా ప్రేక్షకులకు కనువిందు చేశాయి.

ఓసారి కోలీవుడ్ కాలింగ్ బెల్ కొడితే.. సూర్య హీరోగా 'గురు' ఫేమ్ సుధాకొంగర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా'!) సెకండ్‌లుక్‌ను విడుదల చేశారు. కార్తీ 'ఖైదీ' ఫేమ్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో విజయ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రానికి 'మాస్టర్' అనే టైటిల్ ఖరారు చేశారు.



• 'అశ్వద్ధామ'లో నాగశౌర్య



• 'నిశ్శబ్దం'లో అనుష్క



• 'ఎంత మంచివాడవురా'లో కల్యాణ్ రామ్, మెహరీన్



• 'భీష్మ'లో రష్మిక, నితిన్



• 'విశ్వక్'లో అజయ్




• 'దర్బార్'లో నయనతార, రజనీకాంత్



• 'ఆకాశమే నీ హద్దురా'లో సూర్య



• 'చూసీ చూడంగానే'లో శివ కందుకూరి, వర్ష



• రెజీనా

జ్యోతిష్యం చెబుతా

చేతిని చూసి మీకు జరగబోయేదేంటో జోష్యం చెబుతాను అంటున్నారు రెజీనా. అనడమే కాదు.. జోష్యానికి సంబంధించిన విషయాలను జాగ్రత్తగా అవగాహన చేసుకుంటున్నారు. ఇదంతా తన తదుపరి సినిమాలోని పాత్రకు సంబంధించిన ప్రాక్టీస్ అని అర్థం చేసుకోవచ్చు. 'ఎవరు' సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్నారు రెజీనా. ఇటీవలే తమిళంలో ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాను అంగీకరించారు. ఇందులో అక్షర గౌడ మరో హీరోయిన్. కార్తీక్ రాజు దర్శకుడు. మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులను ఈ సినిమాలో చూపించనున్నారట. ''ఈ సినిమాలో నేను జ్యోతిష్కురాలి పాత్రలో కనిపిస్తాను. డైరెక్టర్ నాకు ఈ కథ చెప్పాగానే బాగా కనెక్ట్ అయ్యాను'' అని పేర్కొన్నారు రెజీనా. జనవరి 10 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది.



• అర్జున్ కపూర్, మలైకా అరోరా

ప్రేమ ముద్దు

అర్జున్ కపూర్, మలైకా అరోరా ప్రేమలో ఉన్నారని వారి సాన్నిహిత్యం చూస్తే అర్థం అవుతుంది. కానీ, ఆ విషయాన్ని ఎప్పుడూ ప్రకటించలేదు ఈ ఇద్దరూ. ప్రతి సందర్భంలో ఒకరి మీద మరొకరికి ఉన్న ఇష్టాన్ని వ్యక్తపరుస్తూనే ఉంటున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా ముద్దుగా తీసుకున్న పై ఫొటోను షేర్ చేశారు మలైకా అరోరా. ఈ ఏడాది ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోనున్నారనే వార్త ప్రచారంలో ఉంది.

ప్రతిరోజూ పండగే అందరి విజయం

- అల్లు అరవింద్



• సాయి తేజ్, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి, అల్లు అరవింద్, మారుతి, 'బన్నీ' వాస్

''మారుతి 'ప్రతిరోజూ పండగే' సినిమా కథని నాకు చెప్పినప్పుడు యూత్‌ఫుల్ ఎలిమెంట్స్ లేవు కదా? అన్నాను. కానీ మారుతి నమ్మకంగా ఉన్నాడు. షూటింగ్ పూర్తయ్యాక సినిమా చూస్తున్నంత సేపు నవ్వుకుంటూ ఉన్నాం. థియేటర్స్‌లో ఆడియన్స్ కూడా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమాను పెద్ద హిట్ చేసిన అభిమానులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ ఏడాది చివర్లో సాయితేజ్ సక్సెస్ కొట్టాడు. ఈ విజయం అందరిదీ'' అని అల్లు అరవింద్ అన్నారు. సాయితేజ్, రాశీఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 20న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రతిరోజూ పండగ సంబరాలు' కార్యక్రమంలో పాటల రచయిత 'సిరివెన్నెల' సీతారామ శాస్త్రి మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నప్పుడే విజయాన్ని ఊహించాను. విదేశాలకు వెళ్లిన తర్వాత మనుషుల మధ్య ప్రేమ, అభిమానాలు తగ్గాయి. ఈ పాయింట్ ఆడియన్స్ బాగా కనెక్ట్ అయ్యారు'' అన్నారు. ''ఒక తండ్రీ కొడుకుల మధ్య ఉండే అనుబంధాన్ని చూపించాలనుకున్నా. ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు'' అన్నారు మారుతి. ''ప్రతిరోజూ పండగే' సినిమాని సపోర్ట్ చేసున్న వారికి ధన్యవాదాలు. ఈ సక్సెస్‌ను మెగా అభిమానులకు, తెలుగు ప్రేక్షకులకు అంకితమిస్తున్నా'' అన్నారు సాయితేజ్. ''నన్ను నమ్మి ఈ ప్రాజెక్ట్ ఇచ్చిన అరవింద్, వాసుగార్లకు థ్యాంక్స్'' అన్నారు తమన్.

తెరపై తెలంగాణ సొగసు


''సినిమా తీయడం కంటే ప్రేక్షకుల వద్దకు చేర్చడం ఎక్కువ కష్టం. 'ఉత్తర' సినిమాకి నిర్మాతగా, దర్శకుడిగా చాలా అనుభవాలు ఎదుర్కొన్నాను. ఒంటరిగా ఏడ్చిన సందర్భాలున్నాయి. నాకు సపోర్ట్‌గా నిలిచిన శ్రీపతి రంగదాస్, రవికుమార్‌లకు థ్యాంక్స్'' అని తిరుపతి యస్.ఆర్. అన్నారు. నిమ్మల శ్రీరామ్, కారుణ్య కత్రేన్ జంటగా తిరుపతి యస్.ఆర్. దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఉత్తర'. రవికుమార్ మాదారపు సమర్పణలో లైవ్ ఇన్ సి క్రియేషన్స్, గంగోత్రి ఆర్ట్స్ పతాకాలపై తిరుపతి యస్.ఆర్, శ్రీపతి గంగదాస్ నిర్మించిన ఈ సినిమా రేపు(శుక్రవారం) విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకలో తిరుపతి యస్. ఆర్. మాట్లాడుతూ– ''తెలంగాణ సొగసును తెరమీద ఆవిష్కరించిన చిత్రమిది. సహజమైన తెలంగాణ మాటలు, మనుషులను తెరమీదకు తెచ్చాం'' అన్నారు. ''సినిమా అవకాశాలకోసం ప్రయత్నించే వాళ్లను ప్రోత్సహించకపోయినా పర్లేదు కానీ విమర్శించకండి'' అన్నారు శ్రీపతి రంగదాస్. ''ఉత్తర' లో ఓ మ్యాజిక్ ఉంది'' అన్నారు రవికుమార్ మాదారపు. ''ప్రతి అమ్మాయి నా పాత్రతో రిలేట్ అవుతుంది'' అన్నారు కారుణ్య కత్రేన్. ''నేను ప్రభాస్ గారికి పెద్ద అభిమానిని'' అన్నారు శ్రీరామ్ నిమ్మల.



• శ్రీరామ్, కారుణ్య

అనురాగాలు.. ఆప్యాయతలు

బాలాదిత్య, అర్చన హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. సీనియర్ నటి అన్నపూర్ణమ్మ, మాస్టర్ రవితేజ టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రానికి శివనాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. ఎమ్ఎన్ఆర్ చౌదరి నిర్మించిన ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ నెల 30న ఈ చిత్రం విడుదల కానుంది. శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ –''గ్రామాల్లోని ఆప్యాయతలు, అనురాగాలు మా సినిమాలో కనిపిస్తాయి. హృదయాన్ని హత్తుకునే సన్నివేశాలు, కడుపుబ్బా నవ్వించే హాస్యం, యువతీ యువకులకు కావాల్సిన అంశాలు మా చిత్రంలో ఉన్నాయి. అన్నపూర్ణమ్మగారి, మాస్టర్ రవితేజ నటన సినిమాకు హైలైట్‌గా ఉంటుంది. జమునగారు ఓ కీలకపాత్ర పోషించారు. రాజకిరణ్ మంచి సంగీతం అందించారు. మా చిత్రాన్ని సెన్సార్ సభ్యులు మెచ్చుకుని, యు సర్టిఫికెట్ ఇచ్చారు. మొత్తంగా మా 'అన్నపూర్ణమ్మగారి మనవడు' ప్రేక్షకులను మెప్పిస్తాడు'' అన్నారు.



• అన్నపూర్ణమ్మ, రవితేజ




• అధర్వ, మేఘా ఆకాశ్

తర్వాత ఏం జరుగుతుంది?

'గద్దలకొండ గణేష్' చిత్రంతో తెలుగు చిత్రపరిశ్రమకి పరిచయమయ్యారు తమిళ యువ నటుడు అధర్వ మురళి. ఆయన నటించిన తమిళ చిత్రం 'బూమరాంగ్'ను అదే టైటిల్‌తో తెలుగులో విడుదల చేస్తున్నారు నిర్మాత సీహెచ్ సతీష్ కుమార్. ఆర్. కణ్ణన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో మేఘా ఆకాశ్, ఇందుజా రవిచంద్రన్ కథానాయికలు. రేపు(3న) విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అధర్వ నాకు ఇష్టమైన హీరో. చాలా ప్యాషనేట్ హీరో.. యువత తలుచుకుంటే ఎలాంటి మార్పు తీసుకురావచ్చనే సందేశాన్ని ఈ చిత్రంలో చక్కగా చెప్పారు'' అన్నారు. ''ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలు మా సినిమాలో ఉంటాయి. తర్వాత ఏం జరుగుతుందోనని ఊహించలేని విధంగా దర్శకుడు స్క్రీన్‌ప్లే రాశారు'' అన్నారు నిర్మాత సీహెచ్ సతీష్ కుమార్.

సవారికి సిద్ధం

నందు, ప్రియాంక శర్మ జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సవారి'. కాల్వ నరసింహ స్వామి ప్రొడక్షన్స్ పతాకంపై సంతోష్ మోత్కూరి, నిశాంక్ రెడ్డి కుడితి నిర్మించిన ఈ సినిమాని ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్లు చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్ని వర్గాలను ఆకట్టుకునే లవ్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇప్పటికే విడుదలైన టీజర్, శేఖర్ చంద్ర సంగీతానికి మంచి స్పందన రావడంతో సినిమాకు క్రేజ్ వచ్చింది. రాహుల్ సిప్లిగంజ్ పాడిన 'నీ కన్నులు..' లిరికల్ సాంగ్‌కి ఇప్పటికే 5 మిలియన్ వ్యూస్ దక్కాయి. అదేవిధంగా 'ఉండిపోయా..' పాటకు కూడా అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్, ప్రొడక్షన్ సంస్థ ఏషియన్ సినిమాస్ మా సినిమా థియేట్రికల్ హక్కులను దక్కించుకున్నారు.. నైజాంలో వారు విడుదల చేయనున్నారు'' అన్నారు. శ్రీకాంత్ గంట, శివ, మది తదితరులు ఈ చిత్రంలో నటించారు.



• నందు





డిసెంబర్ 31 రాత్రి నుంచి స్వీట్లు తినడం, కేకులు కోయడం మొదలవుతుంది. ఇంకో వారం రోజులు గడిస్తే సంక్రాంతి హడావిడి దానితో పాటు అరిసెలు, లడ్డ తయారీ ఇళ్లల్లో కనిపిస్తుంది. ఈ సీజన్ అంతా సంబరం... తీపి సంబరం. అయితే ఈ తీపికి పరిమితి లేకపోతే ఏం జరుగుతుంది? అవసరానికి మించి తీపి తింటే ఏమవుతుంది? తెల్లటి చక్కెర ఆరోగ్యానికి ఎంత చేటు చేస్తుంది? తీపి పదార్థాల రుచి కోసం వాడే అడెటివ్స్ ఎంత ప్రమాదం? వీటన్నటిని వివరించేదే ఈ కథనం.

స్వీట్ & క్యూట్ డేంజర్స్

మనం జబ్బుపడటానికి అతి ముఖ్యకారణాల్లో ప్రధానమైనది చక్కెర వినియోగమే అంటాడు ప్రముఖ బయోకెమిస్ట్ రేమండ్ ఫ్రాన్సిస్. కేవలం ఒక టీ స్పూన్ చక్కెర తీసుకున్నా... రెండు గంటల్లో అది మన దేహంలో కలిగించే జీవరసాయన చర్యల వల్ల వ్యాధి నిరోధక సామర్థ్యం 50 శాతం తగ్గుతుందన్నది ఆయన చెప్పే మాట. మనకు ఆరోగ్యాన్నిచ్చే బెల్లం, తేనె వంటి స్వాభావిక (నేచురల్) స్వీటెనర్లతో పోలిస్తే చక్కెరతో ప్రమాదం చాలా ఎక్కువ. ఆ కారణాల్లో ప్రధానమైనది... చక్కెరను ప్రాసెస్ చేసే ప్రక్రియలో ఉపయోగించే గంధకం (సల్ఫర్). చాలా దుర్వాసన వెలువరించే ఈ రసాయనాన్ని చక్కెర ప్రాసెసింగ్‌లో వాడుతుంటాం. మనకు చాలా హాని చేసే మరో 23 రసాయనాలను ఈ చక్కెర ప్రాసెసింగ్‌లో వాడతారు.

చక్కెర అనర్థాలలో ఇవి కొన్ని మాత్రమే...

- చక్కెరతో ఒంట్లో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ మోతాదులు పెరిగి, గుండెజబ్బులు వస్తాయి.
- చక్కెరతో బరువు పెరుగుతుంది. ఊబకాయం (ఒబేసిటీ) వస్తుంది. ఊబకాయంతో వచ్చే అనర్థాల్లో ముఖ్యమైనది అధిక రక్తపోటు.
- పక్షవాతం రావడానికి ముఖ్య కారణం చక్కెర.
- కారం, మసాలాలతో పాటు కడుపులో అల్సర్స్‌కు చక్కెర కూడా కారణమే.

చక్కెరకు తోడుదొంగలు ఏడెటివ్స్

ఓ పదార్థం చూడటానికి ఆకర్షణీయంగా కనిపించాలంటే అది రంగులీనుతూ, చాలాకాలం పాటు చెడిపోకుండానూ ఉండాలి. అప్పుడే అది కాసులు కురిపిస్తుంది. ఈ ప్రయోజనాలు నెరవేరాలంటే ఆహారానికి కొన్నిపదార్థాలు కలపాల్సి ఉంటుంది. ఇలా కలిపే వాటినే ఏడెటివ్స్ అంటారు. వీటిల్లో చాలా వరకు ప్రమాదకరమైనవే.

కృత్రిమంగా తీపినిచ్చే పదార్థాలు (ఆర్టిఫిషియల్ స్వీటెనర్స్): శాకరిన్ అనేది చక్కెరతో పోలిస్తే 300 రెట్లు ఎక్కువ తీపినిస్తుంది. సుక్రలోజ్ అనే దాన్ని క్లోరినేటెడ్ చక్కెర నుంచి తయారు చేస్తారు. స్వాభావికమైన చక్కెరతో పోలిస్తే ఇది 600 రెట్లు ఎక్కువ తియ్యగా ఉంటుంది. బేకరీ ఐటమ్స్‌లో ఉపయోగిస్తారు. ఏస్‌సల్ఫమీ కె అనేది ఒకరకం రసాయనిక తీపి పదార్థం. దీన్ని సాఫ్ట్ డ్రింక్స్‌లో కలుపుతారు. ఇక ఆస్పార్టమ్ అనే దాన్ని సాధారణ పరిభాషలో 'న్యూట్రాస్వీట్'గా వ్యవహరిస్తారు. దీన్ని షుగర్ ఫ్రీ అని పేర్కొనే పదార్థాల్లో కలుపుతారు. ఆస్పార్టమ్ క్యాన్సర్ కారకమన్నది నిపుణులు చెప్పే మాట. అది నరాలపైనా దుష్ప్రభావం చూపుతుంది. దీర్ఘకాలం వాడితే షార్ట్ టర్మ్ మెమరీపై ప్రభావం చూపి జ్ఞాపకశక్తి తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. బ్రెయిన్ ట్యూమర్, లింఫోమా, డయాబెటిస్, మల్టిపుల్ స్క్లిరోసిస్, పార్కిన్‌సన్స్ డిసీజ్ వంటి అనేక వ్యాధులకు పరోక్ష కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు ఇలాంటి కృత్రిమ తీపి పదార్థాలు ఉండే ఆహారాన్ని తీసుకోవడం మంచిది కాదు. బేకరీఫుడ్స్‌లో ఇవి ఎక్కువ.

హెల్దీగా తీపిని పొందడం ఎలా...?

ఇందుకోసం పైన పేర్కొన్న కృత్రిమ తీపి పదార్థాలకు బదులు స్వాభావికమైన తీపి పదార్థాలపై ఆధారపడవచ్చు. వీటినే నేచురల్ స్వీటెనర్స్ అంటారు. వీటిని ఉపయోగిస్తే అటు ఆరోగ్యానికి ఆరోగ్యం, ఇటు చవగ్గానూ లభ్యం.

స్వాభావిక తీపి పదార్థాలివే...

స్టీవియా: స్వాభావికమైన చక్కెరతో పోలిస్తే 290 రెట్లు ఎక్కువ తీపి ఉంటుంది. దీన్ని స్వాభావిక చక్కెర (సుక్రోజ్)తో కలిపి 'సీఎస్‌ఆర్ స్మార్ట్' పేరిట మార్కెట్‌లో అమ్ముతుంటారు.

సార్బిటాల్: దీన్నే గ్లూసిటాల్ అంటారు. ఇది కొన్ని రకాల పండ్లను పాకం పట్టినప్పుడు చక్కెర పాకంలా వచ్చే పదార్థాల నుంచి సేకరిస్తారు.

గ్జైలిటాల్: కొన్నిపండ్లు/ఆకుకూరలు/కూరగాయలను పాకం పట్టినప్పుడు అందులోని పీచుపదార్థాలనుంచి స్రవించే పాకం నుంచి తయారవుతుంది.

స్వీటెనింగ్ ఆపిల్ ఎక్స్‌ట్రాక్ట్స్: ఆపిల్స్ నుంచి తీసే పదార్థాల (ఆపిల్ ఎక్స్‌ట్రాక్ట్స్) నుంచి సేకరించిన పదార్థాలు స్వాభావికం కావడంతో ఇవి తియ్యదనాన్ని, రుచినీ, ఆరోగ్యాన్నీ అందిస్తాయి.

స్వాభావిక తీపి పదార్థాలతో లాభాలివే

- స్టీవియాను మొక్క నుంచి సేకరిస్తారు కాబట్టి హానికరం కాదు. చక్కెర పాళ్లు పెరగవు. కాబట్టి డయాబెటిస్ రోగులకూ మంచిది.
- **అగేవ్ నెక్టర్:** మెక్సికోలో పెరిగే ఒక రకం మొక్క నుంచి సేకరించే పాకమిది. దీనిని తినడం వల్ల సాధారణ చక్కెర తిన్నప్పటికంటే తక్కువ తీపి శరీరంలో విడుదలవుతుంది. అందుకే రక్తంలో షుగర్ పాళ్లు పెరగవు. కాబట్టి డయాబెటిస్ రోగులకు ఇది చక్కెర కంటే మంచి ప్రత్యామ్నాయం.
- **పామ్ షుగర్:** పామ్ షుగర్ అంటే దాన్ని తాటిచెట్టు నుంచి వచ్చే పదార్థాలతో తయారు చేస్తారు. పంచదారలా వాడుకుంటారు. చక్కెరతో పోలిస్తే ఇది ఆరోగ్యకరం. ఫైబర్ కూడా ఎక్కువే. కాబట్టి డయాబెటిస్ రోగులు సైతం వాడుకోవచ్చు.
- **తేనె:** దీనిలో రుచితోబాటు ఔషధ గుణాలు, ఆరోగ్యాన్ని ఇచ్చేదిగా దీని ప్రాధాన్యం చాలా ఎక్కువ.

మనం షాపింగ్‌మాల్‌లో ఏవైనా వస్తువులు కొనేప్పుడు స్వాభావికమైన తీపి పదార్థాలు (నేచురల్ స్వీటెనర్స్) ఉన్నవే కొంటుండటం వల్ల ఆరోగ్యాన్ని పొందవచ్చు. డాక్టర్ సలహా మీద కొన్నింటిని డయాబెటిస్ రోగులకూ ఇవ్వవచ్చు. ఇలా చక్కెరకు ప్రత్యామ్నాయాలు వాడకోవడం వల్ల చాలాకాలం ఆరోగ్యంగా ఉండవచ్చు.

చక్కెర వల్ల డయాబెటిస్ రాదు గానీ...

నేరుగా చక్కెర తినడం వల్ల డయాబెటిస్ రాదు. కానీ ఒకసారి డయాబెటిస్ వచ్చాక చక్కెర మోతాదులు ఎక్కువ కావడం ఎంతో ప్రాణాంతకం. అది అందరికీ తెలిసిన విషయమే. పైగా చక్కెరతో చేసిన తీపి పదార్థాలు క్యాన్సర్ కణానికి ఎంతో ఇష్టమంటారు. చక్కెరతో చేసే తీపి పదార్థాలు ఎంత ఎక్కువ సేపు దొరుకుతుంటే క్యాన్సర్ కణానికి అంతసేపు నిరాటంకంగా వృద్ధి చెందుతూ ఉంటుందన్నది నిపుణుల మాట.

ఏడెటివ్స్ అంటే...

ఓ ఆహార పదార్థాన్ని చాలాకాలం పాటు చెడిపోకుండా చూడటానికి, దీర్ఘకాలం పాటు నిల్వ ఉంచడానికీ లేదా ఆహారానికి ఆకర్షణీయమైన రంగును ఇవ్వడానికో ఉపయోగించడానికి కలిపేదాన్ని ఏడిటివ్ అంటారు. వీటిల్లో చాలా రకాలుంటాయి. దీర్ఘకాలం నిల్వ ఉంచడానికి ఉపయోగించే వాటిని ప్రిజర్వేటివ్స్ అంటారు. ఆహారానికి ఆకర్షణీయమైన రంగునిచ్చేవాటిని కలరేటివ్ ఏజెంట్స్ అంటారు. మంచి సువాసననూ, రుచినీ ఇచ్చేవి ఫ్లేవరింగ్ ఏంజెంట్స్. ఏడెటివ్స్‌లో ఇన్ని రకాలు ఉన్నప్పటికీ... పోషకాహారపరంగా చూస్తే వాటికి ఉన్న విలువ దాదాపు శూన్యం. మన దేశవాసులు సాధారణంగా ఆహారం వృథా కావడాన్ని అంగీకరించరు. దాంతో దీర్ఘకాలం నిల్వ ఉంచడం కోసం, నిల్వ ఉండేది ఆకర్షణీయంగా కనిపించడం కోసం కొన్ని ప్రిజర్వేటివ్స్, కలరేటివ్ ఏజెంట్స్ వాడుతుంటారు.



సుజాతా స్టీఫెన్
చీఫ్ న్యూట్రిషనిస్ట్
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట, హైదరాబాద్

అపోహ-వాస్తవం

డ్రైఫ్రూట్స్ నానబెట్టి తినాలా?

అపోహ: డ్రైఫ్రూట్స్ నానబెట్టి తింటే పోషక విలువలు పెరుగుతాయా?

వాస్తవం: చాలామంది బాదం లాంటి డ్రైఫ్రూట్స్‌ను కిందటిరాత్రి నానబెట్టి, మర్నాడు తింటుంటారు. ఇలా నానబెట్టడం వల్ల పోషక విలువలు పెరుగుతాయనేది చాలామందిలో ఒక అపోహ. వాస్తవంగా చెప్పాలంటే... ఇలా నానబెట్టడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. కాకపోతే బాదం వంటివి మెత్తబడి త్వరగా నమిలేందుకు వీలుగా ఉంటాయి.

దాదాపు అన్నిరకాల డ్రైఫ్రూట్స్‌లోనూ ప్రధానంగా ప్రొటీన్లు, విటమిన్లు (ఏ, బి1, బి2, బి3, బి6), ఖనిజ



లవణాలు (క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పొటాషియం, సోడియం, కాపర్, మాంగనీస్) వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అవి అధికక్యాలరీస్ ఇవ్వడంతో పాటు మంచి శక్తి వనరులు కూడా. ఎవరు ఎంతెంత మోదాదులో/పరిమాణంలో డ్రైఫ్రూట్స్ తీసుకోవాలన్నది వాళ్ల వాళ్ల బరువు, వాళ్లు చేసే దైనందిన కార్యకలాపాల వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. అంటే బాగా శారీరకంగా కష్టపడుతూ మంచి హార్డ్‌వర్క్ చేసేవారు ఒకింత ఎక్కువగా తిన్నా పర్లేదు. అంతగా శారీరకంగా కష్టపడనివాళ్లు ఒకింత పరిమితంగా తక్కువ మోతాదులో తినడమే మంచిది. అడపాదడపా నట్స్/డ్రైఫ్రూట్స్ తినడం ఆరోగ్యకరమే. వాటిని నానబెట్టినా, పెట్టకపోయినా వాటిలోని పోషకాల్లో ఎలాంటి మార్పూ ఉండదు. కాబట్టి నానబెట్టకుండా నేరుగానే తినవచ్చు.

హ్యాపీ మార్నింగ్ - హాయి హాయి మార్నింగ్



మలబద్ధకాన్ని అధిగమించండిలా

చాలామందిని మలబద్ధకం తీవ్రంగా బాధిస్తుంటుంది. వినడానికి చిన్న సమస్యలా అనిపించినా పొద్దున్నే చాలామందిని తీవ్రంగా ఇబ్బందిపెట్టే సమస్య. తొలిదశలోనే దీన్ని నివారించకపోతే భవిష్యత్తులో ఇది మరిన్ని ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. జీవనశైలి మార్పులైన ఆహారం, వ్యాయామంతోనే ఈ సమస్యను తేలిగ్గా పరిష్కరించుకోవచ్చు. మలబద్ధకానికి గల కారణాలు... ఆ సమస్యను అధిగమించడం ఎలాగో చూద్దాం.

మలబద్ధకానికి కారణాలివి...

- **ఆహారం:** మనం తీసుకునే ఆహారంలో తగినన్ని పీచుపదార్థాలు లేకపోవడంతో పాటు... ఎక్కువ కొవ్వు పదార్థాలు ఉండే ఆహారం (అంటే... వెన్న, నెయ్యి, మాంసం వంటివి) ఎక్కువగా తీసుకోవడం.
- ద్రవాహారం తగినంత తీసుకోకపోవడం: మనం తీసుకునే పదార్థాలలో నీళ్లు, పళ్లరసాలు వంటి ద్రవాహారం తక్కువగా తీసుకోవడం. మనం తీసుకునే పదార్థాల్లో ద్రవాహారం ఎక్కువగా ఉంటే అది పేగుల కదలికలను ప్రేరేపించి విరేచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది.
- **వ్యాయామం లేకపోవడం:** వ్యాయామం లేకపోవడం పేరుగల కదలికలను మందగించేలా చేస్తుంది. దాంతో ఎక్కువసేపు శారీరకమైన కదలికలు లేకుండా పడకపైనే ఉండేవారికి మలబద్ధకం వచ్చే అవకాశం ఎక్కువ.
- **మందులు:** కొన్ని రకాల నొప్పి నివారణ మందులు (ప్రత్యేకంగా నార్కోటిక్ మందులు), యాంటాసిడ్స్, యాంటీ డిప్రెసెంట్స్, ఐరన్ సప్లిమెంట్స్, మూర్ఛవ్యాధికోసం తీసుకునే యాంటీ ఎపిలెప్టిక్ డ్రగ్స్ తీసుకునేవాళ్లలో పేగుల కదలికలు మందగించి మలబద్ధకానికి దారితీయవచ్చు.
- **ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్):** ఈ సమస్య ఉన్నవారిలో పేగుల కదలికలు ప్రభావితమై మలబద్ధకం ఉండవచ్చు. అయితే ఇది హానికరమైన పరిస్థితి కాదు కాబట్టి అంతగా విచారించాల్సిన అవసరం లేదు.
- **సాధారణ జీవితానికి భిన్నమైన పరిస్థితుల్లో...:** అంటే... కొందరు మహిళల్లో గర్భధారణ సమయంలో హార్మోన్ల ప్రభావంతో మలబద్ధకం రావచ్చు. మరికొందరిలో ప్రయాణ సమయంలో తమ ఆహారపు అలవాట్లు మారినందువల్ల కూడ ఈ సమస్య రావచ్చు.
- **కొన్ని రకాల రుగ్మతల్లో:** సాధారణంగా నరాలకు సంబంధించిన వ్యాధులు, ఎండోక్రైన్ రుగ్మతలు వంటివి వచ్చినప్పుడు కూడా మలబద్ధకం రావచ్చు.
- సాధారణంగా మలబద్ధకాన్ని రోజూ మనం పదార్థాలలో మంచి ఆహార అలవాట్లతో, జీవనశైలిలో మార్పులతోనే మలబద్ధకాన్ని నివారించుకునేందుకు అవకాశం ఉంది. అందుకు కొన్ని సూచనలివి...
- రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.
- జామపండును గింజలతోనే తినేయండి. ఆ గింజలు మోషన్ ఫ్రీగా అయ్యేలా సహాయపడతాయి.
- ఆహారంలో తాజా పళ్లు (జామ, ఆరెంజ్, బొప్పాయి వంటివి) ఎక్కువగా తీసుకోండి.
- రోజూ రెండు ఆపిల్ పళ్లు పరగడుపున తినండి.
- వెజిటబుల్ సలాడ్స్ (క్యారట్, బీట్‌రూట్, టొమాటో, కీర దోసకాయ, ఉల్లిని ముక్కలుగా చేసి పచ్చిగా) తినండి.
- మొలకెత్తిన గింజలు (స్ప్రౌట్స్) ఎక్కువగా తీసుకుంటే మలబద్ధకం తగ్గుతుంది.
- పొట్టుతో ఉన్న ధాన్యాలు (జొన్న, రాగి), పొట్టుతో ఉండే గోధుమలు, ముడిబియ్యం, పొట్టుతోనే ఉండే పప్పుధాన్యాలు వంటివి తీసుకోవడం వల్ల కూడా మలబద్ధకాన్ని నివారించవచ్చు.

ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించి, దానికి కారణం ఏమిటన్నది కనుగొని, తగిన మందులు వాడాల్సి ఉంటుంది.

సీజన్ సమస్య

ఈ కాలంలో ఆర్థ్రైటిస్ నొప్పులు

సాధారణంగా వేసవి కాలాలు విపరీతమైన వేడిమితో చాలా దుర్భరంగా ఉంటాయి. అందునా ఇటీవలి కాలుష్యాలు, ఇతర కారణాలవల్ల ఈ వేసవివేడి మరింత ఎక్కువగా ఉంటోంది. అందుకే ఇలాంటి వాతావరణాల్లో శీతకాలం అనగానే చాలామందికి ఎంతో హాయిగా ఉంటుంది. కానీ ఇది మామూలు వాళ్లకు. ఆర్థ్రైటిస్‌తోనూ, కీళ్ల వాతాలతోనూ బాధపడేవారికి చలికాలం అంటే అది వేసవి కంటే మరింత బెరుకు. ఒక్కటే వణుకు. ఈ వణుకూ, బెరుకూ చలి వల్ల కాదు. కొన్ని కారణాల వల్ల ఆర్థ్రైటిస్ రోగులకు చలికాలం బాధలు మరింత ఎక్కువవుతాయి. దాంతో ఆర్థ్రైటిస్ రోగులు శారీరకంగా, మానసికంగా మరింతగా ఒత్తిడికి గురవుతారు. ఇందుకు కారణాలనూ, పరిష్కారాలనూ తెలుసుకుందాం.

మరింత విషమించే బాధలు

ఆర్థ్రైటిస్ ఉన్నవారిలో కలిగే రెనాడ్స్ ఫినామినన్ (వేళ్లకి రక్తప్రసరణ తగ్గడం) తీవ్రస్థాయికి చేరడంతో... ఆ కారణంగా కొందరిలో చేతివేళ్లు, కాలివేళ్లు కుళ్లిపోయే ప్రమాదమూ (గ్యాంగ్రీన్) సంభవించవచ్చు. ఆర్థ్రైటిస్ వల్ల ఊపిరితిత్తుల ప్రభావితం అయినప్పుడు కలిగే ఐఎల్‌డీ అనే జబ్బు శీతకాలంలో మరింత తీవ్రత చూపెడుతుంది. వీరిలో ఆయాసం, దగ్గు బాగా ఇబ్బందిపెడతాయి. మయోసైటిస్ అనే రకం కీళ్లవాతంతో బాధపడేవారిలో ఈ కాలంలో కండరాలకి రక్తప్రసరణ తగ్గడంతో వాటి కదలికలు బాగా మందగిస్తాయి. చాలా పరిమితంగా మాత్రమే జరుగుతుంటాయి. దాంతో వ్యాధి తీవ్రత పెరిగి లక్షణాలు ఇబ్బందికరంగా మారడంతో సగానికిపైగా ఆర్థ్రైటిస్ రోగులు చలికాలం వస్తుందంటేనే ఆందోళన చెందుతుంటారు.

మన వాతావరణం మన శరీరంలోనీ జీవక్రియలపై గణనీయమైన ప్రభావం చూపుతుంటుంది. దేహంలో జరిగే ఈ ప్రక్రియలన్నీ వాతావరణానికి తగ్గట్లుగా మార్పులకు లోనవుతుంటాయి. మన రోగనిరోధక వ్యవస్థ స్పందనలు కూడా వాతావరణానికి తగ్గట్లుగానే మారడం మరో విశేషం. ఈ మార్పుల కారణంగానే ఆర్థ్రైటిస్‌తో బాధపడేవారిలో కండరాలు బాగా బిగుసుకుపోవడం, కీళ్లనొప్పులు విపరీతంగా పెరగడం జరుగుతాయి. ప్రత్యేకించి ఈ మార్పులు వృద్ధుల్లో మరింత ఎక్కువగా ఉంటాయి. దాంతో ఈ రోగులు మానసికంగా కుంగిపోవడమే కాకుండా డిప్రెషన్‌కు కూడా గురవుతుంటారు.

ఆర్థ్రైటిస్ రోగులు చలికాలం బాధలు అధిగమించాలంటే...

చాలా చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆర్థ్రైటిస్ రోగులు చలికాలంలో పెరిగే బాధలను చాలా తేలిగ్గా అధిగమించవచ్చు. అవి...

- చలికాలంలో సూర్యరశ్మి బాగా తక్కువగా ఉంటుంది. దీని కారణంగా మన శరీరంలో విటమిన్–డి ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ఈ కారణంగా వ్యాధి లక్షణాలతో కలిగే బాధలు తారస్థాయికి చేరుకుంటాయి. కాబట్టి ఈ రోగులందరూ డాక్టర్ సలహా మేరకు తగిన మోతాదులో విటమిన్–డి సప్లిమెంట్లను తీసుకోవాలి
- శీతకాలంలో కండరాల కదలికలు ఇబ్బందికరంగా మారడం, విపరీతమైన నొప్పుల వల్ల రోగులు తమ కదలికలనూ తగ్గిస్తారు. దీనివల్ల ఇబ్బందులు రెట్టింపయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే వీరిలో వ్యాయామం ఎంతో ముఖ్యం. ఇది నొప్పిని తగ్గించి, కండరాల శక్తిని, కదలికలను పెంచుతుంది. నొప్పి విపరీతంగా ఉన్నవారిలో సున్నితమైన వ్యాయామాలతో నొప్పి తీవ్రత తగ్గుతుంది.
- శీతకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. వాటివల్ల కీళ్లవాతాల తీవ్రత మరింత పెరిగే అవకాశాలుంటాయి. కాబట్టి ఆర్థ్రైటిస్ రోగులు చలికాలం రాకముందే సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలి.
- సాధ్యమైనంత వరకు శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. ఉన్నిదుస్తులు, కాళ్లకి సాక్స్, చేతులకు గ్లొవ్స్ వేసుకోవాలి. వెచ్చదనం నొప్పిని కలిగించే రసాయనాలను బయటకు తొలగించి, రక్తప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే కండరాలు బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది.
- చల్లటి పదార్థాలు సేవించడం వీలైనంతగా తగ్గించాలి.
- పాలు, పాలపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- చలికాలంలో నీళ్లు, ద్రవపదార్థాలను తీసుకోవడం తగ్గిస్తుంటారు. దాంతో ఒంట్లో ద్రవాలు తగ్గుతాయి. అలా కాకుండా నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఉండాలి. అలా దేహాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడం వల్ల చాలా ఉపద్రవాలు తగ్గుతాయి.
- ఆర్థ్రైటిస్ కోసం వాడే మందులను క్రమం తప్పకుండా రుమటాలజిస్టుల సలహా మేరకు వాడుకుంటూ ఉండాలి.





డాక్టర్ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్,
సిటీ న్యూరో సెంటర్, రోడ్ నెం. 12,
బంజారాహిల్స్, హైదరాబాద్.

హోమియో కౌన్సెలింగ్

చర్మంపై పొలుసులు రాలుతున్నాయి... ఎందుకు?

నా వయసు 42 ఏళ్లు. గత మూడేళ్లుగా చర్మంపైన మచ్చలుగా ఏర్పడి పొట్టు రాలిపోతున్నది. ఎంతో మంది డాక్టర్లకు చూపించాను. ప్రయోజనం కనిపించడం లేదు. కీళ్లనొప్పులు కూడా వస్తున్నాయి. హోమియో మందులతో తగ్గుతుందా?

– ఎమ్. చంద్రశేఖర్, మేడ్చల్

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి చూస్తే మీ వ్యాధి సోరియాసిస్‌గా తెలుస్తోంది. ఇందులో చర్మంపై మచ్చలు లేదా బొబ్బల్లా ఏర్పడి, అవి పొలుసులుగా ఊడిపోతోంది.

లక్షణాలు: • చేతులు, కాళ్లు, తల, ముఖం, చర్మంపై మచ్చలు లేదా బొబ్బలు వచ్చి చేప పొలుసులుగా చర్మం ఊడిపోతుంది. • కేవలం చర్మం మీద మాత్రమే గాక గోళ్లపై మచ్చలు రావడం, కీళ్ల నొప్పులు ఉంటాయి. • తలపై చుండ్రులాగా పొలుసులతో పాటు జుట్టు కూడా రాలిపోతుంది.

ఇటీవలి వ్యాధి ట్రెండ్: ఆధునిక జీవన శైలి వల్ల ఇటీవల వంశపారంపర్యంగా వ్యాధి లేనివారిలోనూ ఇది కనిపిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. చాలా హడావుడి, ఆదుర్దా కలిగిన జీవనశైలి వల్ల ఇది చాలామందిలో కనిపిస్తోంది. కాబట్టి ఒత్తిడిని వీలైనంత దూరంగా ఉంచుతూ, మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఉండాలి. చర్మం మరీ పొడిబారి పోకుండా తగిన మోతాదులో నీళ్లు తీసుకోవాలి.

చికిత్స: ముందుగా రోగి స్వభావం, తత్వం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని వాళ్లలో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా జెనెటిక్ కన్‌స్టిట్యూషన్ పద్ధతిలో చికిత్స చేయడం ద్వారా సోరియాసిస్ సమస్యకు సమూలమైన చికిత్స అందించడం హోమియో ప్రక్రియలో పూర్తిగా సాధ్యమవుతుంది.



డాక్టర్ ఎ.ఎం.రెడ్డి, సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి,
హైదరాబాద్


ఫ్యామిలీ డాక్టర్

యానల్ ఫిషర్‌కు చికిత్స ఉందా?

నా వయసు 62. మలవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి వస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే యానల్ ఫిషర్ అని చెప్పి, ఆపరేషన్ అవసరమన్నారు. హోమియోలో ఆపరేషన్ లేకుండా చికిత్స ఉందా?

– ఆర్. శ్రీనివాస్, నిడదవోలు

మనం తీసుకునే ఆహారంలో పీచుపదార్థాల పాళ్లు తగ్గడం వల్ల మలబద్ధకం వస్తుంది. దాంతో



మలవిసర్జన సాఫీగా జరగక విపరీతంగా ముక్కడం వల్ల మలద్వారం వద్ద పగుళ్లు ఏర్పడతాయి. వీటిని ఫిషర్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు మలవిసర్జన సమయంలో నొప్పితో పాటు రక్తస్రావం జరుగుతుంది. ఫిషర్ ఏళ్ల తరబడి బాధిస్తుంటుంది. ఆపరేషన్ చేయించుకున్నా మళ్లీ సమస్య తిరగబెట్టడం మామూలే.

లక్షణాలు: తీవ్రమైన నొప్పి, మంట • విరేచనంలో రక్తం పడటం • చికాకు • కొందరిలో మలవిసర్జన అనంతరం గంటల పాటు నొప్పి.

చికిత్స : ఫిషర్ సమస్యను ఆపరేషన్ అవసరం లేకుండానే నయం చేయవచ్చు. హోమియో మందులను అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో వాడితే మంచి ఫలితం ఉంటుంది.



డాక్టర్ టి.కిరణ్‌కుమార్,
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్


సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
గురువారం 2-1-2020

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

ఎయిమ్స్‌లో బీఎస్సీ, ఎంఎస్సీ

ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. దేశ అత్యుత్తమ వైద్య విద్యా సంస్థ. ఎయిమ్స్.. ఎంబీబీఎస్‌తోపాటు పలు బ్యాచిలర్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులను అందిస్తోంది. తాజాగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్లను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. అభ్యర్థులకు ఉపయోగపడేలా ఎయిమ్స్ నోటిఫికేషన్ల వివరాలు...

నోటిఫికేషన్



నర్సింగ్ కోర్సులు

- **కోర్సు:** » **బీఎస్సీ(హానర్స్) నర్సింగ్:** ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో వివిధ రకాల సర్జికల్, మెడికల్ పరిస్థితులను అవగాహన చేసుకొని నర్స్‌గా రోగులకు అందించాల్సిన సేవల గురించి బోధిస్తారు. సొంతంగా డెలివరీలు చేయడం, గర్భిణీలు, నవజాత శిశువుల సంరక్షణ తదితరాలపై శిక్షణ ఇస్తారు.
- **కోర్సు:** » **బీఎస్సీ నర్సింగ్(పోస్ట్ బేసిక్):** ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో వ్యక్తులు, కుటుంబాలు, రోగులకు సంబంధించి నర్సింగ్ కేర్‌లో శిక్షణ ఇస్తారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు రక్షణ చర్యలు, వ్యాధుల గురించిన ప్రచారం, వ్యాధుల ఉపశమన చర్యలపై అవగాహన కల్పిస్తారు.

బీఎస్సీ పారామెడికల్ కోర్సులు

- **కోర్సు:** » **బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీ:** ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ప్రాథమిక మెడికల్ సైన్స్ గురించి తెలుసుకుంటారు. ఇందులో భాగంగా హ్యూమన్ బయాలజీని అధ్యయనం చేస్తారు. ఆప్టోమెట్రీ, ఆప్తాల్మాలజీలకు సంబంధించి అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఆప్టిక్స్ గురించి అవగాహన కల్పిస్తారు.
- **కోర్సు:** » **బీఎస్సీ(హానర్స్) మెడికల్ టెక్నాలజీ ఇన్ రేడియోగ్రఫీ.** ఈ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇందులో హ్యూమన్ అనాటమీ, ఫిజియాలజీ అధ్యయనంతో హ్యూమన్ బయాలజీపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఎక్స్-రే రేడియేషన్, ఆల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ వంటి ఇమేజింగ్‌లకు సంబంధించిన భౌతిక నియమాలు తెలుసుకుంటారు.

అర్హతలు

- బీఎస్సీ హానర్స్ నర్సింగ్ కోర్సుకు ప్రవేశానికి ఇంటర్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత పరీక్షలో ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/మ్యాథ్స్/బయాలజీ చదివి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 55 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 50శాతం కనీస ఉత్తీర్ణత ఉండాలి.



- బీఎస్సీ పారామెడికల్ కోర్సులకు 10+2/ఇంటర్‌లో ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతోపాటు బయాలజీ లేదా మ్యాథ్స్‌లో ఒకదాన్ని చదివుండాలి. జనరల్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- బీఎస్సీ పోస్టు బేసిక్‌కు సంబంధించి ఇంటర్, డిప్లొమా ఇన్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీతోపాటు రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్‌గా నమోదు చేసుకొని ఉండాలి.

పీజీ కోర్సులు

- **కోర్సు:** » **ఎంఎస్సీ నర్సింగ్:** ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ నర్సింగ్(పీసీ) /పోస్ట్ బేసిక్(పోస్టు బేసిక్) ఉత్తీర్ణత ఉండాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు కనీస ఉత్తీర్ణత 60 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం తప్పనిసరి.
- **కోర్సు:** » **ఎంఎస్సీ, ఎంఎస్సీ బయోటెక్నాలజీ:** దీనికి దరఖాస్తు చేసుకునేందుకు బీఎస్సీ/ బీవీఎస్సీ/ బీఫార్మా/ ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రంలో 90 ఎంసీక్యూలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు కోత విధిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తులకు చివరి తేదీ:** జనవరి 16, 2020
- **బీఎస్సీ(హానర్స్) నర్సింగ్ :** ప్రవేశ పరీక్షను జూన్28న నిర్వహిస్తారు.
- **బీఎస్సీ నర్సింగ్(పోస్ట్ బేసిక్), బీఎస్సీ(పారామెడికల్):** పోస్ట్ బేసిక్‌కు పరీక్ష జూన్ 6న; బీఎస్సీ పారామెడికల్ కోర్సుల ప్రవేశ పరీక్ష జూన్ 20న ఉంటుంది.
- **ఎంఎస్సీ నర్సింగ్:** ప్రవేశ పరీక్షను జూన్ 6న నిర్వహిస్తారు.
- **ఎంఎస్సీ కోర్సులు, ఎంఎస్సీ బయోటెక్నాలజీ:** ఎంఎస్సీ కోర్సుల ప్రవేశ పరీక్షను జూలై 4న, ఎంఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్షను అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** www.aiimsexams.org

ఎంపిక విధానం

- బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షను కామన్‌గా నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. » ఫిజిక్స్ 30, కెమిస్ట్రీ 30, బయాలజీ 30, జనరల్ నాలెడ్జ్ 10.. ఇలా మొత్తం 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- **బీఎస్సీ పోస్ట్ బేసిక్:** ఈ కోర్సులో ప్రవేశాలకు సంబంధించి రెండంచెల విధానాన్ని అమలుచేస్తున్నారు. తొలిదశలో 70 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ప్రవేశ పరీక్షకు హాజరైన వారిలో నుంచి ఖాళీలకు మూడు రెట్లులో అభ్యర్థులను పర్సనల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. మొత్తంగా రెండు దశల్లో అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా తుది ప్రవేశాలను ఖరారు చేస్తారు.



- బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రి/బీఎస్సీ(హానర్స్) మెడికల్ టెక్నాలజీ ఇన్ రేడియోగ్రఫీ కోర్సులు.. » ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్/బయాలజీల నుంచి 30ప్రశ్నల చొప్పున అడుగుతారు. ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో హిందీ లేదా ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. అభ్యర్థులు పరీక్షకు సంబంధించి మ్యాథ్స్, బయాలజీల నుంచి ఒక విభాగాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

కోల్ ఇండియా కొలువు

నెలకు రూ.50వేల వేతనం

- » 1326 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- » ఆన్‌లైన్ టెస్టు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- » దరఖాస్తులకు చివరితేదీ: 19 జనవరి 2020



నల్ల బంగారు సిరులతో.. దేశానికి వెలుగులు అందించే కోల్ ఇండియా కొలువుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండున్నర లక్షల మందికిపైగా సిబ్బంది కలిగిన ఈ మహారత్న కంపెనీ... 1326 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు నియామకాలు జరపనుంది. ఇంజనీరింగ్, ఎంబీఏ, పీజీ అర్హతతో కోల్ ఇండియాలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్టు, ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపడం ద్వారా బంగారంలాంటి కొలువు సొంతం చేసుకోవచ్చు. ఎంపికైతేశిక్షణ సమయంలోనే నెలకు రూ.50వేల వేతనం పొందే సువర్ణావకాశం లభిస్తుంది. కోల్‌ఇండియాలో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు ఎంపిక ప్రక్రియపై సమగ్ర సమాచారం...

పోస్టు పేరు: మేనేజ్‌మెంట్ ట్రైనీ

- **పోస్టుల వివరాలు:** » మైనింగ్-288 » ఎలక్ట్రికల్-218 » మెకానికల్-258 » సివిల్-68 » కోల్ ప్రిపరేషన్-28 » సిస్టమ్స్-46 » మెటీరియల్స్ మేనేజ్‌మెంట్-28 » ఫైనాన్స్ అండ్ అకౌంట్స్-254 » పర్సనల్ అండ్ హెచ్ఆర్-89 » మార్కెటింగ్ అండ్ సేల్స్-23 » కమ్యూనిటీ డవలప్‌మెంట్-26.

అర్హతలు

- **వయసు:** 30 ఏళ్లు మించరాదు. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్:** సంబంధిత బ్రాంచ్‌లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్)ఉత్తీర్ణత.
- **కోల్ ప్రిపరేషన్:** కనీసం 60 శాతం మార్కులతో కెమికల్/మినరల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ /బీఎస్సీ(ఇంజనీరింగ్) ఉత్తీర్ణత.
- **సిస్టమ్స్:** కనీసం 60 శాతం మార్కులతో కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఐటీ బ్రాంచ్‌ల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్) లేదా కనీసం 60 శాతం మార్కులతో ఎంసీఏ ఉత్తీర్ణత.
- **మెటీరియల్స్ మేనేజ్‌మెంట్:** కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రికల్/మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు రెండేళ్ల ఫుల్‌టైమ్ ఎంబీఏ లేదా రెండేళ్ల మేనేజ్‌మెంట్ పీజీ పూర్తి చేసుండాలి.
- **ఫైనాన్స్ అండ్ అకౌంట్స్:** సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణత.
- **పర్సనల్ అండ్ హెచ్ఆర్:** డిగ్రీతోపాటు కనీసం 60 శాతం మార్కులతో హెచ్ఆర్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల పీజీ/ పీజీ డిప్లొమా/ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసుండాలి. లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ (హెచ్ఆర్ స్పెషలైజేషన్) ఉత్తీర్ణత.
- **మార్కెటింగ్ అండ్ సేల్స్:** డిగ్రీతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి 60 శాతం మార్కులతో రెండేళ్ల ఫుల్ టైమ్ ఎంబీఏ లేదా పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (మార్కెటింగ్ స్పెషలైజేషన్).
- **కమ్యూనిటీ డవలప్‌మెంట్:** కనీసం 60 శాతం మార్కులతో.. కమ్యూనిటీ డవలప్‌మెంట్/రూరల్ డవలప్‌మెంట్/కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డవలప్‌మెంట్ ప్రాక్టీస్/అర్బన్ అండ్ రూరల్ కమ్యూనిటీ డవలప్‌మెంట్/రూరల్ అండ్ ట్రైబల్ డవలప్‌మెంట్/డవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్/రూరల్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల ఫుల్‌టైమ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ/పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా(లేదా) కమ్యూనిటీ డవలప్‌మెంట్/రూరల్ డవలప్‌మెంట్/కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డవలప్‌మెంట్ ప్రాక్టీస్ /అర్బన్ అండ్ రూరల్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ /రూరల్ అండ్ ట్రైబల్ డవలప్‌మెంట్/డవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల ఫుల్‌టైమ్ పీజీ ఉండాలి.
- విద్యార్హత ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం

- ఎంపిక ప్రక్రియలో తొలుత కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ప్రతిభ చూపిన అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు.
- ఆన్‌లైన్ పరీక్షలో మొత్తం రెండు పేపర్లు.. పేపర్-1, పేపర్-2 ఉంటాయి. ఒక్కో పేపర్ 100 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- పేపర్-1లో.. జనరల్ నాలెడ్జ్ / జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లీష్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. పైన పేర్కొన్న ఏ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకైన కూడా పేపర్-1 పరీక్ష కామన్‌గానే నిర్వహిస్తారు. పేపర్-2లో మాత్రం అభ్యర్థి ఏ విభాగం పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారో ఆ విభాగానికి సంబంధించిన ప్రశ్నలను అడుగుతారు.
- ఆన్‌లైన్ పరీక్షలో వంద మార్కులకు జరిగే ప్రతి పేపర్‌లో జనరల్ అభ్యర్థులు కనీసం 40 మార్కులు; ఓబీసీలు 35 మార్కులు; ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు 30 మార్కులు సాధించాలి.

ఇంటర్వ్యూ

- ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులను ఆయా పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలుస్తారు. రిజర్వేషన్ విధానాన్ని అనుసరిస్తారు.
- ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని తుదిఎంపిక చేస్తారు.

వేతనం

- ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఏడాది పాటు మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఈ2గ్రేడ్) హోదాతో పే స్కేల్ రూ.50,000-1,60,000 అందిస్తారు. శిక్షణ సమయంలోనే నెలకు రూ. 50 వేలు వేతనం లభిస్తుంది. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఈ 3 గ్రేడ్ ప్రమోషన్ ఇస్తారు. వీరికి పే స్కేల్ రూ.60,000 -1,80,000 అందుతుంది. దీంతోపాటు ఇతర అన్ని అలవెన్సులు,ప్రోత్సాహకాలు లభిస్తాయి.
- విధుల్లో చేరిన వాళ్లు కనీసం ఐదేళ్లపాటు సంస్థలో పనిచేయడానికి సమ్మతి తెలుపుతూ రూ.3 లక్షల బాండ్‌పై సంతకం చేయాలి. అగ్రిమెంట్ మధ్యలో ఉద్యోగం మానేస్తే రూ.3 లక్షలుచెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తు, ఫీజు

- జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ. 1000 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఎటువంటి దరఖాస్తు ఫీజు లేదు.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** 21.12.2019
- **దరఖాస్తు ముగింపు తేదీ:** 19.01.2020
- **పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 27, 28, 2020
- **వెబ్‌సైట్:** https://www.coalindia.in

కరెంట్ అఫైర్స్

జులై టు డిసెంబర్, 2019

పోటీ పరీక్షల ప్రత్యేకం


జాతీయ, అంతర్జాతీయ అవార్డులు



జాతీయ చలనచిత్ర పురస్కారాలు

66వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం 2019 ఆగస్టు 9న ప్రకటించింది. ఉత్తమ చిత్రం-హెల్లారో(గుజరాతీ), ఉత్తమ నటుడు-ఆయుష్మాన్ ఖురానా(అంధా ధున్), విక్కీ కౌశల్(యూరీ), ఉత్తమ నటి-కీర్తి సురేశ్(మహానటి), ఉత్తమ దర్శకుడు-ఆదిత్య ధర్(యూరీ), ఉత్తమ తెలుగు చిత్రం-మహానటి.

భారత రత్న



భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్నను మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, దివంగత గాయకుడు భూపేన్ హజారికా, దివంగత భారతీయ జనసంఘ్ నాయకుడు నానాజీ దేశ్‌ముఖ్‌లకు 2019 ఆగస్టు 8న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రధానం చేశారు.

అబ్దుల్ కలాం పురస్కారం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ కె.శివన్‌కు తమిళనాడు ప్రభుత్వం అబ్దుల్ కలాం పురస్కారాన్ని ఆగస్టు 15న ప్రకటించింది.

వీర్ చక్ర

భారత వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌కు ఆగస్టు 15న వీర్ చక్రను ప్రధానం చేశారు. ధైర్య సాహసాలకు ఇచ్చే మూడో అత్యున్నత పురస్కారం వీర్ చక్ర.

మంగళంపల్లి బాల మురళీ కృష్ణ పురస్కారం

ప్రముఖ కర్ణాటక సంగీత విద్యాంసురాలు బాంబే జయశ్రీకి 2019 సంవత్సరానికి గాను మంగళంపల్లి బాల మురళీకృష్ణ పురస్కారాన్ని విజయవాడలో ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రదానం చేసింది.

రాజీవ్ గాంధీ ఖేల్ రత్న

అత్యున్నత క్రీడా పురస్కారమైన రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డును బజరంగ్ పూనియా(రెజ్లింగ్), దీపామలిక్(పారా అథ్లెటిక్స్)లకు 2019 ఆగస్టులో ప్రకటించారు.


కాళోజీ పురస్కారం

2019కి గాను కాళోజీ నారాయణరావు పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వర్ రెడ్డికి సెప్టెంబర్ 9న ప్రధానం చేసింది.

సరస్వతి సమ్మాన్

ప్రముఖ తెలుగు కవి కె.శివారెడ్డికి 2018కి గాను ఆయన రచించిన ‘పక్కకి ఒత్తిగిలితే’ అనే కవితా సంపుటికి ఈ పురస్కారం లభించింది. 2019 సెప్టెంబర్ 28న ఈ అవార్డును ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఢిల్లీలో అందజేశారు.

దాదాసాహెబ్ ఫాల్కే



సినీరంగంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును 2018కి గాను ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌కు 2019 సెప్టెంబర్ 24న కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ స్మారకార్థం కాంగ్రెస్ పార్టీ నెలకొల్పిన ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారాన్ని 2017-18కి గాను ప్రముఖ పర్యావరణ వేత్త, సామాజిక ఉద్యమకారుడు చండీ ప్రసాద్ భట్‌కు ప్రదానం చేశారు. ఇందిరా గాంధీ వర్ధంతి అయిన అక్టోబర్ 31న ఈ అవార్డును ఆయనకు అందజేశారు.

ఇన్ఫోసిస్ ప్రైజ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) చీఫ్ సైంటిస్ట్ మంజులా రెడ్డికి ఇన్ఫోసిస్ ప్రైజ్ 2019 నవంబర్‌లో లభించింది. జీవ శాస్త్రంలో ఆమె చేసిన పరిశోధనలకు గాను ఈ గుర్తింపు లభించింది.

పెటా పర్సన్ ఆఫ్ ది ఇయర్

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లిని భారత్‌లో పెటా (పీఈటీఏ-పీపుల్ ఫర్ ద ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ ఎనిమల్స్) పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా 2019 నవంబర్ 20న ప్రకటించారు.

జ్ఞానపీఠ్ అవార్డు

భారత సాహిత్య రంగంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారాన్ని 2019కి గాను మలయాళీ రచయిత అక్కితంకు నవంబర్ 29న ప్రకటించారు. ఆయన పూర్తి పేరు అక్కితం అచ్యుతన్ నంబూద్రి. 55వ జ్ఞానపీఠ్ అవార్డుకు ఆయన్ను ఎంపిక చేశారు.

ఇందిరా గాంధీ శాంతి బహుమతి

బ్రిటన్‌కు చెందిన ప్రకృతి ప్రేమికుడు డేవిడ్ అటెన్‌బరోను 2019కిగాను ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతికి నవంబర్19న ఎంపిక చేశారు. ఈ అవార్డును 2018కి గాను సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) అనే సంస్థకు ప్రధానం చేశారు.

వ్యాస్ సమ్మాన్

ప్రముఖ హిందీ రచయిత్రి నసీరా శర్మ రచించిన ‘కాగజ్ కీ నావ్’ అనే పుస్తకానికి 29వ వ్యాస్ సమ్మాన్ పురస్కారం లభించింది. ఈ అవార్డును కె.కె.బిర్లా ఫౌండేషన్ 2019 నవంబర్ 5న ప్రకటించింది.

సాహిత్య అకాడమీ అవార్డు

2019 సాహిత్య అకాడమీ అవార్డులను డిసెంబర్18న ప్రకటించారు. తెలుగులో బండి నారాయణ స్వామి రచించిన ‘శప్త భూమి’ అనే నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఇంగ్లిష్‌లో ఈ పురస్కారం శశిథరూర్‌కు ‘యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్’ అనే నవలకు దక్కింది.

అంతర్జాతీయ అవార్డులు

రామన్ మెగసెసె అవార్డు



ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసె జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ అవార్డును 2019కిగాను ఎన్‌డీటీవీ ఇండియా ఛానల్ జర్నలిస్టు రవీష్ కుమార్‌కు ఆగస్టు 2న ప్రకటించారు. దీన్ని ఆసియా ఖండ నోబెల్ బహుమతిగా పేర్కొంటారు.

గినీ దేశ అత్యున్నత అవార్డు

ఆఫ్రికా దేశమైన రిపబ్లిక్ ఆఫ్ గినీ అత్యున్నత పురస్కారం ‘నేషనల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్’ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు 2019 ఆగస్టు 3న అందజేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాల మెరుగుదలకు చేసిన కృషికి గాను ఈ అవార్డును మన రాష్ట్రపతికి ప్రకటించారు.

జాయెద్ అవార్డు



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ).. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘ఆర్డర్ ఆఫ్ జాయెద్’తో ప్రధాని నరేంద్ర మోదీని ఆగస్టు 24న సత్కరించింది.

బహ్రెయిన్ అవార్డు

పశ్చిమాసియా దేశమైన బహ్రెయిన్ ఆగస్టు 25న ప్రధాని నరేంద్ర మోదీకి ‘కింగ్ హమద్ ఆర్డర్ ఆఫ్ ద రినేసన్స్’ అవార్డు ప్రదానం చేసింది.

గ్లోబల్ గోల్‌కీపర్ అవార్డు

మెలిండా గేట్స్ ఫౌండేషన్.. ‘గ్లోబల్ గోల్ కీపర్’ అవార్డును ప్రధాని నరేంద్ర మోదీకి 2019 సెప్టెంబర్ 24న అమెరికాలో ప్రదానం చేసింది. స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమానికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రధానికి అందజేశారు.

ఛేంజ్ మేకర్ అవార్డు

రాజస్థాన్‌కు చెందిన పాయల్ జంగిడ్ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేసినందుకుగాను మెలిందా గేట్స్ ఫౌండేషన్ 2019కి గాను ఛేంజ్ మేకర్ అవార్డును ప్రదానం చేసింది.

రైట్ లైవ్‌లీహుడ్ అవార్డు

పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న స్వీడన్‌కు చెందిన పాఠశాల విద్యార్థిని గ్రెటా థున్‌బర్గ్‌కు 2019 రైట్ లైవ్‌లీహుడ్ అవార్డు లభించింది. దీన్నే ‘ప్రత్యామ్నాయ నోబెల్ బహుమతి’ అని కూడా అంటారు.

బుకర్ ప్రైజ్

2019కి గాను బుకర్ ప్రైజ్‌ను లండన్‌లో అక్టోబర్ 14న ప్రకటించారు. కెనడాకు చెందిన మార్గరెట్ అట్‌వుడ్(‘ద టెస్టమెంట్స్’ అనే పుస్తకానికి), బ్రిటన్‌కు చెందిన బెర్నార్డిన్ ఎవ రిస్టో(‘గర్ల్, ఉమన్, అదర్’ అనే పుస్తకానికి) అనే రచయిత్రులకు సంయుక్తంగా ఈ అవార్డు లభించింది.


కొమొరోస్ దేశ అవార్డు

ఆఫ్రికాలోని కొమొరోస్ దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘ద ఆర్డర్ ఆఫ్ ద గ్రీన్ క్రెసెంట్’ను భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు 2019 అక్టోబర్‌లో ప్రదానం చేశారు.

నోబెల్ బహుమతులు

2019 నోబెల్ బహుమతులను అక్టోబర్‌లో ప్రకటించి డిసెంబర్ 10న ప్రదానం చేశారు. వీటితో పాటు 2018 సాహిత్య పురస్కారాన్ని కూడా అందజేశారు.

- » **భౌతిక శాస్త్రం:** జేమ్స్ పీబుల్స్(కెనడా-అమెరికా), మిషెల్ మేయర్(స్విట్జర్లాండ్), డిడియెర్ క్యులోజ్ (స్విట్జర్లాండ్).
- » **రసాయన శాస్త్రం:** జాన్ గుడెనఫ్(అమెరికా), స్టాన్లీ విట్టింగ్‌హామ్(బ్రిటిష్ అమెరికన్), అకిరా యోషినో(జపాన్).
- » **వైద్య శాస్త్రం:** విలియం కేలిన్(అమెరికా), గ్రెగ్ సెమెంజా(అమెరికా), సర్ పీటర్ రాట్‌క్లిఫ్(బ్రిటన్).
- » **సాహిత్యం:** పీటర్ హండ్కే(ఆస్ట్రియా).
- » **శాంతి:** అబీ అహ్మద్ అలీ (ఇథియోపియా ప్రధాని).
- » **ఆర్థిక శాస్త్రం:** అభిజీత్ బెనర్జీ (భారతీయ అమెరికన్), ఎస్తర్ డిఫ్లో (ఫ్రెంచ్ అమెరికన్), మైకెల్ క్రెమెర్(అమెరికా).
- » **2018 సాహిత్యం:** ఓల్గా తొకర్జుక్ (పోలండ్).



అత్యంత ప్రఖ్యాత టీనేజర్

పాకిస్తాన్‌కు చెందిన మలాలా యూసఫ్‌జాయ్‌ను 21వ శతాబ్దపు రెండవ దశకంలో అత్యంత ప్రఖ్యాత టీనేజర్‌గా ఐక్యరాజ్యసమితి 2019 డిసెంబర్ 26న ప్రకటించింది. బాలికల విద్య కోసం కృషి చేసినందుకుగాను మలాలాకు 2014లో నోబెల్ శాంతి బహుమతి లభించింది.

మిస్ వరల్డ్

69వ మిస్ వరల్డ్ అందాల పోటీని లండన్ నగరంలో 2019 డిసెంబర్ 14న నిర్వహించారు. జమైకా యువతి టోనీ-ఆన్ సింగ్ ప్రపంచ సుందరి టైటిల్ గెలుచుకుంది. భారతీయ వనిత సుమన్ రావ్ రెండో రన్నరప్‌గా నిలిచింది.

సఖరోవ్ ప్రైజ్

యూరోపియన్ పార్లమెంట్ సఖరోవ్ ప్రైజ్ విజేతను 2019, అక్టోబర్24న ప్రకటించింది. చైనాలోని యుగుర్ మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్న ఇల్హామ్ తోహ్తి అనే యుగుర్ ఆర్థిక వేత్తకు ఈ ప్రతిష్టాత్మక మానవ హక్కుల బహుమతిని ప్రకటించారు. చైనా ప్రభుత్వం ఆయనకు 2014లో జీవిత ఖైదు విధించింది. జైల్లో ఉన్న ఇల్హామ్ తోహ్తి తరపున ఆయన కూతురు డిసెంబర్ 18న సఖరోవ్ ప్రైజ్‌ను స్వీకరించింది.

మిస్ యూనివర్స్



68వ మిస్ యూనివర్స్ అందాల పోటీని అమెరికాలోని అట్లాంటా నగరంలో 2019 డిసెంబర్ 8న నిర్వహించారు. దక్షిణాఫ్రికాకు చెందిన జొజొబిని టుంజీ విశ్వ సుందరి కిరీటాన్ని గెలుచుకుంది. భారత్‌కు చెందిన వర్తికా సింగ్ టాప్ 20లో చోటు దక్కించుకోగలిగింది.

ఇటాలియన్ గోల్డెన్ శాండ్ అవార్డు

ఒడిశాకు చెందిన ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్‌కు ఇటాలియన్ గోల్డెన్ శాండ్ అవార్డు 2019 నవంబర్‌లో లభించింది.

అంతర్జాతీయ బాలల శాంతి పురస్కారం

నెదర్లాండ్స్‌లోని ద హేగ్‌లో అంతర్జాతీయ బాలల శాంతి పురస్కారాన్ని స్వీడన్‌కు చెందిన గ్రెటా థున్‌బర్గ్‌కు, కామెరూన్‌కు చెందిన దివినా మాలౌమ్ అనే బాలికకు నవంబర్ 21న ప్రదానం చేశారు.

డీ ఎస్ సీ ప్రైజ్

2019 డీ ఎస్ సీ ప్రైజ్ ఫర్ సౌత్ ఏషియన్ లిటరేచర్‌ను డిసెంబర్ 16న ప్రకటించారు. ‘హాఫ్ ద నైట్ ఈజ్ గాన్’ అనే నవలకు గాను భారత రచయిత అమితాబ బాగ్చిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. నేపాల్‌లోని పొఖార నగరంలో జరిగిన నేపాల్ సాహితీ ఉత్సవంలో అమితాబ బాగ్చికి డి ఎస్ సీ ప్రైజ్‌ను అందజేశారు.



ఎన్.విజయేందర్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

శ్రీలంక టి20 జట్టులో మాథ్యూస్ పునరాగమనం



దాదాపు 16 నెలల విరామం తర్వాత ఆల్‌రౌండర్ ఎంజెలో మాథ్యూస్ శ్రీలంక టి20 జట్టులోకి వచ్చాడు. భారత్‌తో ఈనెల 5న మొదలయ్యే మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే శ్రీలంక జట్టును బుధవారం ప్రకటించారు. 16 మంది సభ్యులుగల జట్టుకు లసిత్ మలింగ సారథ్యం వహిస్తాడు. 32 ఏళ్ల మాథ్యూస్ 2018 ఆగస్టులో చివరిసారి టి20 మ్యాచ్ ఆడాడు.

శ్రీలంక టి20 జట్టు: మలింగ (కెప్టెన్), గుణతిలక, అవిష్క ఫెర్నాండో, ఎంజెలో మాథ్యూస్, దసున్ షనక, కుశాల్ పెరీరా, డిక్‌వెల్లా, ధనంజయ డిసిల్వా, ఇసురు ఉడాన, భానుక రాజపక్స, ఒషాడా ఫెర్నాండో, వనిందు హసరంగ, లాహిరు కుమార, కుశాల్ మెండిస్, సందకన్, కసున్ రజిత.

2020లో



అటు టోక్యో... ఇటు టి20

ఈ ఏడాది రెండు ప్రతిష్టాత్మక ఈవెంట్‌లు ● మన ఒలింపిక్ పతకాల సంఖ్య పెరిగేనా? ● రెండో పొట్టి కప్ కోసం టీమిండియా పోరు

ప్రపంచ క్రీడా పటంలో మన స్థానం ఏమిటనేది చూపించే వేదిక ఒకటైతే... జనం మెచ్చిన క్రికెట్ పండుగలో మన బలాన్ని ప్రదర్శించే మైదానం మరొకటి... 'రియో'లో ఒక రజతం, ఒక కాంస్యానికే ఆట ముగించిన భారత బృందం 'టోక్యో'లో ఏం చేస్తుందనేది ఆసక్తికరం! 2007లో మొదటిసారి విజేతగా నిలిచిన తర్వాత మళ్లీ టి20 ఫార్మాట్‌లో ప్రపంచకప్‌ను అందుకోలేక పోయిన 'మెన్ ఇన్ బ్లూ' సత్తాకు ప్రపంచ కప్ పరీక్ష పెట్టనుంది. వార్షిక క్యాలెండర్‌లో ప్రతీ ఏడూ వచ్చే క్రీడా టోర్నీలు ఎన్ని ఉన్నా... ప్రత్యేకంగా నిలిచే వేడుకలు మాత్రం కొన్నే ఉంటాయి. 2020లో అలరించబోతున్న రెండు మెగా ఈవెంట్లలో భారత జట్టు ఆశలు, సవాళ్లను చూస్తే...

–సాక్షి క్రీడా విభాగం

2016లో రియోలో జరిగిన ఒలింపిక్స్‌లో భారత్ 121 మంది సభ్యుల భారీ బృందంతో బరిలోకి దిగింది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు రజతం సాధించగా, మహిళల రెజ్లింగ్‌లో సాక్షి మలిక్ కాంస్యం అందుకుంది. ఇవి మినహా అన్నీ వైఫల్యాలే. పోటీలకు మించి ఎన్నో ఆశలు రేపిన క్రీడాకారులు అసలు పోరుకు వచ్చేసరికి మాత్రం చతికిల పడ్డారు. అంతకుముందు 2012 లండన్ ఒలింపిక్స్‌లో 6 పతకాలతో మెరిసిన తర్వాత నాలుగేళ్లకు ఆ సంఖ్య పెరుగుతుందనుకుంటే పరిస్థితి తిరోగమించింది. 'రియో'తో పోలిస్తే ఈసారి 'టోక్యో'లో పరిస్థితి కొంత మెరుగు కావచ్చనేది అంచనా. గత నాలుగేళ్లలో కొన్ని క్రీడా సమాఖ్యలు ప్రణాళికాబద్ధంగా తమ ఆటగాళ్లను సన్నద్ధం చేసిన తీరు... 'టార్గెట్ ఒలింపిక్ పోడియం' (టాప్) పథకం ద్వారా ప్రభుత్వం ఆటగాళ్లకు అందించిన ఆర్థిక సహకారం కలగలిసి పతకాల రూపంలో కనిపించాలనేది ప్రతీ అభిమాని ఆకాంక్ష.

జపాన్ రాజధాని టోక్యోలో ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు ఒలింపిక్స్ నిర్వహిస్తున్నారు. వేర్వేరు క్రీడాంశాల్లో భారత్ నుంచి ఇప్పటికే 62 మంది క్రీడాకారులు అర్హత సాధించగా... చాలా అంశాల్లో ఇంకా అర్హతకు అవకాశం ఉంది. వాటిలో తుది గడువు ముగిసిపోకపోగా, క్వాలిఫయింగ్ ఈవెంట్లు కూడా జరగాల్సి ఉంది. ప్రస్తుతానికి భారత్ తరఫున 6 క్రీడాంశాలు, 24 ఈవెంట్లలో కలిపి మొత్తం 62 మంది (టీమ్ ఈవెంట్ హాకీ సహా) 'టోక్యో'కు అర్హత సాధించారు. హాకీ కాకుండా ఇందులో ఆర్చరీ, అథ్లెటిక్స్, ఈక్వెస్ట్రియన్, షూటింగ్, రెజ్లింగ్ కూడా ఉన్నాయి.

- 2016కు ముందు వరల్డ్ చాంపియన్‌షిప్, వరల్డ్ కప్‌లలో పతకాలు పండించిన భారత షూటర్లు ఒలింపిక్స్‌కు వచ్చేసరికి బోల్తా పడ్డారు. అయితే ఈసారి కూడా భారత షూటర్లు ఇటీవల సాధించిన విజయాలు ఆశలు రేపుతున్నాయి. ఇప్పుడైనా వారు అదే జోరు కొనసాగిస్తే కచ్చితంగా పతకాలు అందించే ఆటల జాబితాలో షూటింగ్ ఉంటుంది. రికార్డు స్థాయిలో ఇప్పటికే 10 ఈవెంట్లలో 15 మంది క్వాలిఫై కావడం విశేషం. వీరిలో మను భాకర్, సౌరభ్ చౌదరి, తేజస్విని సావంత్‌లపై మంచి అంచనాలు ఉన్నాయి.
- ఒలింపిక్స్ చరిత్రలో రెండు వ్యక్తిగత పతకాలు సాధించిన ఏకైక భారత క్రీడాకారుడు, స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్, కాంస్యం గెలిచిన యోగేశ్వర్ దత్‌ల బాటలో 'టోక్యో'లో రెజ్లింగ్‌పై అభిమానులు నమ్మకం ఉంచుతున్నారు. ఇప్పటికే క్వాలిఫై అయిన బజరంగ్ పూనియా (65 కేజీలు), దీపక్ పూనియా (86 కేజీలు), రవి దహియా (57 కేజీలు), వినేశ్ ఫొగాట్ (మహిళల 53 కేజీలు) దేశానికి పతకం సాధిస్తే రెజ్లింగ్ గౌరవం మరింత పెరుగుతుంది.
- మహిళల హాకీ జట్టు విషయంలో సందేహాలు ఉన్నా... పురుషుల హాకీ జట్టుకు పతకం సాధించగల సత్తా ఉందనేది సగటు అభిమాని నమ్మకం. హాకీ జట్టు 'డ్రా' కూడా మనకు అనుకూలంగానే ఉంది. 1980 ఒలింపిక్స్ తర్వాతి నుంచి హాకీలో పతకం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న భారత్‌కు ఈ సారైనా ఆ కోరిక తీరుతుందేమో చూడాలి.
- ఇక బ్యాడ్మింటన్ విషయానికి వస్తే మరోసారి పీవీ సింధుపైనే ఆశలు ఉన్నాయి. అయితే ఆమెతో పాటు చాలా సందర్భాల్లో కోచ్ పుల్లెల గోపీచంద్ చెప్పిన విధంగా ఈసారి ప్రత్యర్థులు సింధు గత మ్యాచ్‌లను బట్టి సన్నద్ధమై వస్తారు కాబట్టి ఆమె మరింత శ్రమించక తప్పదు. వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత సింధుకు ఎదురైన పరాజయాలు ఆ దిశగా ఒక హెచ్చరికగా చెప్పవచ్చు. సైనా ఇటీవలి ప్రదర్శన, ఫిట్‌నెస్‌ను బట్టి చూస్తే ఆమెపై అంచనాలు కష్టమే. పురుషుల విభాగంలోనూ శ్రీకాంత్ పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. అయితే సాయిప్రణీత్ అర్హత సాధిస్తే భారత్ పతకం గురించి ఆశలు పెట్టుకోవచ్చు. ఇక పురుషుల డబుల్స్‌లోనూ సాత్విక్–చిరాగ్ జోడి సంచలనం సృష్టిస్తుందేమో చూడాలి.
- బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ కూడా పతకాలు సాధించగల స్థాయి ఉన్న క్రీడాంశాలు. టెన్నిస్‌లో మన ఆటగాళ్ల ర్యాంకింగ్‌ను బట్టి ఒక అంచనాకు రావచ్చు. మరోవైపు ఎప్పటిలాగే అథ్లెటిక్స్‌లో ఆశలు, అంచనాలు తక్కువే ఉన్నాయి. 'నడక'లో ఇర్ఫాన్, స్టీపుల్‌ఛేజ్‌లో అవినాశ్‌లతో పాటు 4X400 మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ అర్హత సాధించింది. కానీ ఇందులో ఎవరైనా ఫైనల్ చేరినా గొప్పే. ఏ రకంగానైనా 'రియో'లో మన ప్రదర్శన వైఫల్యం కిందే లెక్క. దానితో పోల్చుకోకుండా 2012 ఒలింపిక్స్ ఆరు పతకాల ఘనతను అధిగమించగలిగితే భారత్ అద్భుతం చేసినట్లే.



రెజ్లర్ బజరంగ్



భారత్ అనామక జట్టుగా బరిలోకి దిగిన తొలిసారి 2007లో టి20 ప్రపంచ కప్ విజేతగా నిలిచింది. ఆ తర్వాత ఐదు పొట్టి ప్రపంచ కప్‌లు జరిగినా మన చేతికి అది చిక్కలేదు. 2008లో ఐపీఎల్ వచ్చి టీమిండియా ఆటగాళ్లంతా స్టార్లుగా, టి20 ఫార్మాట్‌లో రాజులుగా మారిపోయిన తర్వాత కూడా గెలుపు సాధ్యం కాలేదు. 2014లో ఫైనల్, 2016లో సొంతగడ్డపై సెమీస్ చేరిన భారత్... మిగిలిన మూడు సందర్భాల్లో లీగ్ దశకే పరిమితమైంది. నాలుగేళ్ల విరామం తర్వాత 2020లో మళ్లీ 20–20 ప్రపంచ కప్‌కు రంగం సిద్ధమైంది. అక్టోబరు 18 నుంచి నవంబర్ 15 వరకు ఆస్ట్రేలియాలో ఈ మెగా టోర్నీ జరగనుంది.

- వరల్డ్ నంబర్‌వన్ బ్యాట్స్‌మన్, అలవోకగా సిక్సర్లు కొట్టగల ఓపెనర్‌లకు తోడు యువ ఆటగాళ్ల బృందంతో ప్రస్తుత భారత టి20 జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత ఐసీసీ టీమ్ ర్యాంకుల్లో టీమిండియా ఐదో స్థానంలో ఉంది. మన జట్టు ఎక్కువ మ్యాచ్‌లు ఆడకపోవడం కూడా దీనికి ఒక కారణం. ఓవరాల్ టి20 రికార్డు సాధారణంగానే ఉన్నా... తాజా ఫామ్ ప్రకారం చూస్తే కోహ్లి సేనను ఫేవరెట్‌గా పేర్కొనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా తర్వాత టైటిల్ గెలిచే సత్తా భారత్‌కు మాత్రమే ఉందనేది విశ్లేషకుల మాట. కోహ్లి, రోహిత్‌లతో పాటు రాహుల్ ఈ ఫార్మాట్‌లో ప్రమాదకర ఆటగాడిగా మారాడు. రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లాంటి దూకుడైన కుర్రాళ్లకు టి20ల్లో ఆకాశమే హద్దు. గాయాల నుంచి కోలుకొని హార్దిక్ పాండ్యా జట్టులో చేరితే మన ఆల్‌రౌండ్ బలగానికి తిరుగుండదు. అతను పునరాగమనం చేయలేకపోతే శివమ్ దూబే రూపంలో మరో ఆటగాడు మనకు అందుబాటులో ఉంటాడు. బౌలింగ్‌లో మన పేసర్ల గాయాలు కొంత ఆందోళన కలిగించినా... వరల్డ్ కప్ సమయానికి అన్నీ సర్దుకోవచ్చు. బుమ్రాలాంటి వరల్డ్ క్లాస్ పేసర్ భారత దళాన్ని నడిపించనుండగా, యువ ఆటగాళ్లు దీపక్ చాహర్, నవదీప్ సైనీలు జట్టులో భాగంగా ఉండవచ్చు. 15 మంది సభ్యుల జట్టులో ఎవరెవరు ఖాయమనేది ఇప్పుడే చెప్పలేకపోయినా గాయం నుంచి కోలుకుంటే భువనేశ్వర్‌కు చోటు ఉండటం ఖాయం. టి20ల్లో రికార్డు గొప్పగా లేకపోయినా, ఆస్ట్రేలియా బౌన్సీ వికెట్‌లపై షమీ అత్యంత విలువైన బౌలర్‌గా మారగలడు.
- ఆస్ట్రేలియాలో తొలిసారి టి20 ప్రపంచ కప్ జరగబోతోంది. అక్కడి పెద్ద మైదానాలు బ్యాట్స్‌మెన్‌కు పరీక్షగా నిలవడం ఖాయం. ఐపీఎల్‌లో వీరబాదుడు బాది ఉత్సాహంగా ఆసీస్ గడ్డపై అడుగు పెడితే లెక్క తప్పవచ్చు. ఇక్కడ అలవోకగా సిక్సర్‌గా మారిన బంతులు అక్కడ బౌండరీకి చాలా ముందే క్యాచ్‌లుగా మారే అవకాశం ఉంది. కాబట్టి దాని కోసం కుర్రాళ్లకు ప్రత్యేక సన్నద్ధత అవసరం. అయితే మైదానం ఎలాంటిదైనా పది సీట్ల అవతలకు కొట్టే సామర్థ్యం ఉందని రోహిత్ చాలా సార్లు నిరూపించాడు కాబట్టి అతని స్థాయికి ఇది సమస్య కాకపోవచ్చు. అన్నింటికి మించి ధోని ఈ మెగా టోర్నీ వరకు ఆడతాడా అనేది అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రశ్న. దీనిపై ఇంకా స్పష్టత లేకున్నా, అతని అనుభవం ఆసీస్‌లో పనికొస్తుందని భావిస్తే చివరిసారిగా ఎంపిక చేయవచ్చు కూడా. భారత్ ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై అదే జట్టు ప్రత్యర్థిగా ద్వైపాక్షిక సిరీస్‌లలో 9 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 5 గెలిచి 3 ఓడింది. అంటే ప్రదర్శన బాగానే ఉన్నట్లు. ఇందులో 2015–16 టూర్‌లో భాగంగా జరిగిన 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తో గెలుచుకోవడం ఎప్పటికైనా స్ఫూర్తినిచ్చే అంశమే!

పట్టుదల, కృషితోనే లక్ష్య సాధన: హంపి

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌కు ఘనస్వాగతం



సాక్షి, గన్నవరం: వర్ధమాన క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ప్రపంచ ర్యాపిడ్ మహిళల చెస్ చాంపియన్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తెలిపింది. మహిళల విభాగంలో భారత నంబర్‌వన్‌గా ఉన్న 32 ఏళ్ల హంపి రష్యాలో గతవారం జరిగిన ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో మహిళల ర్యాపిడ్ విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చెస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన హంపి బుధవారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ చేరుకుంది. ఆమెకు గన్నవరం విమానాశ్రయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్), ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. 'శాప్' నుంచి స్పోర్ట్స్ డైరెక్టర్ రమణ, ఓఎస్‌డీ రామకృష్ణ, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జీ.మధుసూదనరావు... ఏపీఓఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రావు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు శ్రీహరి, నామిశెట్టి వెంకటేశ్వరరావు, ధనియాల నాగరాజు, చెరుకూరి సత్యనారాయణ, అర్జా పాండురంగారావు, ఆర్చరీ క్రీడాకారిణి చెరుకూరి డాలీ, హంపి భర్త దాసరి అన్వేష్, తల్లిదండ్రులు కోనేరు అశోక్, లత తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో హంపి మీడియాతో మాట్లాడింది. 'తండ్రి అశోక్ నిరంతరం ఇచ్చే విలువైన సూచనలతో చెస్‌లో ఉన్నతస్థితికి చేరుకున్నాను. ఆయన శిక్షణలో మరింతగా రాటుదేలి భవిష్యత్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాను. భర్త అన్వేష్ ఎల్లవేళలా ప్రోత్సహిస్తున్నారు. కుటుంబసభ్యుల సంపూర్ణ సహకారంతోనే చెస్‌లో పునరాగమనం చేయగలిగాను. ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించాను. క్లాసికల్ విభాగంలో విశ్వవిజేతగా నిలువడమే తదుపరి లక్ష్యం' అని హంపి వ్యాఖ్యానించింది.

విమర్శలను పట్టించుకోను

రెండో ఒలింపిక్ పతకమే లక్ష్యంగా సాధన ● షట్లర్ పీవీ సింధు వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తర్వాత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ఆడిన ప్రతీ టోర్నీలోనూ ఆమె విఫలమైంది. అయితే తనపై వస్తున్న విమర్శలను పట్టించుకోనని, టోక్యో ఒలింపిక్స్‌లో మరో పతకమే లక్ష్యంగా శ్రమిస్తున్నానని సింధు వ్యాఖ్యానించింది. 'వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత వచ్చిన వరుస పరాజయాలతో నేను కుంగిపోలేదు. సానుకూలంగానే ఉన్నా. ప్రతీసారి గెలవడం సాధ్యం కాదు. కొన్ని సార్లు అద్భుతంగా ఆడితే మరి కొన్ని సార్లు తప్పులు జరుగుతాయి. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు వెళ్లాల్సిందే' అని సింధు పేర్కొంది. అంచనాలను అందుకునే క్రమంలో ఒత్తిడి పెంచుకోనని కూడా సింధు అభిప్రాయపడింది. 'నాపై ఎన్నో అంచనాలు ఉంటాయని నాకూ తెలుసు. అయితే ఒత్తిడి, విమర్శలు నాపై ప్రభావం చూపవు. నా టెక్నిక్‌లో కొన్ని లోపాలను సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టా. రెండో ఒలింపిక్ పతకం సాధించాలనే లక్ష్యంపైనే దృష్టి పెట్టా' అని ఆమె చెప్పింది. ఈనెల 7న మొదలయ్యే మలేసియా మాస్టర్స్ ఓపెన్‌తో ఈ ఏడాదిని మొదలు పెట్టబోతున్న సింధు 20 నుంచి జరిగే ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో కూడా ఆడనుంది. సైనా, శ్రీకాంత్‌వంటి షట్లర్లు పీబీఎల్‌కు దూరమైనా ఆమె మాత్రం టోర్నీ బరిలోకి దిగుతోంది. సొంత ప్రేక్షకులు, అభిమానుల సమక్షంలో ఆడటాన్ని తాను ఆస్వాదిస్తానని, పైగా యువ షట్లర్లకు స్ఫూర్తిగా నిలిచినట్లు కూడా ఉంటుంది కాబట్టి పీబీఎల్‌కు దూరం కానని ఈ లీగ్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు ఆడనున్న సింధు స్పష్టం చేసింది.

సెర్బియా నటితో హార్దిక్ పాండ్యా నిశ్చితార్థం



ముంబై: భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యా త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ముంబైలో స్థిరపడ్డ సెర్బియా నటి, మోడల్ నటాషా స్టాన్‌కోవిచ్‌ను హార్దిక్ వివాహం చేసుకోనున్నాడు. కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా దుబాయ్‌లో మంగళవారం స్పీడ్ బోట్‌లో విహరిస్తూ వీరిద్దరు తమ నిశ్చితార్థం విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. 'నా మెరుపుతీగతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నాను' అని హార్దిక్ పాండ్యా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఫొటోలు పోస్ట్ చేశాడు. హార్దిక్ వెంట బోట్‌లో అతని సోదరుడు కృనాల్ పాండ్యా, అతని భార్య పంఖురి కూడా ఉన్నారు.

27 ఏళ్ల నటాషా 2012లో ముంబైకి వచ్చింది. కొన్ని విఖ్యాత బ్రాండ్‌లకు చెందిన వాణిజ్య ప్రకటనల్లో నటించింది. 2013లో ప్రకాశ్ ఝా దర్శకత్వంలో సత్యాగ్రహ సినిమాలో నటించింది. ఆ తర్వాత మరో డజను సినిమాల్లో అతిథి పాత్రల్లో కనిపించింది. 2014లో బిగ్ బాస్–8లో... 2019లో నచ్ బలియే డ్యాన్స్ షోలో పాలుపంచుకుంది.

మరోవైపు 26 ఏళ్ల హార్దిక్ గతేడాది దర్శక, నిర్మాత కరణ్ జోహార్ టీవీ కార్యక్రమంలో పాల్గొని మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి బీసీసీఐ ద్వారా నిషేధానికి గురయ్యాడు. బేషరతు క్షమాపణలు చెప్పాక హార్దిక్‌పై నిషేధం ఎత్తి వేశారు. గత సెప్టెంబర్‌లో దక్షిణాఫ్రికాతో సిరీస్ తర్వాత వెన్ను నొప్పితో హార్దిక్ ఆటకు దూరమయ్యాడు. లండన్‌లో శస్త్రచికిత్స కూడా చేయించుకున్నాడు. ఇటీవలే మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. న్యూజిలాండ్ 'ఎ'తో త్వరలో జరిగే సిరీస్‌లో పాల్గొనే భారత 'ఎ' జట్టులో ఎంపికయ్యాడు.

భారత యువ క్రికెటర్ మన్‌జ్యోత్ కాల్రాపై ఏడాది నిషేధం

తప్పుడు వయసు చూపించినందుకు ఢిల్లీ క్రికెట్ సంఘం చర్య



న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం న్యూజిలాండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో సెంచరీతో భారత్‌ను గెలిపించిన ఓపెనర్ మన్‌జ్యోత్ కాల్రాపై... రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఆడకుండా ఢిల్లీ జిల్లా క్రికెట్ సంఘం (డీడీసీఏ) ఏడాదిపాటు నిషేధం విధించింది. దేశవాళీ అండర్–16, అండర్–19 వయో విభాగాల్లో ఆడిన సమయంలో కాల్రా అసలు వయసుకంటే తక్కువ వయసు చూపి జట్లలోకి ఎంపికయ్యాడని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు తప్పని కాల్రా రుజువు చేయలేకపోయాడు. దాంతో కాల్రాపై ఏజ్ గ్రూప్ క్రికెట్ ఆడకుండా రెండేళ్లు... రంజీ ట్రోఫీ ఆడకుండా ఏడాదిపాటు నిషేధం విధిస్తున్నట్లు డీడీసీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ (రిటైర్డ్) బదర్ దురేజ్ ప్రకటించారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి రికార్డుల ప్రకారం మన్‌జ్యోత్ కాల్రా ప్రస్తుత వయస్సు 20 ఏళ్ల 351 రోజులుగా ఉంది. ఇటీవలే అండర్–23 క్రికెట్ టోర్నీలో బెంగాల్‌తో మ్యాచ్‌లో కాల్రా 80 పరుగులు చేశాడు. ఓపెనర్ ధావన్ లంకతో టి20 సిరీస్‌కు ఎంపిక కావడంతో అతని స్థానంలో కాల్రా ఢిల్లీ జట్టులోకి రావడం ఖాయమైంది. అయితే అంబుడ్స్‌మన్ తాజా నిర్ణయంతో కాల్రా ఎలాంటి క్రికెట్ ఆడే అవకాశం లేకుండా పోయింది.

'టోక్యో'లో ఫైనల్ చేరే సత్తా మాకుంది: మన్‌ప్రీత్



న్యూఢిల్లీ: ఈ ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరే సత్తా భారత పురుషుల హాకీ జట్టుకు ఉందని సారథి మన్‌ప్రీత్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఇందుకోసం భారత జట్టు క్రమశిక్షణ, నిలకడ ప్రదర్శించాలని ఆయన పేర్కొన్నాడు. '2019 సంవత్సరాన్ని విశ్లేషిస్తే... భారత జట్టుకు గొప్పగా గడిచింది. మేము గత ఏడాదిని 5వ ర్యాంకుతో ఆరంభించి అదే ర్యాంకుతో ముగించాం. మేము జట్టుగా సాధించిన అతి పెద్ద విజయం ఏదైనా ఉందంటే అది ఒలింపిక్స్‌కు అర్హత సాధించటమే. ప్రస్తుతం మా ముందున్న లక్ష్యం... ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరటమే... నమ్మండి అది సాధించగల లక్ష్యమే...' అంటూ మన్‌ప్రీత్ పేర్కొన్నాడు.

సాక్షి బిజినెస్
గురువారం
2-1-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
52 ▲	14 ▲
41,306	12,183

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (మంగళవారం ముగింపు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	8,973	▲ 27
డోజోన్స్	28,538	▲ 76
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,542	▼ 45
డాక్స్	13,249	▼ 88
షాంఘై	3,050	▲ 10
నికాయ్ (సోమవారం ముగింపు)	23,657	▼ 181

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.33	72.61
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	93.19	96.33
€	యూరో	థామస్‌కుక్	78.92	81.62
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	62.00	75.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	49.14	51.14
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	52.10	54.34
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.20	19.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.93	19.93
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.60	11.02

ఏటీఎఫ్, వంట గ్యాస్ ధరలకు రెక్కలు

- ఏటీఎఫ్ ధరలు 2.6 శాతం పెంపు
- సబ్సిడీలేని గ్యాస్ సిలిండర్‌పై రూ.19 పెంపు



న్యూఢిల్లీ: విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలతో పాటు, వంటగ్యాస్‌కు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు పెరిగాయి. అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు రేట్లను సవరించాయి. ఫలితంగా ఢిల్లీలో ఏటీఎఫ్ కిలో లీటర్ ధర రూ.1,637 పెరిగి రూ.64,324 అయింది. నెల వ్యవధిలో ఏటీఎఫ్ ధరలను పెంచడం రెండోసారి. డిసెంబర్ 1న కూడా కిలోలీటర్‌పై రూ.14 వరకు పెరిగింది. తాజా సవరణతో ఏటీఎఫ్ ధరలు 2019 జూన్ తర్వాత గరిష్ట స్థాయికి చేరాయి. తీవ్ర పోటీ వాతావరణం, టికెట్ చార్జీల పెంపు విషయంలో పరిమితులతో నష్టాలను చవిచూస్తున్న ఎయిర్‌లైన్స్ కంపెనీలకు ఇంధన ధరల పెరుగుదల ప్రతికూలం కానుంది.

రూ.714కు ఎల్‌పీజీ సిలిండర్
సబ్సిడీ లేని 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.695 నుంచి రూ.714కు ఆయిల్ సంస్థలు పెంచేశాయి. గత సెప్టెంబర్ నుంచి వరుసగా నాన్ సబ్సిడీ ఎల్‌పీజీ సిలిండర్ ధర పెరుగుతూనే ఉండడం గమనార్హం. గడిచిన ఐదు నెలల్లో సబ్సిడీ లేని ఒక్కో సిలిండర్ ధర నికరంగా రూ.139.50 పెరిగింది. ఒక ఏడాదిలో ఒక వినియోగదారుడు 12 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లకు అర్హులు. ఆ తర్వాత కొనుగోలు చేసే సిలిండర్లకు మార్కెట్ ధరను చెల్లించాల్సి ఉంటుంది. గడిచిన నెలలో అంతర్జాతీయ రేట్ల సగటు ఆధారంగా మరుసటి నెల మొదటి తారీఖున ఏటీఎఫ్, ఎల్‌పీజీ ధరలను పెంచడం జరుగుతోంది. ఇక ప్రజా పంపిణీ ద్వారా సరఫరా చేసే లీటర్ కిరోసిన్ ధర 26 పైసలు పెరిగి ముంబైలో రూ.35.58కు చేరింది. కిరోసిన్‌పై సబ్సిడీ పూర్తిగా తొలగిపోయే వరకు ప్రతీ నెలా 26 పైసల పెంపునకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన విషయం గమనార్హం.

మళ్లీ రూ. లక్ష కోట్లు దాటిన జీఎస్‌టీ వసూళ్లు

డిసెంబర్‌లో రూ. 1.03 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వినియోగం పుంజుకుంటోందనడానికి నిదర్శనంగా వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. వరుసగా రెండో నెలలో రూ. 1 లక్ష కోట్ల మైలురాయిని దాటాయి. డిసెంబర్‌లో రూ. 1,03,184 కోట్ల మేర జీఎస్‌టీ వసూళ్లు నమోదయ్యాయి. అంతక్రితం నవంబర్ నెలలో ఈ వసూళ్లు రూ. 1,03,492 కోట్లు. గతేడాది జూలైలో రూ. 1.02 లక్షల కోట్లు నమోదు కాగా, 2018 డిసెంబర్‌లో రూ. 94,726 కోట్లు వసూలయ్యాయి. నిబంధనలను పాటించే విధానం, వినియోగం మెరుగుపడుతున్నాయనడానికి తాజా గణాంకాలు నిదర్శనమని అధికార వర్గాలు తెలిపాయి. 2018 డిసెంబర్‌తో పోలిస్తే గతేడాది డిసెంబర్‌లో దేశీయంగా లావాదేవీలపై జీఎస్‌టీ వసూళ్లు 16 శాతం వృద్ధి నమోదు చేశాయి. డిసెంబర్‌లో వసూలైన రూ. 1,03,184 కోట్లలో .. సీజీఎస్‌టీ భాగం రూ. 19,962 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ. 26,792 కోట్లు, ఐజీఎస్‌టీ రూ. 48,099 కోట్లు, సెస్సు రూ. 8,331 కోట్లుగా ఉన్నాయి. ద్రవ్య లోటు కట్టడీలో ఉండాలంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా నెలల్లో కూడా ఇదే తరహాలో వసూళ్లు కొనసాగాల్సి ఉంటుందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి అభిప్రాయపడ్డారు. వార్షిక లక్ష్యం స్థాయిని అందుకోలేకపోయినా.. ఇక నుంచి వసూళ్లు స్థిరంగా మెరుగుపడవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా కాలంలో ప్రతి నెలా రూ. లక్ష కోట్ల జీఎస్‌టీ వసూళ్ల లక్ష్యాన్ని కేంద్రం నిర్దేశించుకుంది.

అసెట్స్ విక్రయంలో బీఎస్‌ఎన్‌ఎల్

రూ. 300 కోట్ల సమీకరణపై కసరత్తు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అసెట్స్ విక్రయం ద్వారా దాదాపు రూ. 300 కోట్లు సమీకరించడంపై ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా నిర్దిష్ట భూములను విక్రయించేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) తదితర సంస్థలతో చర్చలు జరుపుతోందని టెలికం శాఖ (డాట్) సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రభుత్వ రంగానికి చెందిన మరో టెల్కో ఎంటీఎన్ఎల్ ప్రవేశపెట్టిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకానికి మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. దీనితో బీఎస్ఎన్ఎల్ జీతాల బిల్లు 50శాతం, ఎంటీఎన్ఎల్ బిల్లు 75 శాతం మేర తగ్గుతుందని అధికారి వివరించారు. బాండ్ల ద్వారా సుమారు రూ. 15,000 కోట్లు సమీకరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పూచీకత్తునివ్వనుందని పేర్కొన్నారు. దీనికి ఆర్థిక శాఖ అనుమతులు వస్తే జనవరి లేదా ఫిబ్రవరిలో సమీకరణ జరిపే అవకాశం ఉందని అధికారి చెప్పారు. ఈ నిధులను రుణాల చెల్లింపు, పెట్టుబడుల కోసం వినియోగించనున్నట్లు వివరించారు.

రూపాయి శుభారంభం

14 పైసలు అప్



ముంబై: కొత్త ఏడాదిలో రూపాయి శుభారంభం చేసింది. బుధవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 14 పైసలు లాభపడి 71.22 వద్ద ముగిసింది. స్థూల ఆర్థిక గణాంకాలు మెరుగ్గా ఉండటం, అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఒప్పందంపై సానుకూల అంచనాలు వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంటుకు దోహదపడ్డాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

వచ్చేసింది.. జియోమార్ట్

ఆన్‌లైన్ కిరాణా వ్యాపారంలోకి రిలయన్స్

- ప్రాథమికంగా ముంబైలో కార్యకలాపాలు షురూ
- త్వరలో దేశవ్యాప్తంగా విస్తరణ
- ఈ–కామర్స్ దిగ్గజాలతో ఢీ..



ముంబై: చమురు నుంచి టెలికం దాకా వివిధ వ్యాపార విభాగాల్లోకి విస్తరించిన దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) తాజాగా ఆన్‌లైన్ కిరాణా వ్యాపార విభాగంలోకి కూడా ప్రవేశించింది. జియోమార్ట్ పేరిట ఈ–కామర్స్ వెంచర్‌ను ప్రారంభించింది. ప్రాథమికంగా ముంబైలోని నవీ–ముంబై, థానే, కల్యాణ్ ప్రాంతాల్లో ప్రారంభించిన కార్యకలాపాలను త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించనుంది. ఆఫ్‌లైన్–టు–ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా 50,000 పైచిలుకు నిత్యావసర ఉత్పత్తులను విక్రయించనుంది. కనీస ఆర్డరు నిబంధనలేవీ లేకుండానే ఉచిత హోమ్ డెలివరీ సర్వీసులు కూడా అందించనున్నట్లు జియోమార్ట్ తన పోర్టల్‌లో పేర్కొంది. ప్రాథమికంగా ప్రారంభించిన సర్వీసులకు సబ్‌స్క్రయిబ్ చేసుకోవాలని, తొలి ఆర్డరుపై రూ, 3,000 దాకా పొదుపు చేసుకోవచ్చని ముంబైలోని జియో మొబైల్ యూజర్లను జియోమార్ట్ ఆహ్వానిస్తోంది. జియోమార్ట్ సర్వీసులకు సంబంధించి త్వరలోనే ప్రత్యేక మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రానుంది. దీన్ని మై జియో, జియో మనీ యాప్‌లతో అనుసంధానించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఏడాదిగా కసరత్తు..: కమ్యూనికేషన్, కంటెంట్, కామర్స్ అనే మూడు వ్యాపార విభాగాల్లో విస్తరించే వ్యూహంతో రిలయన్స్ ముందుకెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జియో ద్వారా టెలికం రంగంలో సంచలనం సృష్టించింది. 2016లో జియోని ప్రవేశ పెట్టిన తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్, మ్యూజిక్, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, టీవీ వంటి డిజిటల్ సర్వీసులను భారీగా విస్తరిస్తోంది. అదే విధంగా జియోమార్ట్ ద్వారా ఈ–కామర్స్ విభాగంలోనూ సంచలనాలు సృష్టించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా తమ ఇంటర్నెట్ ఆధారిత పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) డివైజ్‌ల ఊతంతో ఏడాది కాలం పైగా.. కిరాణా స్టోర్స్‌ను క్రమంగా తమ ప్లాట్‌ఫాంలో చేర్చుకుంటూ వస్తోంది. ఒక్క నవీ ముంబై ప్రాంతంలోనే ఏకంగా 10,000కు పైగా కిరాణా వ్యాపారులు ఇందులో చేరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కిరాణా వ్యాపారులు నమోదు చేసుకున్నప్పటికీ.. ఇన్‌ఫ్రాపరమైన సౌలభ్యత కారణం గా ముంబైలో ముందుగా ప్రయోగాత్మకంగా కార్యకలాపాలు ప్రారంభించినట్లు వివరించాయి. కిరాణా వ్యాపారులు తమ స్టోర్‌లోని ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచడానికి, కొత్త స్టాక్స్‌కు ఆర్డర్లివ్వడానికి, కస్టమర్లకు ఆఫర్లు పంపడానికి, ఆన్‌లైన్ విక్రయా ల నిర్వహణకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది.

అమెజాన్.. బిగ్‌బాస్కెట్‌లకు పోటీ...

రిలయన్స్ ఈ–కామర్స్ అరంగేట్రంపై ఏడాదిగా ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. జియో, రిలయన్స్ రిటైల్ ఊతంతో కొత్త ఈ–కామర్స్ వ్యాపార విభాగంపై కసరత్తు చేస్తున్నట్లు గతేడాది వైబ్రంట్ గుజరాత్ సదస్సులో రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ వెల్లడించినప్పట్నుంచీ.. దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వాస్తవానికి ఆర్ఐఎల్ ఇప్పటికే ఏజియోడాట్‌కామ్ అనే ఫ్యాషన్ సైట్ ద్వారా, రిలయన్స్ డిజిటల్ ఆన్‌లైన్ స్టోర్ ద్వారా ఈ–కామర్స్ విభాగంలో కార్యకలాపాలు సాగిస్తోంది. తాజా జియోమార్ట్ .. దానికి కొనసాగింపుగా పూర్తి స్థాయి ఈ–కామర్స్ వెంచర్ కానుంది. గతంలో టెలికం రంగంలో జియో ఎంట్రీ తరహాలోనే.. ఈ–కామర్స్‌లో జియోమార్ట్ కూడా పెను సంచలనాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. దిగ్గజాలుగా ఎదిగిన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ–కామర్స్ సంస్థలతో పాటు బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్ వంటి ఆన్‌లైన్ గ్రాసరీ సంస్థలకు కూడా గట్టి పోటీదారుగా మారవచ్చని అంచనాలు ఉన్నాయి. అయితే, ఇందుకోసం మిగతా ప్రత్యర్థి సంస్థల కన్నా మరిన్ని ప్రయోజనాలను కిరాణా వ్యాపారులకు అందించాల్సి ఉంటుందని పరిశ్రమవర్గాలు తెలిపాయి. చౌకగా ఉత్పత్తుల సరఫరా, మర్చంట్ డిస్కౌంట్ రేటు(ఎండీఆర్) మినహాయింపునివ్వడం వంటివి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. అన్నింటికన్నా ముఖ్యంగా తమ దగ్గరున్న ఉత్పత్తులు, నిల్వల గురించి కచ్చితమైన వివరాలు అందించేలా వ్యాపారులను ఒప్పించ డం ఒకింత సవాలుగా ఉండవచ్చని తెలిపాయి.

మెడికల్ టూరిజంతో ఎకానమీకి ఊతం..


'అపోలో హాస్పిటల్స్' సంగీతా రెడ్డి



న్యూఢిల్లీ: భవిష్యత్‌లో అందుబాటు ధరల్లో వైద్య సేవలందించే మెడికల్ టూరిజం కేంద్రంగా భారత్ ఎదగనుందని, దేశ ఎకానమీకి ఈ విభాగం తోడ్పాటు గణనీయంగా ఉండబోతోందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి చెప్పారు. ఈ నేపథ్యంలో తమ పోర్ట్‌ఫోలియోలో ఇది కూడా కీలకం కానుందని ఆమె తెలిపారు. శరవేగంగా వృద్ధి చెందుతున్న ఈ విభాగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రత్యేకంగా అంతర్జాతీయ పేషంట్ల విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో దీని ద్వారా దాదాపు 2 లక్షల మంది రోగులకు చికిత్స అందించినట్లు వివరించారు. ఎక్కువ మంది ప్రధానంగా క్యాన్సర్, అవయవ మార్పిడి, ఆర్థోపెడిక్స్, న్యూరోసర్జరీ, హృద్రోగాలు మొదలైన సమస్యల చికిత్స కోసం వస్తున్న వారు ఉంటున్నారని సంగీతా రెడ్డి చెప్పారు. ముఖ్యంగా నేపాల్, శ్రీలంక, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, ఇరాక్, కెన్యా, నైజీరియా, ఇథియోపియా, ఒమన్, యెమెన్, ఉజ్బెకిస్తాన్, మయన్మార్ తదితర దేశాల నుంచి అంతర్జాతీయ పేషంట్లు వస్తున్నారని ఆమె తెలిపారు.


5 శాతం వృద్ధి కోసం కష్టించాల్సిందే...

భారత జీడీపీపై అమెరికా ఆర్థికవేత్త హంకే



న్యూఢిల్లీ: భారత్ 2020లో 5 శాతం వృద్ధి రేటు కోసం కష్టపడాల్సి ఉంటుందన్నారు అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త స్టీవ్ హంకే. ''గత కొన్ని త్రైమాసికాల్లో వృద్ధి రేటు గణనీయంగా తగ్గిపోవడం అన్నది రుణాల లభ్యత నిలిచిపోవడం వల్లే. ఇది సైక్లికల్ సమస్యే కానీ, నిర్మాణపరమైనది కాదు. ఈ పరిస్థితుల్లో 2020లో 5 శాతం జీడీపీ వృద్ధిని సాధించాలంటే కష్టపడాల్సి ఉంటుంది'' అంటూ జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీలో అప్లయిడ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హంకే పేర్కొన్నారు. భారత్ నిలకడలేని రుణాల బూమ్‌ను చవిచూసిందని, భారీగా పెరిగిపోయిన ఎన్‌పీఏ సమస్య నుంచి బయటపడేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. భారత్ ఎంతో రక్షణాత్మకంగా వ్యవహరించే దేశమని గుర్తు చేశారు. అవసరమైన గట్టి సంస్కరణలను చేపట్టే విషయంలో మోదీ సర్కారుకు ఆసక్తి తక్కువగా ఉన్నట్టు కనిపిస్తోందని హంకే అభిప్రాయపడ్డారు.

46 వేల కోట్లకు రియల్టీ పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 2020 నూతన సంవత్సరంలో రియల్టీ ఫుల్ జోష్‌లో ఉండనుంది. ఈ ఏడాది దేశీయ రియల్ ఎస్టేట్ పెట్టుబడులు రూ.46 వేల కోట్లకు (6.5 బిలియన్ డాలర్లు) చేరడం ఖాయమని గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ కొలియర్స్ తెలిపింది. వాణిజ్య స్థిరాస్తి లావాదేవీల వృద్ధి, ఐటీ కంపెనీల విస్తరణే దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. 2019లో దేశీయ రియల్టీ రంగంలోకి 5 శాతం వృద్ధి రేటుతో రూ.43,780 కోట్ల (6.2 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు వచ్చాయని.. ఇందులో విదేశీ పెట్టుబడుల వాటా 78 శాతం వరకున్నాయని నివేదిక తెలిపింది.

కమర్షియల్‌దే హవా..: 2008 నుంచి ఇప్పటిదాకా దేశీ రియల్టీ రూ.4,10,000 కోట్ల పెట్టుబడులను (56.6 బిలియన్ డాలర్లు) ఆకర్షించింది. 2019 మొత్తం పెట్టుబడుల్లో కమర్షియల్ స్పేస్ లోకి రూ.19,900 కోట్లు (2.8 బిలియన్ డాలర్లు) వచ్చాయి. రియల్టీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) నిబంధనల సడలింపు, జీఎస్‌టీ, రెరా, ఐబీసీ వంటి కొత్త చట్టాలతో పారదర్శకత కమర్షియల్ స్పేస్ వృద్ధికి కారణాలని తెలిపింది. హైదరాబాద్, బెంగళూరు, పుణేల్లో నిర్మాణంలో ఉన్న ఐటీ స్పేస్‌లపై విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని నివేదిక పేర్కొంది.

డిసెంబర్ వాహన విక్రయాలు అటుఇటుగానే..



- మారుతీ, మహీంద్రా అమ్మకాల్లో వృద్ధి
- హ్యుందాయ్, టయోటా సేల్స్ క్షీణత

న్యూఢిల్లీ: వాహన విక్రయాలు గతేడాది డిసెంబర్‌లో కాస్త మెరుగుదలను కనబర్చాయి. ఏడాది ప్రారంభం నుంచి క్రమంగా క్షీణిస్తూ వచ్చిన అమ్మకాలు.. పండుగల సీజన్ నేపథ్యంలో చివరి నెలల్లో గాడిన పడ్డాయి. ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో భారీగా క్షీణించినప్పటికీ.. 2019 ఏడాది చివరి నెలల్లో నిలదొక్కుకున్నాయి. డిసెంబర్‌లో మారుతీ, మహీంద్రా కంపెనీల విక్రయాలు స్వల్ప వృద్ధిని నమోదుచేయడమే ఇందుకు నిదర్శనంగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది ఏప్రిల్–డిసెంబర్ కాలంలో మారుతీ విక్రయాలు 17% తగ్గగా.. గత నెల్లో మాత్రం 2.4% వృద్ధిని ప్రదర్శించాయి. మహీంద్రా అమ్మకాల్లో ఒక శాతం వృద్ధి నమోదైంది. కొత్త ఏడాదిలో బీఎస్–6 వాహనాల విడుదలపై దృష్టిసారించామని, అధునాతన వాహనాల విడుదలతో విక్రయాలు పుంజుకుంటాయని భావిస్తున్నట్లు ఎం అండ్ ఎం లిమిటెడ్ చీఫ్ ఆఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ (ఆటోమోటివ్ డివిజన్) వీజయ్ రామ్ నక్రా అన్నారు. నూతన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలను విడుదలచేయడం ద్వారా అమ్మకాలను పెంచుకోనున్నామని, ఇన్వెంటరీని తగ్గించే చర్యలను ఇప్పటికే కొనసాగిస్తున్నామని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ (ప్యాసింజర్ వెహికల్స్ బిజినెస్ యూనిట్) మయాంక్ పరీక్ వెల్లడించారు. ఇక గత నెల అమ్మకాలు తాము ఆశించిన స్థాయిలోనే ఉన్నట్లు హోండా కార్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రాజేష్ గోయెల్ అన్నారు. నెమ్మదించిన ఆటో రంగంలో కనీసం గతేడాది చివర్లో అయినా అమ్మకాలు మెరుగుపడడం ఆశాజనకంగా ఉందని టయోటా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ సోని వ్యాఖ్యానించారు.

డిసెంబర్ వాహన అమ్మకాలు (దేశీయ)

కంపెనీ	2019	2018	వృ/క్షీ.(శాతం)
మారుతీ సుజుకీ	1,24,375	1,21,479	2.4
మహీంద్రా	37,081	36,690	1
హ్యుందాయ్	37,953	42,093	- 9.8
టాటా మోటార్స్	44,254	50,440	- 12
హోండా కార్స్	8,412	13,139	- 36
టయోటా	6,544	11,836	- 45
మహీంద్రా ట్రాక్టర్స్	17,213	16,510	4
వీఈసీవీ	4,410	5,112	- 13.7
ఎంజీ మోటార్	3,021	-	-

'నల్లబంగారం' ఇక జిగేల్!

- వేగం పుంజుకోనున్న బొగ్గు ఉత్పత్తి...
- వచ్చే ఐదేళ్లలో వేలానికి 200 బొగ్గు బ్లాకులు
- ప్రైవేటు రంగానికి భారీ అవకాశాలు...
- 2024 నాటికి దిగుమతులకు చెక్...

న్యూఢిల్లీ: దేశంలో అపారంగా బొగ్గు నిక్షేపాలు ఉండి కూడా దిగుమతి చేసుకుంటున్నాం. కోల్ ఇండియా ఒక్కటే దేశ అవసరాల్లో అధిక శాతం తీరుస్తోంది. అయినా, అవసరానికంటే ఉత్పత్తి తక్కువగానే ఉంటోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు, దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచడం ద్వారా దిగుమతుల భారానికి కళ్లెం వేసేందుకు ప్రైవేటు రంగాన్ని ఇందులోకి అనుమతించాలని కేంద్ర సర్కారు లోగడే నిర్ణయించింది. ఈ క్రమంలో వచ్చే ఐదేళ్ల కాలంలో 200 బొగ్గు గనులను (బ్లాకులు) వాణిజ్య ప్రాతిపదికన తవ్వితీసేందుకు వేలం వేయనుంది. గరిష్టంగా 400 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా 2024 నాటికి విద్యుత్ సంస్థలు బొగ్గు దిగుమతి చేసుకునే అవసరం ఉండదన్నది అంచనా. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు.

త్వరలోనే వేలం..: పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు గాను మొదటి విడతగా 40 బొగ్గు బ్లాకులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కేంద్రం వేలానికి తీసుకురానుంది. వీటి గరిష్ట ఉత్పత్తి సామర్థ్యం ఏటా 1–50 మిలియన్ టన్నుల మధ్య ఉండనుంది. వాణిజ్య బొగ్గు గనుల వేలానికి సంబంధించి బిడ్డింగ్ నిబంధనలను ఈ నెలాఖరుకు విడుదల చేసి, వచ్చే నెలలో భాగస్వాముల అభిప్రాయాలను స్వీకరించనున్నట్టు ప్రభుత్వ అధికారి వెల్లడించారు. వేలానికి వచ్చే బ్లాకుల్లో కొన్నింటి గరిష్ట ఉత్పత్తి సామర్థ్యం 30–50 మిలియన్ టన్నుల మధ్య ఉంటుందని తెలిపారు. కొన్ని బ్లాకుల్లో నిల్వల సమాచారం కచ్చితంగా గుర్తించగా, మరికొన్నింటిలో పాక్షికంగానే అది జరిగిందన్నారు. వీటి వల్ల దేశీయంగా బొగ్గు ఉత్పత్తి లోటు కొంత వరకు తీరుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2018–19)లో 235 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతులు జరిగాయి. వీటిల్లో 125 మిలియన్ టన్నుల మేర థర్మల్ బొగ్గు (54 శాతం) దిగుమతులే కావడం గమనార్హం. ఐరన్, స్టీల్ తయారీకి కోకింగ్ కోల్ అవసరం అవుతుంది. మన దేశంలో కోకింగ్ కోల్ లభ్యత లేనందున ఐరన్, స్టీల్ కంపెనీలకు దిగుమతే మార్గం. కానీ, విద్యుత్ తయారీకి వినియోగించే థర్మల్ బొగ్గును దిగుమతి చేసుకోకుండా దేశీయంగానే ఉత్పత్తి చేసుకోవచ్చు.

ఆదాయంలో వాటా..: వేలానికి పరిగణిస్తున్న వాటిల్లో చెండిపడ–1, 2, మదన్‌పూర్ నార్త్, ఫతేపూర్, ఫతేపూర్ ఈస్ట్, మహానంది, మచ్చకట బ్లాకులు ఉన్నట్టు ఆ అధికారి వెల్లడించారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి నిర్దేశిత వాటాను లీజుదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఈ బొగ్గు బ్లాకుల ఉత్పత్తిని త్వరగా ఆరంభించేందుకు ప్రోత్సాహకాలను కూడా ఇవ్వనుంది. నాలుగు, ఐదో దశ వేలంలో పరిశ్రమల నుంచి స్పందన ఆశించిన మేర లేదు. దీంతో మాజీ సీవీసీ ప్రత్యూష్ సిన్హా సిఫారసుల మేరకు ఆదాయంలో వాటా ప్రాతిపదికన బొగ్గు బ్లాకులను వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వేలంలో బొగ్గు గనులు దక్కించుకున్న సంస్థలు, నిర్దేశిత కాల వ్యవధి కంటే ఏడాదిముందే ఉత్పత్తి ప్రారంభిస్తే దానికి ప్రోత్సాహకంగా ఆదాయంలో వాటాను 10% ప్రభుత్వం తగ్గించుకోనుంది.

125 టన్నులకు కోల్ ఇండియా ఉత్పత్తి

ప్రభుత్వరంగ సంస్థ కోల్ ఇండియా గత ఏడాది కాలంలో 16 బొగ్గు బ్లాకులను సొంతం చేసుకోగా, వీటి సాయంతో సంస్థ ఉత్పత్తి 125 మిలియన్ టన్నులకు చేరనుందని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ బ్లాకుల్లో ఉత్పత్తి మూడు నుంచి ఆరేళ్లలో ప్రారంభమవుతుందని చెప్పారు. ''2023–24 నాటికి ఒక బిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్య లక్ష్యాన్ని చేరుకునేందుకు కంపెనీకి సాయపడుతుంది. ఇటీవలి కేటాయించిన వాటిల్లో కొన్నింటిలో 2–3 ఏళ్లు, ఇతర బ్లాకుల్లో ఉత్పత్తికి మరింత సమయం తీసుకుంటుంది'' అని కోల్ ఇండియా అధికారి ఒకరు తెలిపారు. ఈ బ్లాకుల్లో వెలికితీత కార్యకలాపాలను కోల్ ఇండియా త్వరగా ప్రారంభించాలని కేంద్రం కోరుకుంటోంది.



ఐపీఓకు ఏపీజే సురేంద్ర పార్క్ హోటల్స్

ఇష్యూ సైజు రూ.1,000 కోట్లు



న్యూఢిల్లీ: ఏపీజే సురేంద్ర పార్క్ హోటల్స్ కంపెనీ త్వరలో ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు రానున్నది. ఐపీఓ సంబంధిత పత్రాలను ఈ కంపెనీ ఇటీవలనే మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీకి సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.400 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. అంతేకాకుండా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో భాగంగా రూ.600 కోట్ల విలువైన షేర్లను విక్రయిస్తారు. మొత్తం మీద ఈ ఐపీఓ సైజు రూ.1,000 కోట్లని అంచనా. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి, సాధారణ వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోవాలని కంపెనీ యోచిస్తోంది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	40,110	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	38,200	▲ 250
వెండి (కిలో)	50,300	▼ 600
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	39,220	▼ 70
బంగారం (22 క్యారెట్లు)	37,350	▼ 70
వెండి (కిలో)	50,300	▼ 600
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	39,220	▼ 70
బంగారం (22 క్యారెట్లు)	37,350	▼ 70
వెండి (కిలో)	50,300	▼ 600
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	40,160	▼ 30
బంగారం (22 క్యారెట్లు)	37,350	▼ 30
వెండి (కిలో)	48,000	▲ 500
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	40,380	▼ 80
బంగారం (22 క్యారెట్లు)	37,350	▼ 70
వెండి (కిలో)	47,400	▼ 700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 2-1-2020

విశాఖ	487-00
చిత్తూరు	488-00
వరంగల్	467-00
విజయవాడ	474-00
గోదావరి	474-00
01-01-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	464-00

మార్కెట్ లాభాల బోణి

- సగం తగ్గిన ఆరంభ లాభాలు
- రూ.102 లక్షల కోట్ల మౌలిక జోష్ అంతంత మాత్రమే
- పెరుగుతున్న ద్రవ్యలోటు
- 12,200 పాయింట్ల దిగువకు నిఫ్టీ
- 14 పాయింట్ల లాభంతో 12,183 వద్ద ముగింపు
- 52 పాయింట్లు పెరిగి 41,306కు సెన్సెక్స్....



కొత్త ఏడాదికి స్టాక్ మార్కెట్ లాభాలతో స్వాగతం పలికింది. ఆరంభ లాభాలు ఆవిరైనా, బుధవారం నాడు స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. మౌలిక రంగం జోరుకు ప్రభుత్వం రూ.102 లక్షల కోట్ల ప్రణాళిక ప్రకటించడం, ఈ నెల 15న తొలి దశ వాణిజ్య ఒప్పందంపై అమెరికా–చైనాలు సంతకాలు చేయనున్నాయన్న వార్తలు సానుకూల ప్రభావం చూపించాయి. అయితే కరంట్ అకౌంట్ లోటు కట్టు తప్పడం, గత ఏడాది డిసెంబర్ వాహన విక్రయాలు మిశ్రమంగా ఉండటంతో ఇన్వెస్టర్లు పై స్థాయిల్లో లాభాల స్వీకరణకు మొగ్గు చూపించారు. దీంతో లాభాలకు కళ్లెం పడింది. ఇంట్రాడేలో 190 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ చివరకు 52 పాయింట్లు పెరిగి 41,306 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 12,200 పాయింట్ల దిగువకు పడిపోయింది. 14 పాయింట్లు లాభపడి 12,183 పాయింట్ల వద్దకు చేరింది.

సగానికి పైగా తగ్గిన సెన్సెక్స్ లాభాలు...

వాణిజ్య లోటు బాగా తగ్గడంతో ఈ సెప్టెంబర్ క్వార్టర్‌లో కరంట్ అకౌంట్ లోటు(క్యాడ్) జీడీపీలో 0.9 శాతానికి తగ్గింది. దీంతో నవంబర్ చివరి నాటికి ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో 114 శాతానికి, రూ.8.07 లక్షల కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.7.17 లక్షల కోట్లుగానే ఉంది. మరోవైపు ఎనిమిది కీలక రంగాల వృద్ధి నవంబర్‌లో 1.5 శాతం తగ్గింది. ఈ రంగాల వృద్ధి తగ్గడం ఇది వరుసగా నాలుగో నెల. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఫలితంగా ఆరంభ లాభాలు దాదాపు సగం మేర తగ్గాయి. సెన్సెక్స్ లాభాల్లో ఆరంభమైంది. గంటలోపే 190 పాయింట్ల లాభంతో 41,444 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఆ తర్వాత నుంచి లాభాలు కరిగిపోవడం మొదలైంది. ఇక కొత్త సంవత్సరం సెలవు సందర్భంగా ప్రపంచ మార్కెట్లు పనిచేయలేదు. దీంతో మన మార్కెట్లో కూడా ట్రేడింగ్ స్తబ్దుగానే సాగింది.

- 75 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్ట్ ఆరంభం కావడంతో అదానీ గ్రీన్ షేర్ 5 శాతం అప్పర్ సర్క్యూట్‌తో రూ.175 వద్ద ముగిసింది. ఇది ఈ షేర్‌కు జీవిత కాల గరిష్ట స్థాయి. నాలుగు నెలల క్రితం రూ.44 వద్ద ఉన్న ఈ షేర్ 300 శాతం లాభపడింది. ఇక ఈ షేర్‌తో పాటు ఇంట్రాడేలో పలు షేర్లు జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. పీవీఆర్, గుజరాత్ గ్యాస్, జుబిలంట్ ఫుడ్‌వర్క్స్, తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- కృష్ణపట్నం పోర్ట్‌లో 72 శాతాన్ని కొనుగోలు చేయనున్నదన్న వార్తల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 3 శాతం లాభపడి రూ.378 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	1,191
ఎన్ఎస్ఈ	20,768
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	11,24,095
ఎఫ్ఐఐ	-59
డీఐఐ	208

ఫస్ట్ ఇయర్ @ ఏపీ ఆర్‌వోసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఏపీ ఆర్‌వోసీ)లో తొలి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌వోసీ డెన్నింగ్ బాబు, అసిస్టెంట్ ఆర్‌వోసీ సాయి శంకర్ లండా, కంపెనీస్ సెక్రటరీస్ అమరావతి చాప్టర్ ప్రతినిధులు జేవీ రామారావు, కె. శ్రీనివాస రావు, చార్టెర్డ్ అకౌంటెంట్స్ విజయవాడ చాప్టర్ ప్రతినిధులు నాగవల్లి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది కాలంలో ఏపీలో కొత్తగా 3 వేల కంపెనీలు నమోదయ్యాయి. ప్రస్తుతం ఏపీలో 32,691 కంపెనీలున్నాయి.

రూ.700 కోట్ల పెట్టుబడి ప్రాజెక్ట్ వాయిదా

- ఫేమ్–2 స్కీమ్ సరిగ్గా లేదు
- అందుకే పెట్టుబడి ప్రాజెక్ట్ వాయిదా
- హీరో ఎలక్ట్రిక్ వెల్లడి



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ టూ వీలర్లు తయారు చేసే హీరో ఎలక్ట్రిక్ కంపెనీ రూ.700 కోట్ల పెట్టుబడి ప్రణాళికను ఏడాదిపాటు వాయిదా వేసింది. ఎలక్ట్రిక్ వాహన వినియోగానికి ప్రోత్సాహాన్నిచ్చేందుకు ప్రభుత్వం తెచ్చిన ఫేమ్ (ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్)టూ స్కీమ్ సరిగ్గా లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని హీరో ఎలక్ట్రిక్ ఎమ్‌డీ నవీన్ ముంజాల్ తెలిపారు. ఫేమ్ వన్ అమల్లో ఉన్నప్పుడు 48,671 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవగా, ఫేమ్ టూ అమల్లో ఉన్నప్పుడు 3,000 వాహనాలు మాత్రమే అమ్ముడయ్యాయని సొసైటీ ఆఫ్ మాన్యుఫాక్చరర్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఎస్ఎమ్ఈవీ) వెల్లడించింది.

తక్కువ స్పీడ్ వాహనాలకు సబ్సిడీలు ఇవ్వాలి

ఫేమ్–2 స్కీమ్‌ను పూర్తిగా పునర్‌వ్యవస్థీకరించాల్సి ఉందని నవీన్ ముంజాల్ పిలుపునిచ్చారు. ఫేమ్ వన్ స్కీమ్‌లో ఇచ్చినట్లుగానే తక్కువ స్పీడ్ ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ఫేమ్–2 స్కీమ్‌లో సబ్సిడీలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ స్కీమ్ సరైన విధంగా లేనందున ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ వృద్ధి కుంటుపడిందని వివరించారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని తెలిపారు.

15 శాతం పెరిగిన ఎఫ్‌డీఐలు

- సేవల రంగంలో అత్యధికం
- సింగపూర్ నుంచి అధిక ఎఫ్‌డీఐ
- పరిశ్రమల శాఖ వెల్లడి




న్యూఢిల్లీ: భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో 15 శాతం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్‌లో 2,266 కోట్ల డాలర్లుగా ఉన్న ఎఫ్‌డీఐలు ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి 2,600 కోట్ల డాలర్లకు పెరిగాయని పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతర్జాతీయంగా మందగమనం నెలకొన్నా, మన దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు జోరుగా వస్తున్నాయని డీపీఐఐటీ (డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్) కార్యదర్శి గురుప్రసాద్ మోహపాత్ర వ్యాఖ్యానించారు. మరిన్ని వివరాలు....

- ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో సేవల రంగంలో అత్యధికంగా (445 కోట్ల డాలర్లు) ఎఫ్‌డీఐలు వచ్చాయి. ఆ తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ (400 కోట్ల డాలర్లు), టెలికమ్యూనికేషన్స్ 428 కోట్ల డాలర్లు, వాహన రంగం(213 కోట్ల డాలర్లు), ట్రేడింగ్(214 కోట్ల డాలర్లు) రంగాలు నిలిచాయి.
- మన దేశానికి సింగపూర్ నుంచి అత్యధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఈ దేశం నుంచి మొత్తం 800 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. ఆ తర్వాతి స్థానాల్లో మారిషస్(636 కోట్ల డాలర్లు), అమెరికా(215 కోట్ల డాలర్లు), నెదర్లాండ్స్(232 కోట్ల డాలర్లు), జపాన్ (178 కోట్ల డాలర్లు) ఉన్నాయి.

ఈ ఏడాది మరిన్ని ఎఫ్‌డీఐలు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు జోరు మరింతగా పెరగగలదని ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలు సరళీకరిస్తుండటం, సులభతర వ్యాపార నిర్వహణలో ర్యాంకింగ్ మరింతగా మెరుగుపడటం వంటి సానుకూలతల నేపథ్యంలో ఎఫ్‌డీఐలకు అత్యంత అనుకూల దేశంగా భారత్ నిలవగలదని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

హిందుస్తాన్ కాపర్ సీఎండీగా శుక్లా



కోలకతా: ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్తాన్ కాపర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా అరుణ్ కుమార్ శుక్లా పదవీ బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ (ఆపరేషన్స్)గా 2018లో కంపెనీలో చేరిన చేపట్టిన శుక్లా.. తాజాగా సీఎండీ పదవిని చేపట్టారని ప్రకటించింది. గతంలో ఎన్ఎండీసీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సేవలందించారని పేర్కొంది.

త్వరలో మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్

ఇష్యూ సైజు రూ. 4,000 కోట్లు

న్యూఢిల్లీ: రహేజా గ్రూప్‌నకు చెందిన మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్(రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) త్వరలో ఐపీఓకు రానున్నది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) సంబంధిత పత్రాలను ఈ సంస్థ సమర్పించింది. డ్రాఫ్ట్ ఆఫర్ డాక్యుమెంట్ (డీఓడీ) వివరాల ప్రకారం..., ఈ ఐపీఓలో భాగంగా రూ.1,000 కోట్ల విలువైన తాజా యూనిట్లను ఈ సంస్థ జారీ చేయనున్నది. ఈ తాజా యూనిట్లతో పాటు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ, బ్లాక్‌స్టోన్‌కు సంబంధించిన సంస్థలు ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) మార్గంలో మరికొన్ని యూనిట్లను విక్రయించనున్నాయి. మొత్తం మీద ఈ ఇష్యూ సైజు రూ.4,000 కోట్ల మేర ఉండొచ్చని అంచనా.

చైనా బ్యాంకులకు మరింత ద్రవ్య లభ్యత!

బీజింగ్: ఆర్థిక మందగమనంలో ఉన్న చైనా ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వడానికి ఆ దేశ సెంట్రల్ బ్యాంక్– పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్‌సహా ఆర్థిక సంస్థల రిజర్వ్ రిక్వైర్‌మెంట్ రేషియో (ఆర్ఆర్ఆర్)ను 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) తగ్గిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఇది జనవరి 6 నుంచీ అమల్లోకి వస్తుందని ప్రకటన తెలిపింది. ఈ నిర్ణయం వల్ల రుణాలివ్వడానికి వీలుగా ఫైనాన్స్ సంస్థల చేతికి 800 బిలియన్ యువాన్‌లు (114.7 బిలియన్ డాలర్లు) అందుబాటులోకి వస్తాయి. జనవరి 25న చైనా కొత్త సంవత్సరం లూనార్ న్యూ ఇయర్ ప్రారంభం నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తాజా నిర్ణయంతో చైనా ఆర్ఆర్ఆర్ 12.50 శాతానికి తగ్గుతుంది. అక్టోబర్‌తో ముగిసిన త్రైమాసికంలో వృద్ధిరేటు 30 సంవత్సరాల కనిష్టానికి పడిపోయిన సంగతి తెలిపిందే.

రాష్ట్రీయం


కాలుతో తన్నుతున్న కానిస్టేబుల్


కర్రతో చితకబాదుతున్న దృశ్యం

‘ఖాకీ’ మార్కు ప్రతాపం!

కర్రలతో కొడుతూ.. బూటు కాళ్లతో తన్నుతూ..

- ముగ్గురు విద్యార్థులపై పోలీసుల దాష్టీకం
- సోషల్ మీడియాలో వైరల్

సిరిసిల్లటౌన్/సిరిసిల్ల క్రైం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ముగ్గురు విద్యార్థులపై పోలీసులు తమ ప్రతాపం చూపించారు. కర్రలతో విచక్షణారహితంగా కొడుతూ.. బూటు కాళ్లతో తన్నుతూ అమానుషంగా ప్రవర్తించారు. పోలీసుల దాష్టీకానికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మంగళవారం అర్ధరాత్రి సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రాహుల్, బన్నీ, శ్యాం బైక్‌పై వచ్చారు. అక్కడే ఉన్న పోలీసులు.. వీరిని బ్రీతింగ్ అనలైజర్‌తో చెక్ చేశారు. అనంతరం ఎస్సై వద్దకు తీసుకెళ్లారు. ఆపై ఎస్సైతోపాటు పలువురు కానిస్టేబుళ్లు వారిని విచక్షణా రహితంగా కొట్టారు. అయితే అదే స్థలంలో అంతకుముందు ఇరువర్గాల యువకులు ఘర్షణ పడగా పోలీసులు చెదరగొట్టారు. కాసేపటికే రాహుల్, బన్నీ, శ్యాం త్రిబుల్‌రైడింగ్‌లో వచ్చి పోలీసులకు చిక్కారు. అయితే.. పోలీసుల వాదన మరోలా ఉంది. రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్, సతీశ్, శ్రీనివాస్, ప్రణయ్ బీరు బాటిళ్లతో రోడ్డుపై న్యూసెన్స్ చేశారని, వారిని వారిస్తున్న తమ సిబ్బందిపై దాడులకు పాల్పడుతూ.. విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెబుతున్నారు.

నాకు వెన్నుపోటు పొడిచిందెవరో తెలుసు

ద్రోహం చేసిన వారికి భవిష్యత్‌లో సమాధానం

- క్యాంపు రాజకీయాలు నా వల్ల కాదు
- ఈ పదవి ప్రజలు పెట్టిన ఓట్ల భిక్ష
- టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు



ఈటల రాజేందర్

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: గత ఎన్నికల్లో తనకు నమ్మక ద్రోహం, వెన్నుపోటు పొడిచిందెవరో తెలుసునని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లి–ఇందిరానగర్ గ్రామ సమీపంలో హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలోని టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొందరు ఎన్నికలకు ముందు ఓ రకంగా.. గెలిచిన తర్వాత మరో రకంగా ఉంటారని పేర్కొన్నారు. క్యాంపు రాజకీయాలు తన వల్ల కాదన్నారు. ‘నేను మృధు స్వభావిని కావడం వల్ల చర్యలు ఆలస్యం కావచ్చు.. కానీ మోసానికి భవిష్యత్తులో సమాధానం దొరుకుతుందని’ మంత్రి పేర్కొన్నారు. ధర్మం, న్యాయం, సత్యం అనేవి బయటకు కనిపించకపోవచ్చు కానీ.. అంతిమ విజయం వాటిదే అన్న విషయం కార్యకర్తలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ‘ఈ పదవి అమ్మానాన్నలు ఇచ్చింది కాదు.. ప్రజలు పెట్టిన ఓట్ల భిక్ష .. నా దృష్టిలో ప్రజలు చాలా గొప్పవారు’ అని పేర్కొన్నారు. ప్రజల కోసం మంచి పనులు చేసే నాయకులకు ఓట్లు పడతాయే తప్ప.. మద్యం సీసాలు పంచితే పడవని స్పష్టం చేశారు. తాను పార్టీలోకి వచ్చినప్పుడు టికెట్ ఆశించిన వారిలో తన కంటే 27 మంది ముందున్నారని, కానీ చివరికి టికెట్ తనకే దక్కిందని ఈటల గుర్తు చేశారు. డబ్బుంటే పార్టీ టికెట్ రాదనీ.. ప్రజల ప్రేమ ఉంటేనే వస్తుందని తెలిపారు. కాగా, మంత్రి ఈటల వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

పసిపాపపై పైశాచికం

తల్లి ఒడిలో నిద్రిస్తున్న చిన్నారిని ఎత్తుకెళ్లి అఘాయిత్యం

- నిందితుడు వరుసకు పెదనాన్న!
- ప్రత్యేక బృందాల గాలింపు


కొమురయ్య

మహాముత్తారం: వరుసకు పెదనాన్న అయ్యే ఓ వ్యక్తి నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోనంపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్సం భారతి మంగళవారం రాత్రి తన నాలుగేళ్ల కూతురితో నిద్రిస్తోంది. మధ్యరాత్రి మెలకువ రాగానే పక్కన కూతురు లేకపోవడం, తలుపులు తీసి ఉండటంతో కంగారు పడిన ఆమె.. చుట్టు పక్కల వాళ్లను లేపి వెతికినా చిన్నారి ఆచూకీ లభించలేదు. బుధవారం తెల్లవారు జామున గ్రామ సమీప చెట్ల పొదల నుంచి ఏడుపు వినపడటంతో అటువైపు వెళ్లారు. చిన్నారి ఒంటిపై దుస్తులు లేకపోవడం.. ఒంటి నిండా గాయాలు కనిపించాయి. ఎవరు తీసుకొచ్చారని చిన్నారిని అడగ్గా పెదనాన్న అని చెప్పడంతో.. అతడి కోసం వెతుకగా ఆచూకీ దొరక లేదు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో..

మండలంలోని కనుకునూర్‌కు చెందిన కిష్టయ్యతో భారతి వివాహం కాగా అతను చనిపోవడంతో కోనంపేటలో తల్లిగారి ఇంట్లో ఉంటోంది. ఆ సమయంలో నాగారానికి చెందిన ఓదెలుతో పరిచయం ఏర్పడింది. అతనితో సహజీవనం కొనసాగించగా ఒక కూతురు జన్మించింది. నాలుగేళ్ల కూతురితో భారతి తల్లి దగ్గర ఉంటూ కూలి చేసి జీవనం సాగిస్తోంది. ఓదెలుకు వరుసకు సోదరుడైన కొమురయ్య తరచుగా మద్యం తాగి వచ్చి వారి ఇంట్లోనే నిద్రించేవాడు. ఈ క్రమంలో మంగళవారం మద్యం మత్తులో వచ్చిన కొమురయ్య ఇంటి ముందు నిద్రించినట్లు సమాచారం. అయితే అతడే బాలికను ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్, డీఎస్పీ బోనాల కిషన్, సీఐ హథీరాం, ఎస్సైలు రాజు, నరేష్ పరిశీలించారు.

నాలుగు స్పెషల్ టీంలతో గాలింపు

నిందుతుడి కోసం నాలుగు బృందాలతో గాలిస్తున్నామని డీఎస్పీ కిషన్ తెలిపారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం మహదేవపూర్ సామాజిక వైద్యశాలకు పంపించామని ఆయన తెలిపారు.



గాలానికి చిక్కిన 15 కిలోల చేప

మెదక్ రూరల్: ఒకటి, రెండు కాదు ఏకంగా 15 కిలోల బరువున్న చేప గాలానికి చిక్కిన సంఘటన మెదక్ జిల్లా హవేళి ఘణాపూర్ మండలం పోచారం ప్రాజెక్టులో బుధవారం చోటు చేసుకుంది. మెదక్ పట్టణానికి చెందిన బాబర్ అనే వ్యక్తి సెలవు రోజుల్లో చేపలు పట్టడం హాబీగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం పోచారం డ్యామ్‌కు వెళ్లి చేపల కోసం గాలం వేశాడు. దీంతో 15 కిలోల బరువున్న చేప గాలానికి చిక్కడంతో బాబర్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అక్కడికి వచ్చిన పర్యాటకులు భారీ చేపను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

విషం చిమ్మిన కలహాలు

- ముగ్గురు పిల్లలకు గుళికలిచ్చి.. తానూ ఆత్మహత్యాయత్నం
- తల్లీపిల్లల పరిస్థితి ఆందోళనకరం
- ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఘటన


చికిత్స పొందుతున్న తల్లీబిడ్డలు

సత్తుపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ తల్లి తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి.. తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సిద్ధారంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోళ్లమూడి మారేష్, జమలమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరి కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగాయి. దీంతో తీవ్ర కలత చెందిన జమలమ్మ ఇంట్లో ఉన్న గుళికలను కూల్ డ్రింక్‌లో కలిపి స్కూల్ నుంచి వచ్చిన కుమార్తెలు రేష్మ, వర్షిత, కుమారుడు భరత్‌లకు తాగించి.. తానూ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన బంధువులు వారిని సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. నాలుగు రోజులు గడిస్తేగానీ వీరి ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పలేమని వైద్యులు తెలిపారు. కాగా.. ఈ విషయంపై సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

పార్లమెంటరీ వ్యవస్థకు మోదీతోనే ప్రమాదం

సీపీఐ నేత నారాయణ

యాదగిరిగుట్ట: దేశ పార్లమెంటరీ వ్యవస్థకు ప్రమాదం విదేశీ శత్రువుల నుంచి, స్వదేశీ ప్రతిపక్షం నుంచి రాలేదని, స్వయాన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ద్వారానే వచ్చి పడిందని సీపీఐ నేత నారాయణ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, లౌకిక విధానానికి వ్యతిరేకంగా పౌరసత్వ చట్టం తేవడంతో మత విద్వేష పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అస్సాంలో వచ్చిన సమస్యను దేశం మొత్తానికి తీసుకువచ్చి, ప్రధాని అల్లకల్లోలం సృష్టిస్తున్నారన్నారు.



పరశు‘రాముడు’

భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్రస్వామి వారు పరశు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతం, ఆరాధన అనంతరం ఉత్సవమూర్తులను, ఆండాళ్ తల్లిని, శ్రీకృష్ణ పరమాత్మను, పన్నిద్దరాళ్వారులను బేడామండపంలో వేంచేయింపజేసి తిరుప్పావై 30 పాశురాలను పఠించారు. అనంతరం రామయ్య నిత్యకల్యాణమూర్తులకు పరశురామావతారంలో అలంకరించారు.



బొకేలకు బదులు బుక్కులు, దుప్పట్లు

వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చే వారు పుష్ప గుచ్ఛాలు, శాలువాలకు బదులు దుప్పట్లు, రగ్గులు, నోట్ బుక్కులు, పెన్నులు తీసుకురావాలని సూచించారు. దీంతో బుధవారంక్యాంపు కార్యాలయానికి ఉద్యోగ సంఘాల, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఇచ్చిన రగ్గులు, దుప్పట్లు, నోట్ బుక్కులను కలెక్టర్ పాటిల్ దంపతులు ఇలా పరిశీలించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్ అర్బన్



1075 రకం ధాన్యం కొనుగోలు చేయాలి

గోవిందరావుపేటలో రైతుల ఆందోళన

గోవిందరావుపేట: ఎలాంటి ఆంక్షలు విధించకుండా 1075 రకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా గోవిందరావుపేటలోని కోటగడ్డ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రైతులు ధర్నా చేశారు. ధాన్యాన్ని రోడ్డుపై పోసి నిప్పంటించి నిరసన తెలిపారు. వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల జోక్యంతో వారు ఆందోళన విరమించారు.

ఖాకీ నిర్లక్ష్యం ప్రాణం తీసింది!

- లోకేశ్వరి ఫిర్యాదు పట్టించుకోని పోలీసులు
- శుక్రవారం నుంచి ఠాణా చుట్టూ ప్రదక్షిణలు
- ఫలితంగా విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం
- ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

హైదరాబాద్: ఎన్ని ఉదంతాలు చోటు చేసుకున్నా పోలీసుల వైఖరిలో మార్పు రావడం లేదు... జరగరానిది జరిగినప్పుడు హడావుడి చేసే ఉన్నతాధికారులు ఆపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. నగరంలోని పంజగుట్ట పోలీసుస్టేషన్ వద్ద మంగళవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నం చేసి, బుధవారం ఉస్మానియా ఆస్పత్రిలో మృతిచెందిన వివాహిత లోకేశ్వరి ఉదంతమే దీనికి నిదర్శనం. చెన్నైకి చెందిన సానం లోకేశ్వరి (37) అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌ను 2000 సంవత్సరంలో వివాహం చేసుకుంది. కుమార్తె పుట్టిన తర్వాత వీళ్లు విడిపోయారు. లోకేశ్వరికి 2012లో ఓ మాట్రిమోనియల్ సైట్ ద్వారా నగరంలోని వారసిగూడకు చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్ పరిచయమయ్యాడు. తిరుపతిలో కలుసుకున్న వీరిద్దరూ వివాహం చేసుకోవాలని భావించారు. 2013లో ఆమెను నగరానికి తీసుకువచ్చిన ప్రవీణ్ బీఎస్ మక్తాలోని ఓ గదిలో ఉంచాడు.



లోకేశ్వరి (ఫైల్)

తర్వాత వీరు సహజీవనం కొనసాగించారు. అప్పట్లో ఇద్దరూ సోమాజిగూడలో ఓ నగల దుకాణం నిర్వహించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో లోకేశ్వరిపై ప్రవీణ్ 2014లో పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో చోరీ కేసు నమోదు చేయించాడు. ఈ కేసులో అరెస్టయి బెయిల్‌పై వచ్చిన ఆమె.. కుమార్తెను తీసుకుని చెన్నై వెళ్లిపోయింది.

కేసు నమోదు చేయని పోలీసులు...

ప్రవీణ్ తనకు రూ.7.5 లక్షలు ఇవ్వాల్సి ఉందంటూ అప్పటి నుంచి లోకేశ్వరి చెబుతోంది. పలుమార్లు అతనికి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో తన కుమార్తెను చెన్నైలోని కుటుంబీకుల వద్ద విడిచిపెట్టి స్నేహితుడు కన్నన్‌తో శుక్రవారం ఇక్కడికి వచ్చింది. ప్రవీణ్ కోసం వెతికినా దొరక్కపోవడం, ఫోన్‌లోనూ అందుబాటులోకి రాకపోవడంతో శుక్రవారమే పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రవీణ్‌ను ఫోన్ ద్వారా సంప్రదించిన పోలీసులు అతడి మాటలు నమ్మి కేసు నమోదు చేసేది లేదంటూ లోకేశ్వరితో చెప్పేశారు. దీంతో ఏసీపీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్న ఆమె ఆ పేరుతో ఫిర్యాదును సిద్ధం చేయించి మంగళవారం పంజగుట్ట ఠాణా వద్దకు వచ్చింది. నాంపల్లిలోని ఏక్ మినార్ మజ్జిద్ వద్ద పెట్రోల్ బంక్‌లో రెండు లీటర్ల పెట్రోల్‌ను ఓ సీసాలో పోయించుకుని వెంట తెచ్చుకుంది. తనతో సహజీవనం, వ్యాపారం చేసిన ప్రవీణ్ మోసం చేయడం.. పోలీసులు ఫిర్యాదును పట్టించుకోకపోవడంతో ఆవేదన చెందిన లోకేశ్వరి ఠాణా ముందే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. 70 శాతం కాలిన ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు వెంట ఉన్న కన్నన్‌ను మంగళవారమే అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ పేరుతో లోకేశ్వరి సిద్ధం చేసిన లేఖను మాయం చేశారు. బుధవారం లోకేశ్వరి మృతిచెందడంతో పోస్టుమార్టం నిర్వహించి ఆమె వస్తువుల్ని కన్నన్‌కు అప్పగించి రహస్యంగా చెన్నైకు పంపించేశారు. లోకేశ్వరి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ప్రవీణ్‌కుమార్‌పై చీటింగ్, ఆత్మహత్యకు ప్రేరేపించడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పంజగుట్ట పోలీసులు త్వరలోనే అరెస్టు చేస్తామని చెబుతూ నష్ట నివారణ చర్యలు ప్రారంభించారు.

ప్రవీణ్‌ను ఫోన్‌లో సంప్రదించాం: పంజగుట్ట ఏసీపీ

'2014లో లోకేశ్వరిపై నమోదైన కేసు అదే ఏడాది లోక్ అదాలత్‌లో రాజీ అయింది. తాజాగా లోకేశ్వరి శుక్రవారం పంజగుట్ట పోలీసుస్టేషన్‌కు వచ్చి ప్రవీణ్‌పై ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్సై.. ప్రవీణ్‌ను ఫోన్‌లో సంప్రదించారు. లోకేశ్వరి ఆరోపణల్ని ఖండించిన ప్రవీణ్... తాను బెంగళూరులో ఉన్నానని, రెండు వారాల్లో వస్తానని చెప్పాడు. లోకేశ్వరి ఆత్మహత్యాయత్నానికి సంబంధించి మంగళవారం సాయంత్రం కేసు నమోదు చేశాం. దీన్ని బుధవారం ఆత్మహత్యకు ప్రేరేపించడం, మోసం చేయడం తదితర సెక్షన్ల కింద మార్చాం. ప్రస్తుతం లోకేశ్వరి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచాం. ఆర్థిక కారణాల నేపథ్యంలో ఆమె కుటుంబం మృతదేహాన్ని చెన్నై తీసుకువెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించే స్థితిలో లేదని తెలిసింది.



ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన లోకేశ్వరిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు (ఫైల్)



బుధవారం నూతన సంవత్సరం తొలి రోజు ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద సందర్శకుల తాకిడి

ఉపకారానికి టీ-వ్యాలెట్!

- బ్యాంకు ఖాతా లేకున్నా స్కాలర్‌షిప్
- నిజామాబాద్ జిల్లాలో ఫలించిన పైలట్ ప్రాజెక్టు
- మరో 4 జిల్లాల్లో అమలుకు ప్రభుత్వం అనుమతి



సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతన పథకానికి బ్యాంకు ఖాతా తప్పనిసరి అనే నిబంధనకు కాస్త బ్రేక్ పడింది. బ్యాంకు ఖాతా తెరవడం, దాని నిర్వహణ తదితర అంశాలు విద్యార్థులకు కాస్త ఇబ్బంది కలిగిస్తున్నాయనే ఆందోళన ఉండేది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన టీ-వ్యాలెట్ యాప్/ఆన్‌లైన్ సర్వీసు ద్వారా ఉపకారవేతనాలు పంపిణీ చేసేలా నిజామాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా గతేడాది అందుబాటులోకి తెచ్చింది. ఈ జిల్లాలోని విద్యార్థులు ఉపకారవేతనం కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునే సమయంలో బ్యాంకు ఖాతా నంబర్ బదులుగా టీ-వ్యాలెట్ బటన్‌ను ఎంపిక చేసుకుంటారు. దరఖాస్తుదారు ఎంట్రీ చేసిన ఫోన్ నంబర్, విద్యార్థి పేరు ఆధారంగా టీ-వ్యాలెట్ రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుంది. ఉపకారవేతనం విడుదలైన వెంటనే విద్యార్థి టీ-వ్యాలెట్ ఖాతాకు నిధులు జమవుతాయి. వీటిని సమీప మీ సేవా కేంద్రంలో విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది. గతేడాది నిజామాబాద్ జిల్లాలో 32 వేల మంది విద్యార్థులు టీ-వ్యాలెట్ ఎంపిక చేసుకున్నారు. వీరిలో దాదాపు అందరికీ 2018–19 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకారవేతనాలను ఆయా సంక్షేమ శాఖలు మంజూరు చేశాయి. వీరిలో ఇప్పటివరకు 10 వేల మంది విద్యార్థులు తమ వ్యాలెట్ నుంచి నిధులు డ్రా చేసుకున్నారు.

మరో నాలుగు జిల్లాల్లో..

నిజామాబాద్ జిల్లాలో టీ-వ్యాలెట్ ప్రాజెక్టు సత్ఫలితాలివ్వడంతో మరో నాలుగు జిల్లాల్లో కూడా ఇదే తరహాలో ఉపకారవేతనాలు ఇవ్వాలని సంక్షేమ శాఖలు భావిస్తున్నాయి. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో టీ-వ్యాలెట్ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో త్వరలో సంక్షేమ శాఖలు ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నాయి.

వ్యాలెట్ ఆప్షన్ ఇస్తే మేలు..

ప్రస్తుతం ఉపకారవేతన దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. అయితే ఎడిట్ (మార్పు) ఆప్షన్‌కు అవకాశం ఉంది. వివరాల్లో తప్పులు, మార్పులు ఉంటే ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిచేసుకోవచ్చు. నిర్దేశించిన నాలుగు జిల్లాలకు సంబంధించి వెబ్‌సైట్‌లో టీ-వ్యాలెట్ ఆప్షన్ యాక్టివేట్ చేస్తే విద్యార్థులంతా బ్యాంకు ఖాతాకు బదులుగా టీ-వ్యాలెట్ వివరాలు సమర్పించవచ్చు. కొత్తగా నాలుగు జిల్లాల్లో టీ-వ్యాలెట్ అమలుపై అతి త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పి.కరుణాకర్ 'సాక్షి'తో పేర్కొన్నారు.

హైవే పక్కన హోటళ్లలో ఫాస్టాగ్ విక్రయం

- విజయవాడ రహదారిలో 6 హోటళ్లలో అమ్మకం

సాక్షి, హైదరాబాద్: టోల్‌ప్లాజాల వద్ద సంక్రాంతి సమయంలో అయోమయం నెలకొనే పరిస్థితి ఉండటంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అప్రమత్తమయ్యారు. సంక్రాంతి రద్దీ మొదలయ్యే నాటికి వీలైనన్ని ఫాస్టాగ్‌లు విక్రయించాలని నిర్ణయించారు. ఇప్పటికే టోల్‌ప్లాజాల వద్ద పెద్ద సంఖ్యలో కౌంటర్లు తెరిచి ఫాస్టాగ్‌లను విక్రయిస్తున్నారు. తాజాగా జాతీయ రహదారిపై ముఖ్యమైన హోటళ్లలో ఫాస్టాగ్ విక్రయ కౌంటర్లు తెరిచారు. విజయవాడ రహదారిలో రద్దీ ఎక్కువగా ఉంటున్నందున ఆ రోడ్డులోని 6 హోటళ్లలో విక్రయాలు ప్రారంభించారు. బుధవారం నుంచి వాటి అమ్మకాలు మొదలయ్యాయి. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ ఈ హోటళ్లలోని కౌంటర్లను పరిశీలించి, హోటళ్లకు వచ్చే వాహనదారులతో మాట్లాడి ఫాస్టాగ్స్ కొనుగోలు చేసేలా చైతన్యపరచాలని సూచించారు. ఫాస్టాగ్ లేకుంటే సంక్రాంతి ప్రయాణం ఇబ్బందిగా ఉంటుందని, దాన్ని నివారించేందుకు వెంటనే ట్యాగ్ తీసుకోవాలని ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ప్రస్తుతం లేన్లు ఇలా..

ప్రస్తుతం జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద 25 శాతం లేన్లు హైబ్రీడ్ వేలుగా ఉన్నాయి. వాటిల్లో ఫాస్టాగ్ ఉన్న వాహనాలతోపాటు లేని వాటిని కూడా అనుమతిస్తున్నారు. 75 శాతం లేన్లు పూర్తిగా ఫాస్టాగ్ ఉన్న వాటికే కేటాయించారు. జనవరి 14 తర్వాత క్యాష్ లేన్‌ను ఒకటి మాత్రమే ఉండనుంది. మరో పక్షం రోజులపాటు ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని ఎన్‌హెచ్‌ఏఐపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయంలో కేంద్ర రవాణాశాఖ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

81 వేలకు చేరుకున్న ట్యాగ్లు..

రాష్ట్రంలో ఫాస్టాగ్స్ ఉన్న వాహనాల సంఖ్య 81 వేలకు చేరుకుంది. గత నాలుగైదు రోజులుగా వాటి విక్రయాలు పెరిగాయి. సగటున రోజుకు 2 వేల వరకు ఫాస్టాగ్ కొనుగోలు జరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.



విజయవాడ రహదారిపై ఓ హోటల్ ఆవరణలో ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ విక్రయ కౌంటర్

కనీస చార్జీ తగ్గిస్తే ఎలా ఉంటుంది?

యోచిస్తున్న ఆర్టీసీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే పెరిగిన ఆర్టీసీ చార్జీల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశం కన్పిస్తోంది. కొన్ని కేటగిరీ బస్సుల కనిష్ట చార్జీని స్వల్పంగా తగ్గిస్తే ఎలా ఉంటుందన్న విషయంపై అధికారులు ఆలోచిస్తున్నారు. గతంలో రూ.11గా ఉన్న ఎక్స్‌ప్రెస్ కనిష్ట చార్జీని ఇటీవల రూ.20కి పెంచారు. కి.మీ.కు 20 పైసలు చొప్పున చార్జీలను పెంచినందున ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కనిష్ట చార్జీ రూ.15గా మారింది. దీనికి ప్యాసింజర్ సెస్ రూపంలో రూపాయిని కలిపారు. దీంతో అది రూ.16గా మారింది. చిల్లర సమస్య వస్తుందన్న ఉద్దేశంతో ఆమొత్తాన్ని తదుపరి పెద్ద సంఖ్యకు రౌండాఫ్ చేయాలని నిర్ణయించి రూ.20గా మార్చారు. సింగిల్ స్టాప్‌కు రూ.20 చార్జీని పెద్ద మొత్తంగా భావిస్తున్న ప్రయాణికులు,



తదుపరి స్టేజీలో దిగాల్సిన వారు ఆ బస్సులు ఎక్కడం లేదని అధికారులు గుర్తించారు. ఆటోల వైపు దృష్టి సారిస్తున్నారని గుర్తించి కనీస చార్జీని తగ్గించే విషయాన్ని ఆలోచిస్తున్నారు. ప్రయాణికుల సెస్‌గా ఉన్న రూపాయిని ఇందులో చేర్చొద్దని నిర్ణయించారు. దీంతో పెంపు మొత్తం రూ.15గా మారుతుంది. దాన్ని రౌండాఫ్ చేయాల్సిన అవసరం లేనందున దాన్నే కొనసాగించాలని భావిస్తున్నారు. ఇక డీలక్స్ బస్సు కనీస చార్జీ రూ.25 నుంచి రూ.20కి తగ్గనుంది. అలాగే సూపర్ లగ్జరీ చార్జీ కూడా తగ్గనుంది. అయితే ఈ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరికొద్ది రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

తెలుగు రాష్ట్రాల్లో జీఎస్టీ పెరుగుదల తక్కువే

సాక్షి, న్యూఢిల్లీ: ఈ డిసెంబర్‌లో దేశీయ లావాదేవీల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో జీఎస్టీ పెరుగుదల 2018 డిసెంబర్‌తో పోల్చితే జాతీయ సగటు కంటే తక్కువగా నమోదైంది. జాతీయ సగటు పెరుగుదల 16% ఉండగా..తెలంగాణలో 13%, ఏపీలో 11%గా ఉంది. డిసెంబర్ 2019లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1,03,184 కోట్ల మేర నమోదయ్యాయి. ఇందులో సెంట్రల్ జీఎస్టీ రూ.19,962 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.26,792 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.48,099 కోట్ల మేర, సెస్ ఆదాయం రూ. 8,331 కోట్ల మేర ఉన్నాయి. ఏపీలో 2018లో రూ.2,049 కోట్ల మేర స్థూల దేశీయ జీఎస్టీ వసూళ్లు ఉండగా..2019 డిసెంబర్‌లో 11% మేర పెరిగి రూ. 2,265 కోట్లకు చేరాయి. తెలంగాణలో 2018లో రూ.3,014 కోట్ల మేర జీఎస్టీ వసూళ్లు ఉండగా..2019 డిసెంబర్‌లో 13% పెరిగి రూ.3,420 కోట్లకు చేరాయి.

10వ తేదీలోగా నిరక్షరాస్యుల జాబితా

కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రారంభం కానున్న రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్ల పైబడి చదవడం, రాయడం తెలియని నిరక్షరాస్యుల జాబితాను ఈ నెల 10లోగా రూపకల్పన చేయాలని సీఎస్ సోమేశ్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి పల్లె ప్రగతి రెండో విడతపై జిల్లా కలెక్టర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో వయోజనుల అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రచారోద్యమం నిర్వహించాలని సూచించారు. అక్షరాస్యత పెంపునకు అన్ని గ్రామ పంచాయతీల్లో ఈచ్ వన్–టీచ్ వన్ కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామానికి సంబంధించిన నిరక్షరాస్యుల జాబితాలో 18 ఏళ్లకు పైబడిన అందరి వివరాలుండాలని, జాబితాను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ నిరక్షరాస్యుల వివరాలు సేకరించడానికి సంబంధిత నమూనాను జిల్లా కలెక్టర్లకు పంపించామని తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, సెన్సెస్ డైరెక్టర్ ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్ రావు పాల్గొన్నారు.



బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ సోమేశ్‌కుమార్

మున్సి'పోల్స్' ఏర్పాట్లలో ఎస్‌ఈసీ

- రాష్ట్ర స్థాయి మున్సిపల్ ఎన్నికల అధికారిగా డీఎంఏ
- జిల్లా స్థాయిలో మున్సిపల్ ఎన్నికల అధికారులుగా కలెక్టర్లు
- 13న పోలింగ్‌స్టేషన్ల తుది జాబితా.. 14న అధికారిక ప్రకటన

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమైన రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) వివిధ ఏర్పాట్లను పూర్తిచేయడంలో నిమగ్నమైంది. గతంలోనే ఎన్నికలు జరిపేందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసినందున, ఎన్నికల నిర్వహణకు ఇప్పుడు పూర్తి సంసిద్ధతతో ఉంది. రాష్ట్ర స్థాయి మున్సిపల్ ఎన్నికల అధికారిగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (డీఎంఏ)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్‌ఈసీ వివిధ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల (జీహెచ్‌ఎంసీ మినహా)లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధులు, అధికారాలను సీడీఎంఏకు కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. అదేవిధంగా జిల్లా స్థాయిల్లో (హైదరాబాద్ జిల్లా మినహా) కలెక్టర్లను జిల్లా మున్సిపల్ ఎన్నికల అధికారులుగా నియమించారు. అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల (జీహెచ్‌ఎంసీ మినహా) కమిషనర్లను అదనపు జిల్లా అధికారులుగా, రెవన్యూ డివిజనల్ ఆఫీసర్లు/ సబ్ కలెక్టర్లను డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారులుగా, అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు (హైదరాబాద్ మినహా) అదనపు జిల్లా ఎన్నికల అధికారులుగా, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లను సహాయ జిల్లా ఎన్నికల అధికారులుగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

ఎన్నికల ప్రక్రియపై చర్యలు..

అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నమోదైన ఓటర్ల జాబితాలకు అనుగుణంగా మున్సిపల్ ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా జాబితాలు సిద్ధం చేసి ప్రచురించేందుకు అనుసరించాల్సిన విధానాలు, వార్డుల విభజన, ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన విధానాలు మొదలు ఫలితాల ప్రకటన వరకు సంబంధిత అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు. వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం, శిక్షణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది డేటాబేస్ అప్‌డేట్, పీవోలు, పీపీవోలకు శిక్షణ, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్, స్ట్రాంగ్ రూంల గుర్తింపు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, అందుకోసం ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్‌ల ఎంపిక, జోనల్, నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నోడల్ అధికారుల నియామకం, వెబ్‌క్యాస్టింగ్, ఎన్నికల సామగ్రి సేకరణ వరకు వివిధ అంశాలపై దృష్టి నిలిపారు.

2019 జనవరి 1ని ప్రాతిపదికగా..

ఈనెల 4న వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలు ప్రచురిస్తారు. వీటిని సిద్ధం చేసే అధికారం మున్సిపల్ కమిషనర్లకు కల్పించారు. అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లకు ఈ జాబితాలు రూపొందించే అధికారాన్ని ఎస్‌ఈసీ అప్పగించింది.

- సంబంధిత మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలకు అనుగుణంగా 2019 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని ఫొటో ఓటర్ల జాబితాలు సిద్ధం చేసుకోవాలి
- ఇందులో ఓటర్ ఫొటో, పేరు, తండ్రి/తల్లి/భర్త పేరు, వయసు, లింగం, ఇంటి నంబర్, ఓటరు గుర్తింపు కార్డు నంబర్ ఉండేలా చూసుకోవాలి
- వార్డుల వారీగా మున్సిపల్ కమిషనర్లు ఓటర్ల జాబితాలు సిద్ధం చేసి ప్రచురించాలి
- ఓటర్ల జాబితాల్లో ఏ ఓటరు పేరు ఎదుట కూడా వారి కులం, వర్గం, జాతికి సంబంధించి వివరాలు పొందుపరచకూడదు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై...

పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు, పోలింగ్ స్టేషన్ల జాబితా తయారీ, ముసాయిదా ప్రచురణ, తుదిజాబితా ప్రచురణ బాధ్యతలను మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించిన భవనాలను మున్సిపాలిటీల రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తారు. ఈ నెల 13న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించిన పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలు ఎన్నికలు జరగనున్న సంబంధిత మున్సిపాలిటీలతో పాటు టీఎస్‌ఈసీ వెబ్‌పోర్టళ్లలో ప్రచురిస్తారు. ఈ నెల 4న మున్సిపల్ కమిషనర్ల ద్వారా పోలింగ్‌స్టేషన్ల ముసాయిదా జాబితా సిద్ధం చేసి 5న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 7న మున్సిపాలిటీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 8న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాల స్వీకరణ.. 9న వాటి పరిష్కారం, అదేరోజు పోలింగ్‌స్టేషన్ల తుదిజాబితా కలెక్టర్లకు అందజేస్తారు. 10న తుదిజాబితాను ఖరారు చేస్తారు. 13న తుది జాబితా ప్రచురణ.. 14న అధికారిక ప్రకటన ఉంటుంది.

వారు పల్లె ప్రగతిలో పాల్గొనవద్దు: ఎస్‌ఈసీ

జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న కలెక్టర్లు (హైదరాబాద్ మినహా), అదనపు జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు (జీహెచ్‌ఎంసీ మినహా) గురువారం నుంచి జరగనున్న రెండో విడత పల్లెప్రగతి కార్యక్రమంలో పాల్గొనవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) స్పష్టం చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంపీడీవోలు కూడా పాల్గొనకూడదని పేర్కొంది. అదనపు జిల్లా ఎన్నికల అధికారులుగా నియమితులైన జేసీ పల్లెప్రగతి కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఎస్‌ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. తమ వద్ద రిజిస్టరై, రిజర్వ్‌డ్ సింబళ్లు లేని ఏ రాజకీయ పార్టీ అయినా కామన్ సింబల్ కేటాయింపు కోసం ఈ నెల 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని బుధవారం ఎస్‌ఈసీ తెలిపింది. అయితే సదరు పార్టీ ఎన్నికలు జరగనున్న మొత్తం వార్డు స్థానాల్లో కనీసం 10 శాతం సీట్లలో పోటీ చేయాలని పేర్కొంది.

'బయోమెట్రిక్ విధానంతో ఇబ్బందులు'

సాక్షి, హైదరాబాద్: బీసీ సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న కాలేజీ విద్యార్థుల వసతి గృహాల్లో కొత్తగా ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ హాజరు విధానం విద్యార్థులకు కొత్త సమస్యలు తెచ్చిపెట్టిందని బీసీ సంక్షేమ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. చాలా మంది విద్యార్థుల వేలి ముద్రలు సరిపోలకపోవడంతో వారంతా హాస్టల్‌లో ఉన్నా గైర్హాజరైనట్లు నమోదు కావడం గందరగోళాన్ని సృష్టిస్తోందని పేర్కొంది. బయోమెట్రిక్ మిషన్లు పనిచేయకపోవడం, సమయ పాలన పెట్టడంతో ప్రత్యేక తరగతులకు వెళ్లే వారికి ఇబ్బందులు వస్తున్నాయని, హాస్టళ్లను వదలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపింది. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయడమో, లేక పక్కాగా అమలు చేయడమో చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

డైరీలను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో–ఆపరేటివ్, తెలంగాణ గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ డైరీ/క్యాలెండర్లను బుధవారం హైదరాబాద్‌లో అబ్కారీ, క్రీడా, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.